మధ్యాహ్న భోజనంలో కుళ్లిన కోడిగుడ్లు

ఉడకపెట్టిన తర్వాత రంగు మారుతున్న వైనం

తినకుండా పారేస్తున్న విద్యార్థులు

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం



మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేస్తున్న కోడి గుడ్లు కుళ్లిపోతున్నాయి. ఉడకబెట్టిన తర్వాత రంగు మారుతున్నాయి. నక్కపల్లి మండలంలోని ఉద్దండపురం హైస్కూల్, నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని తురకబడి హైస్కూల్‌లో శుక్రవారం కుళ్లిన గుడ్లు విద్యార్థుల్లో ఆందోళన కలిగించాయి. 3

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

విశాఖపట్నం

శనివారం 12 ఆగస్టు 2017 | 16



చెరువు కబ్జా



చింతలపాలెంలో నడిమి చెరువు

విస్తీర్ణం 25 ఎకరాలు

ప్రస్తుతం మిగిలింది రెండు ఎకరాలే..

కశింకోట మండలం చింతలపాలెం నడిమి చెరువు దర్జాగా ఆక్రమణ

విలువ రూ.50 కోట్ల పైమాటే

చెరకు, వరి, యూకలిప్టస్ సాగు

500 ఎకరాల ఆయకట్టుకు నీరు లేని పరిస్థితి

కబ్జారాయుళ్లకు నేతల అండదండలు

కశింకోట మండలంలోని చింతలపాలెం గ్రామంలో నడిమి చెరువు దాదాపు పూర్తిగా కబ్జాకు గురైంది. జాతీయ రహదారిని ఆనుకుని వుండడంతో ఇక్కడ భూముల రేట్లు ఎకరా రెండు కోట్ల రూపాయల వరకు పలుకుతున్నది. దీంతో పలువురు ఈ చెరువును ఆక్రమించేసి, పంటలు సాగు చేసుకుంటున్నారు. చెరువు కబ్జా కారణంగా నీరు నిల్వ వుండడం లేదు. ఫలితంగా 500 ఎకరాల ఆయకట్టుకు నీరు అందడంలేదని ఆయా రైతులు వాపోతున్నారు. 14

కౌలు రైతుకు రిక్తహస్తం

15 వేల మందికి రుణ అర్హత పత్రాలు జారీ

842 మందికి మాత్రమే పంట రుణాలు

పలురకాల కొర్రీలు వేస్తూ అప్పులు ఇవ్వని బ్యాంకులు

ఎల్ఈసీ, సీవోసీ చూపినా... ససేమిరా అంటున్న అధికారులు

భూ యజమాని ధ్రువీకరణ పత్రాలను చూసిన తర్వాతే ఇస్తామని విస్పష్టం



(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

జిల్లాలో కౌలు రైతులకు పంట రుణాల మంజూరులో బ్యాంకులు మొండి చేయి చూపుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేసినా, బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ అధికారులు ఆదేశాలు జారీ చేసినా... కౌలు రైతులకు రుణాల విషయంలో బ్యాంకర్లు మెట్టు దిగడంలేదు. అన్ని రకాల ధ్రువపత్రాలను పరిశీలించి, సరిగ్గా వుంటేనే అప్పు ఇస్తామని తేల్చి చెబుతున్నాయి. ఈ ఏడాది మొత్తం 15 వేల మంది కౌలు రైతులకు పంట రుణాలు మంజూరు చేయించాలని అధికారులు లక్ష్యంగా ...మిగతా 7వ పేజీలో...

కల్యాణపులోవ రైతుకు సాగు కష్టాలు

పూడిక, పిచ్చిమొక్కలతో అధ్వానంగా కాలువలు

నిధులు మంజూరైనా నిర్వహణ పనులు చేయని అధికారులు

నీటిని విడుదల చేసి పది రోజులు అయినా చివరి భూములకు చేరని వైనం

దమ్ములు కూడా చేయలేని పరిస్థితి

వరి నారు ముదిరిపోతున్నదని రైతుల ఆవేదన



కల్యాణపులోవ నీటిని విడుదల చేసి పది రోజులు అవుతున్నప్పటికీ చివరి భూములకు ఇప్పటికీ నీరు చేరలేదు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, తుప్పల వల్ల నీటి ప్రవాహం మందకొడిగా సాగుతున్నది. దీనికితోడు వర్షాలు లేక దమ్ము చేయడానికి కాలువల నీటిపై రైతులు ఆధార పడాల్సి వస్తున్నది. ఫలితంగా తమకు నీరు రావడంలేదని ఆయకట్టు శివారు భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-సెంటర్‌స్ప్రెడ్‌లో...

రోజుకు లక్ష..



సబ్ రిజిస్ట్రార్ల అక్రమ సంపాదన

సిబ్బందికీ అదే తరహాలో వాటాలు

ప్రతి పనికీ ప్రత్యేక రేటు

అడ్డగోలు వ్యవహారాలైతే అదనంగా వసూళ్లు..

సేవా కేంద్రాలుగా మార్చుచేస్తే మేలు

-వార్త 11వ పేజీలో...

ఖరీఫ్‌కు ఊపిరి



కేడీపేటలో కురుస్తున్న వర్షం

జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం

పల్లపు ప్రాంతాలు జలమయం

పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

మెట్ట పంటలకు జీవం

అన్నదాతలకు ఊరట

ఎండల నుంచి ఉపశమనం

జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. నర్సీపట్నం, కొయ్యూరు, అరకులోయ, రావికమతం, గొలుగొండ, అనకాపల్లి, తదితర మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మెట్ట పంటలకు, వరినారుమళ్లకు ఈ వర్షం ఎంతో దోహదం చేసింది. 16



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎంఎస్‌వీకే రాజు

నేడు, రేపు మానసిక వైద్యుల సదస్సు

అఖిల భారత మానసిక వైద్యుల సంఘం అధ్యక్షుడు బ్రిగేడియర్ డాక్టర్ ఎంఎస్‌వీకే రాజు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మానసిక వైద్యంలో వచ్చిన అధునాతన పద్ధతులు, కొత్తగా వస్తున్న మానసిక సమస్యలపై చర్చించేందుకు రెండు రోజులపాటు సదస్సును నిర్వహిస్తున్నట్టు అఖిల భారత మానసిక వైద్యుల సంఘం అధ్యక్షుడు బ్రిగేడియర్ డాక్టర్ ఎంఎస్‌వీకే రాజు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాల్లో హోటల్ నోవాటెల్‌లో జరిగే ఈ సదస్సుకు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన మానసిక వైద్యులు హాజరవుతున్నారన్నారు. 34 ఏళ్ల తరువాత మళ్లీ విశాఖలో సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

ప్రధానంగా మానసికంగా వస్తున్న సరికొత్త సమస్యలు, ఆధునిక వైద్య పద్ధతుల గురించి చర్చించనున్నామన్నారు. మానసిక సమస్యలకు మందులతో అందించే చికిత్స, సైకో థెరఫీ ద్వారా చేసే చికిత్సల గురించి వివరించడం జరుగుతుందన్నారు. సైకో థెరఫీ ద్వారా చేసే చికిత్సకు సంబంధించి వర్క్‌షాప్‌లు కూడా నిర్వహిస్తామన్నారు. మానసిక సమస్యలకు సంబంధించిన అనేక అంశాలపై వరుసగా కాన్ఫరెన్స్‌లను కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు అజిత్ బీడే, కోశాధికారి ముకేశ్ జోగేవాల్, జాతీయ ప్రధాన కార్యదర్శి గౌతమ్ సాహా, కార్యనిర్వాహక కార్యదర్శి జీవీఎస్ మూర్తి, కార్వనిర్వాహక అధ్యక్షుడు ఎన్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్

అవయవదాన దినోత్సవం రేపు

బీచ్‌రోడ్డులో భారీ ర్యాలీ

విశాఖపట్నం, ఆగస్టు 11 : అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవయవదాన దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించనున్నట్టు ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్ తెలిపారు. ఏఎంసీలో శుక్రవారం జరిగిన విలేకరుల సమివేశంలో ఈ నెల 13న అవయవదాన దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలను వివరించారు. అవయవాలు లభ్యం కాక దేశంలో ఏటా ఐదు లక్షల మంది మృతి చెందుతున్నారని, అవయవ దానం ప్రాముఖ్యాన్ని ప్రజలకు తెలిపే ఉద్దేశంతో కేజీహెచ్, ఏఎంసీతో పాటు సావిత్రీ బాయి పూలే ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 13వ తేదీ ఉదయం ఆరు గంటకు బీచ్‌రోడ్డులో భారీ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జేసీ సృజన, జిల్లా జడ్జి జ్యోతిర్మయి పాల్గొంటారన్నారు. అవయవ దానంపై మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉందన్నారు. అవయవదానం ఎన్టీఆర్ వైద్యసేవలో చేర్చడం ద్వారా ఉచితంగా నిర్వహించవచ్చునని సావిత్రీబాయి పూలే సొసైటీ సభ్యులు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్.బాబూరావు, ఎన్.శ్రీరామ్, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచం గ్యాడ్జెట్స్‌తో నిండిపోతోంది. ప్రతిఒక్కరి చేతిలో ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, ట్యాబ్లెట్‌లతో పాటు ఏదో ఇక గాడ్జెట్ కలిగివుంటున్నారు. వీటిని కొనుగోలు చేసిన కొత్తలో చాలా జాగ్రత్తగా చూసుకుంటాం. రానురాను గ్యాడ్జెట్స్‌పై అంత శ్రద్ధ చూపించం..వినియోగం గురించి పట్టించుకోం. అయితే వీటి నిర్వహణ మనం ఉపయోగించే దాన్నిబట్టే ఆధారపడి ఉందన్నది చాలామందికి తెలియదు. కొన్ని గ్యాడ్జెట్స్ వాడుతున్నప్పుడు అవి సక్రమంగా పనిలేదంటే అందులో హార్డ్‌వేర్ ఒక్కటే సమస్య కాదు. దాన్ని రన్ చేసే సాఫ్ట్‌వేర్‌లో కానీ అందులో కొత్తగా ఇన్‌స్టాల్ చేసే సాఫ్ట్‌వేర్స్‌లో గాని, వాటి వినియోగంలో మనం సక్రమంగా ఆపరేట్ చేసే తీరులోనైనా సమస్య ఉండొచ్చు. గ్యాడ్జెట్స్ కొనడమే కాకుండా వాటిని సక్రమంగా వినియోగిస్తేనే అవి బాగా పనిచేస్తాయి. వినియోగంలో నిర్లక్ష్యం వహిస్తే వాటి పనితీరు పూర్తిగా మందగించి... పూర్తిగా డెడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. గ్యాడ్జెట్స్ నిర్వహణలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చెబుతున్నారు.

గ్యాడ్జెట్స్..జర భద్రం

చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే ఎంతో సేఫ్

టెక్ ఫర్ యూ

ఎండాడ, ఆగస్టు 11: ల్యాప్‌ట్యాప్‌లను ఎక్కడపడితే వాడితే మరమ్మతులు తప్పవంటున్నారు సాంకేతిక నిపుణులు. ముఖ్యంగా ల్యాప్‌ట్యాప్‌లను బెడ్‌పై ఉంచడం... వినియోగించే వారికి అనుకూలంగా ఉండొచ్చు కానీ ఇలా దీర్ఘకాంగా వినియోగిస్తే ముప్పే.! మంచం పరుపుపై ల్యాప్‌టాప్‌లను ఎక్కువ సమయం ఉంచడం వల్ల మరింత వేడి ఉత్పన్నమై లోపల వున్న కాంపోనెంట్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. స్మార్ట్‌ఫోన్ వినియోగించే మహిళలు తమ ఫోన్‌లను బ్యాగ్‌లలో పడేస్తుంటారు. ఇలా వినియోగిస్తే స్ర్కీన్‌పై పగుళ్లు, గీతలు వంటివి ఏర్పడే అవకాశం ఉంది.

గ్యాడ్జెట్స్ క్లీనింగ్‌కు కెమికల్స్

గ్యాడ్జెట్‌లను క్లీన్ చేసేందుకు మార్కెట్లో అనేక రకాల కెమికల్స్ ఉన్నాయి. వీటిని ఉపయోగించడం సరైన పద్ధతి కాదు. కఠినమైన ద్రవ పదార్థాలతో తయారయ్యే కెమికల్స్ డివైస్ ప్లాస్టిక్ భాగాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. సాధ్యమైనంత వరకు ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్‌లను మెత్తటి తడిగుడ్డతో శుభ్రపర్చడం ఉత్తమం.

బ్యాకప్ తప్పనిసరి

కంప్యూటర్ హార్డ్ డిస్క్ ఎప్పుడైనా క్రాష్ అయ్యే అవకాశాలుంటాయి. సెల్‌ఫోన్ కూడా ఏదో ఒక సందర్భంలో పని చేయకుండాపోయే అవకాశాలున్నాయి. అందువల్ల ఫోన్‌తో పాటు కంప్యూటర్‌లోని డేటాను ఎప్పటికప్పుడు బ్యాకప్ చేసుకుంటే మంచిది.

రోజువారి కమ్యూనికేషన్ అవసరాలలో భాగంగా కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లకు రకరకాల డివైస్‌లను కనెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. వీటిని కనెక్ట్ చేసేటప్పుడు ఎంత జాగ్రత్త తీసుకుంటామో అంతే జాగ్రత్తగా డిస్ కనెక్ట్ చేయాల్సి వుంటుంది. ఎజెక్ట్ ప్రక్రియ సక్రమంగా లేనట్టయితే డేటా కరప్ట్ అయ్యే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



వినియోగంలో జాగ్రత్తలు

కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను నిరంతరాయంగా వాడేస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదంటున్నారు. వీటిని ఎక్కువ సమయం వినియోగించే క్రమంలో మధ్యమధ్యలో గ్యాప్ ఇస్తూ ఉండాలి. కీబోర్డు బటన్‌లపై అధిక ఒత్తిడి తీసుకురావడం వల్ల మన్నికను కోల్పోయే ప్రమాదం ఉంది. చాలామంది కంప్యూటర్ డెస్క్ పైనే కాఫీ, టీ వంటివి సేవిస్తుంటారు. పొరపాటున కీబోర్డుపై పడితే పాడయ్యే ప్రమాదం వుందని నిపుణులు సూచిస్తున్నారు.

పబ్లిక్ వై-ఫై కనెక్ట్ అయితే..

పబ్లిక్ వైఫై కనెక్ట్ అయి ఉన్నప్పుడు ఆన్‌లైన్ బ్యాంకింగ్, షాపింగ్ వంటి లావాదేవీలను నిర్వహించడం శ్రేయస్కరం కాదంటున్నారు నిపుణులు. ఈ విధమైన లావాదేవీలను నిర్వహించేకునేందుకు హోమ్, ఆన్‌లైన్ నెట్‌వర్క్ ఉపయోగించడం మేలు.

ఆన్‌లైన్ బ్యాకింగ్ సేవలను వినియోగాంచుకోవాల్సి వస్తే పబ్లిక్ వైఫైకు బదులు మొబైల్ డేటా ఉపయోగించుకోవాలి. వైఫై కంటే మొబైల్ డేటానే ఫాస్ట్. స్టార్ట్ ఫోన్‌లోని త్రీజీ నెట్‌వర్క్ కంటే వేగవంతమైన ఇంటర్నెట్ సర్వీస్‌ను పబ్లిక్ వైఫైలు అందించగలవు. అయితే డివైస్‌కు వైఫై రూటర్‌కు దూరం పెరిగేకొద్దీ కనెక్ట్‌విటీ వేగం మందగిస్తుంది. తాజాగా మొబైల్ ఫోన్ల కోసం అందుబాటులోకి వచ్చిన 4జీ కనెక్ట్‌విటీ త్రీజీ, వైఫై హాట్‌స్పాట్‌లతో పోలిస్తే వేగవంతమైన ఇంటర్నెట్‌ను కనెక్ట్‌విటీని ఆఫర్ చేస్తోంది.

డివైస్‌లో సెక్యూరిటీ సక్రమంగా లేకపోతే..

స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్‌ల్లో సెక్యూరిటీ లోపాలుంటే డివైస్ హ్యాకర్లకు అందుబాటులోకి వెళ్లినట్టే. విండోస్ ఫైర్‌వాల్‌ను తప్పనిసరిగా ఎనేబుల్ చేసి ఉంచుకోవాలి. అదే విధంగా స్టార్ట్‌ఫోన్‌లో యాంటీ వైరస్ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయాలి. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఓఎస్ అప్‌డేట్‌లను పొందడంతో సెక్యూరిటీ సమస్యల నుంచి విముక్తి పొందినట్టే..

తప్పనిసరైతేనే వైఫై

కొన్నిచోట్ల పబ్లిక్ వైఫైల పాస్‌వర్డ్ అస్తవ్యస్తంగా ఉండడంతో డేటాను హ్యాకర్లు సులువుగా తస్కరించే అవకాశాలున్నాయి. అత్యావసర పరిస్థితుల్లో మాత్రమే వైఫైను వినియోగించుకోండి. పబ్లిక్ వైఫైల ప్రాంతంలో ఏ విధమైన సాఫ్ట్‌వేర్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దు. దీంతో వ్యక్తిగత డేటాకు ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. ఇలా చేసినట్టయితే మాల్‌వేర్‌లతో కూడిన ప్రోగ్రామ్‌లను డివైస్‌లోకి పంపించి డేటాను దొంగలించేఅవకాశం వుంది. అందువల్ల పబ్లిక్ వైఫైల వద్ద సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోకపోవడం ఉత్తమం.



పబ్లిక్ వైఫే వినియోగిస్తే..

ప్రస్తుతం చాలా మంది పబ్లిక్ వైఫై పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా ఇంటర్నెట్ ఉచితం కాబట్టి షాపింగ్‌మాల్స్, కాఫీ షాప్స్, ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్ ఇలా అనేక ప్రాంతాల్లో ఉచిత వైఫై హాట్ స్పాట్‌లు అందుబాటులోకి వచ్చాయి. పబ్లిక్ వైఫైతో ఉచిత ఇంటర్నెట్‌ను యాక్సెస్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ సెక్యూరిటీ రిస్క్ మాత్రం అధికమనే చెప్పవచ్చు. పబ్లిక్ వైఫైను వినియోగించడం వల్ల కొన్ని సందర్భాలలో వ్యక్తిగత డేటా హ్యాక్ అయ్యే ప్రమాదం ఉంది. పబ్లిక్ వైఫై హాట్ స్పాట్‌లను స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లకు కనెక్ట్ చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే సేఫ్‌గా ఉండవచ్చంటున్నారు నిపుణులు.



చార్జింగ్ కేబుల్స్..హెడ్ ఫోన్స్

ఫోన్‌కు సంబంధించిన యాక్ససరీస్ అంటే చార్జింగ్ కేబుల్స్, హెడ్‌ఫోన్‌లను పదేపదే మడత పెట్టడం వల్ల కేబుల్స్ బ్రేకయ్యే అవకాశాలున్నాయి. అదేవిధంగా చాలా మంది ఫోన్, ల్యాప్‌టాప్‌లకు చార్జింగ్ పెట్టి అలాగే వదిలేస్తారు. అలా చేయడం ప్రమాదమని గ్రహించాలి. ఓవర్ చార్జింగత్‌తో గాడ్జెట్స్ పేలిపోయే అవకాశాలున్నాయి. దీంతో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటాయి.

మధ్యాహ్న భోజనంలో కుళ్లిన కోడిగుడ్లు

● ఉడకబెట్టిన తరువాత రంగు మారుతున్న వైనం
● తినకుండా పారేస్తున్న విద్యార్థులు
● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు


ఉద్దండపురం స్కూల్‌కు పంపిణీ చేసిన గుడ్లు


తురకబడి హైస్కూల్‌లో రంగుమారిన గుడ్లు

నక్కపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి మూడు సార్లు విద్యార్థులకు కోడి గుడ్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమలులోకి వచ్చింది. కోడిగుడ్డు సరఫరా బాధ్యతను మండలాల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే కాంట్రాక్టర్లు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నక్కపల్లి మండలానికి సంబంధించి మొదటి వారం సుమారు 15 పాఠశాలలకు కోడిగుడ్డు సరఫరా చేయలేదు. గురువారం ఉద్దండపురం సహా మరికొన్ని పాఠశాలలకు కోడిగుడ్లను సరఫరా చేశారు. ఈ గుడ్లను శుక్రవారం మధ్యాహ్నం ఉడకబెడితే అవి రంగుమారిపోయాయి. ఇందులో కొన్ని కుళ్లిపోయాయని హెచ్‌ఎం కోడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గుర్తించారు. కుళ్లిన కోడిగుడ్లను తినలేక విద్యార్థులు వాటిని బయటపడేశారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే తమను బాధ్యులను చేస్తారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. దీనిపై హెచ్‌ఎం కోడి శ్రీనివాసరావును సంప్రదించగా రెండో వారం నీలి రంగు స్టాంప్‌తో ఉన్న గుడ్లను సరఫరా చేశారని, అవి కూడా కుళ్లిపోయాయని ఆయన చెప్పారు.

తురకబడి హైస్కూల్‌లో

నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని తురకబడి హైస్కూల్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం సరఫరా చేసిన గుడ్లలో కొన్ని కుళ్లిపోయాయి. ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు గుడ్లు సరఫరా చేస్తుండడంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వాటిని తీసుకుని పాఠశాల వంటషెడ్డులో నిల్వ చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్న భోజన సమయానికి గుడ్లు ఉడకబెట్టగా కొన్ని గుడ్లు కుళ్లినవి కనిపించడంతో నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. ఉడకబెట్టిన గుడ్లు ముక్కలు ఉడిపోయి లోపలి పూర్తిగా నలుపు రంగులో కనిపిస్తుండడంతో విద్యార్థులు తినకుండా వదిలేశారు. గతంలో సరఫరా జరిగే గుడ్లన్నీ బాగానే ఉండేవని, ఈసారి వచ్చినవి ఇలా కుళ్లిపోయాయని నిర్వాహకులు చెప్పారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాలలకు సరఫరాచేసే గుడ్ల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పలువురు కోరుతున్నారు.

పీఆర్‌టీయూ జిల్లా సమావేశం రేపు

నర్సీపట్నం టౌన్ : ఈనెల 13న పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా సమావేశం అనకాపల్లిలోని గౌరీ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోపీనాథ్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఖండేపల్లి అంధ బాలుడి పింఛను వివాదం

సెప్టెంబర్ ఒకటికి వాయిదా

చోడవరం: అంధబాలుడికి పింఛను మంజూరుకు నిరాకరించిన జన్మభూమి కమిటీ సభ్యులపై వేసిన కేసు విచారణ సెప్టెంబరు ఒకటో తేదీకి వాయిదా పడింది. మండలంలోని ఖండేపల్లి గ్రామానికి చెందిన అంధబాలుడు సియ్యాద్రి దుర్గాప్రసాద్‌కు పింఛను మంజూరును స్థానిక జన్మభూమి కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. దీనిపై దుర్గాప్రసాద్ తండ్రి స్థానిక లోక్‌అదాలత్‌లో ఫిర్యాదు చేశారు. జన్మభూమి కమిటీ సభ్యులతో పాటు ఎండీవోకు లోక్‌అదాలత్ న్యాయమూర్తి నోటీసులు జారీ చేశారు. ఈ విషయం విదితమే. ఈ కేసులో ఇప్పటికే ఎండీవో, జన్మభూమి కమిటీ సభ్యులను న్యాయమూర్తి విచారించారు. సంబంధిత బాలుడికి కొత్త జాబితాలోపింఛను మంజూరు చేస్తామని జన్మభూమి కమిటీ సభ్యులు కోర్టుకు తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులు ఓ లేఖను కోర్టు సమర్పించగా, కేసును శుక్రవారానికి వాయిదా వేశారు. అయితే ఎండీవో చిట్టిరాజు, పంచాయతీ కార్యదర్శి రామ్మూర్తి, ఖండేపల్లి సర్పంచ్ జెట్టి మాణిక్యం, స్థానిక జన్మభూమి కమిటీ సభ్యులు శుక్రవారం విచారణకు హాజరయ్యారు. అయితే ఈ కేసును వచ్చే నెల ఒకటికి వాయిదా వేస్తూ జడ్జి ఆదేశాలు ఇచ్చారు.

16 నుంచి ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు

● నాలుగు రోజులపాటు పలు నంబర్ల వేలం
● ముందురోజు వాహనం కొన్నవారూ అర్హులే
● ఆన్‌లైన్ ప్రక్రియలో జాప్యం, ఆఫ్‌లైన్‌లో అందుబాటులోకి..
● భారీగా ఆదాయం సమకూరే అవకాశం

విశాఖపట్నం(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో కొద్దికాలంగా పెండింగ్‌లో వున్న ఫ్యాన్సీ నంబర్లకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ చేశాక.. ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు నిలిచిపోయింది. ఫ్యాన్సీ నంబర్లను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చే సాఫ్ట్‌వేర్ ఇప్పటికీ సిద్ధం కాలేదు. దీంతో అనేక సీరీస్‌లు పెండింగ్‌లో వున్నాయి. వాటి వల్ల లక్షలది రూపాయల ఆదాయం ప్రభుత్వం కోల్పోతున్నది. అలాగే టీఆర్ నంబర్ తీసుకుని నచ్చిన లక్కీ, ఫ్యాన్సీ నంబర్ల కోసం ఎదురుచూస్తున్న వాహనదారులకు గత ఏడాదిన్నర కాలంగా నిరాశే మిగులుతోంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఒక సీరీస్‌లోని ఫ్యాన్సీ నంబర్లను బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని కూడా ఆఫ్‌లైన్‌లో వాహనచోదకులు దక్కించుకునేలా ఏర్పాట్లు చేశారు.

ఇప్పటివరకు ఫ్యాన్సీ నంబర్ల కోసం ఏ విధమైన ప్రక్రియను అవలంబిస్తున్నారో.. అదే విధంగా కొత్త సీరీస్ నంబర్లను పొందవచ్చని డీటీసీ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రధాన కార్యాలయంలో ఏపీ 31 డీఎఫ్, గాజువాకలో ఏపీ 31 డీహెచ్, అనకాపల్లిలో ఏపీ 31 డీజీ సీరీస్‌లలో ఫ్యాన్సీ నంబర్లను తాజాగా అందుబాటులోకి తెస్తున్నారు. ఆయా సీరీస్‌లో మిగిలి వున్న ప్రీమియం నంబర్లను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చారు. మిగిలిన సీరీస్‌లను త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక సీరీస్‌లో మిగిలిన 66 ప్రీమియం నంబర్లను విభాగాలుగా విడదీసి ఒక్కో రోజు కొన్ని నంబర్లు చొప్పున వేలం వేయనున్నారు.

16వ తేదీ..

0001, 0099, 0333, 0555, 0123, 0222, 0369, 0003, 0006, 0007, 0111, 0234, 0306, 0405, 0789

17వ తేదీ..

0009, 0444, 0666, 0777, 0888, 0567, 0786, 0818, 0909, 1188, 1234, 1314, 1818, 1899, 2277, 2772

18వ తేదీ..

0999, 1111, 2222, 3333, 4444, 1116, 3366, 2345, 2727, 2799, 3636, 3699, 4545, 4554, 4567,

19వ తేదీ...

9999, 5555, 6666, 7777, 8888, 3456, 4455, 4599, 5678, 6336, 6633, 6789, 7227, 7722, 8118, 8811, 9009, 9099

ఆయా నంబర్లను ముందు రోజు వాహనం కొనుగోలు చేసిన వారు కూడా సొంతం చేసుకోవచ్చు. డీలర్ వద్ద టీఆర్ నంబర్ తీసుకుని, మరుసటి రోజు నేరుగా ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనవచ్చు. అవసరమైన డీడీ, పత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలని డీటీసీ కోరారు. ఈ నంబర్ల ద్వారా భారీగా ఆదాయం సమకూరుతుందని అధికారులు భావిస్తున్నారు.

సీఆర్‌జడ్ పరిధిలో బోర్‌వెల్స్ వేయొద్దు

నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి
సంబంధిత ప్రాంతాల్లో నిఘా పెంచండి
అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘన జరగకుండా నిరంతర నిఘా ఉంచాలని, ఆ ప్రాంతంలో బోర్‌వెల్స్ వేయకుండా చూడాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కోరారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఛైర్మన్ హోదాలో మాట్లాడారు. తీరం వెంబడి సీఆర్‌జెడ్ పరిధిలో నిత్యం తనిఖీలు నిర్వహించాలన్నారు. మడ అడవులు అంతరించిపోకుండా తీసుకుంటున్న చర్యలను విశాఖ పోర్టు ట్రస్టు అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పర్యాటక శాఖ రుషికొండలో చేపడుతున్న పనులు సీఆర్‌జెడ్ నిబంధనలకు లోబడి చేయాలన్నారు. ఎక్కడైనా సవరణ చేయాల్సి వుంటే కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ హరినారాయణ, ఉడా చీఫ్ అర్బన్ ప్లానర్ వి.భవానీశంకర్, జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ విద్యుల్లత, పోర్టు ట్రస్టు సూపరింటెండెంట్ రాజు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు జెండా ఎగురవేసే అవకాశం

జీవో విడుదల చేసిన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్

నర్సీపట్నం : ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే స్వాతంత్రదినోత్సవ వేడుకల్లో ప్రజాప్రతినిధులకు జెండా ఎగురవేసే అవకాశం కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ 556 జీవోను విడుదల చేసిందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోపీనాథ్ శుక్రవారం తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అయితే జెడ్పీటీసీ సభ్యులు, ప్రభుత్వ ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మండలాధ్యక్షులు (ఎంపీపీ), ఎంపీటీసీ సభ్యులు జెండా ఎగురవేయవచ్చున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలు ఉన్న చోట సర్పంచ్‌లు జెండా ఎగురవేయవచ్చునని జీవోలో పేర్కొన్నారన్నారు. ఈవిషయంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఎటువంటి సందేహాలు పెట్టుకోరాదన్నారు. దీనికి సంబంధించి పాఠశాలలకు ఉత్తర్వులు అందాయన్నారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL : AT VISAKHAPATNAM

O.A.NO. 950 OF 2016

Between:
HDFC Bank Limited, Anakapalli
Represented, by its Deputy Manager cum Power of Attorney Holder, Sri C.Varun Prajna Vardha. ... Applicant
And
Sri GOVINDHA RONGALI and another ...Defendants
To
D-1. Sri GOVINDHA RONGALI, Son of Gowresh, Hindu, aged 39 years, D NO : 4 -166, KOTTAPETA STREET, THUMMAPALA , ANAKAPALLI, VISAKHAPATNAM-531032.

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

WHEREAS the applicant has instituted an application under Sec 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Hon'ble Tribunal at 10.30 am or at such time immediately thereafter according to the convenience of Tribunal on 24.08.2017 to answer the claim.
2.You are directed to collect the OA book on your appearance before the Tribunal.
3.If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
4.You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.
5.Take notice that in default of your appearance on the day mentioned herein before the proceeding will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this 27th day of July 2017.
AUTHORISED SIGNATORY
DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, ఉత్సవాలు... తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి

విలేకరుల ఫోన్ నంబర్లు

అరకులోయ	94408 67497	డుంబ్రిగుడ	94918 02681
అరకు రూరల్	94401 13448	హుకుంపేట	8500097775
అనంతగిరి	73828 27555	ముంచంగిపుట్టు	94928 19993
అనంతగిరి రూరల్	94411 79874	పెదబయలు	94923 44301

రైతులకు రూ.11 కోట్ల రుణాలు అందజేశాం

ఏడాదిలో తిరిగి చెల్లిస్తే ఎంతో ప్రయోజనం ● అరకు ఎస్‌బీఐ క్యాష్ ఆఫీసర్ గోవింద పడాల్

అరకురూరల్, ఆగస్టు 11: అరకులోయ ఎస్‌బీఐ పరిధిలో రైతులకు భూమి పట్టాలను ప్రాతిపదికగా చేసుకుని.. ఇప్పటివరకు రూ.11 కోట్లు రూపాయలు అందజేశామని ఎస్‌బీఐ క్యాష్ ఆఫీసర్ గోవిందపడాల్ పేర్కొన్నారు. గిరిజన రైతులతో అరకులోయ ఎస్‌బీఐ అధికారులు 'బ్యాంకు సేవలు-రుణాలు మంజూరు' చేసే విధి విధానాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రైతులకు భూమి పట్టాలపై వ్యవసాయ రుణాలు 7 శాతం వడ్డీపై మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఇలా ఇప్పటివరకు రూ. 11 కోట్లు మంజూరు చేశామన్నారు. మంజూరు చేసిన రుణాన్ని రైతు ఏడాది లోపు చెల్లిస్తే 7 శాతం వడ్డీకి మంజూరు చేసిన రుణం నుంచి నాలుగుశాతం వడ్డీ తగ్గించి 3 శాతం వడ్డీ మాత్రమే బ్యాంకు తీసుకుంటుందన్నారు. ఇలా చెల్లించడంతో రైతుకు పావలా వడ్డీకే





మాట్లాడుతున్న గోవిందపడాల్, సదస్సుకు హాజరైన రైతులు

రుణం అందినట్టవుతుందన్నారు. రుణం తీసుకుని ఏడాది దాటితే రూపాయివడ్డీ పడుతుందన్నారు. దీనివల్ల రైతుకు రుణభారంతో పాటు వడ్డీ కూడా పెరిగిపోతుందని పేర్కొన్నారు. అందుకే అవసరానికి తగ్గట్టు రుణం పొందడం, చేతికి ఫలసాయం అందిన వెంటనే రుణం ఏడాది లోపే చెల్లించేలా రైతులు సిద్ధపడాలన్నారు. ఇలా నిర్దిష్ట కాల వ్యవధిలో రుణాలు చెల్లించే రైతులకు ప్రతీ ఏటా పదిశాతం అదనంగా రుణం మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించే పలు పథకాల్లో ఇలాంటి రైతులకు ప్రాధాన్యత నివ్వడం జరుగుతుందన్నారు. రూపే (ఏటీఎం) కార్డులు మంజూరు చేస్తామన్నారు. రుణ ఎగవేతదారులకు కేసులు, కోర్టులతో సంబంధం లేకుండా బ్యాంకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ప్రకటించిందని బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ షన్ముఖ శ్రీనివాసరావు వివరించారు. ఈ అవకాశం ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు ఉందన్నారు. ఇలా వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకుంటే 30 రోజుల్లో సెటిల్‌మెంట్‌లో తెల్పిన మొత్తంలో 20 శాతం రుణం 30 రోజుల్లో జమచెయ్యాలన్నారు. అదే విధంగా 70 రోజుల్లో 80 శాతం జమచేస్తే 5శాతం వడ్డీ రైతుకు తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు కాంచన, శ్రావణి, మాధురి, కళ పాల్గొన్నారు.



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

బాస్కి పంచాయతీలో 'మీజిల్స్, రుబెల్లా' టీకాలు

డుంబ్రిగుడ, ఆగస్టు 11: మండలంలోని స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఉన్న బాస్కి పంచాయతీ గాయిబందా, మొర్రిగుడ గ్రామాలలో.. మీజిల్స్ (తట్టు), రుబెల్లా టీకాలను సోమవారం గిరిజన చిన్నారులకు వైద్యసిబ్బంది వేశారు. డుంబ్రిగుడ వైద్యాధికారి శాంతికిరణ్ శెట్టి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. మీజిల్స్ (తట్టు), రుబెల్లాను అరికట్టాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోందని పేర్కొన్నారు. 15 సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పక వారి తల్లిదండ్రులు ఈ టీకాలను వేయించాలని కోరారు. ఈ కార్యమంలో హెచ్.వి. శాంతమణి, హెల్త్ అసిస్టెంట్‌లు ఎస్.స్వామి, కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను మర్చిపోలేరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరి

చింతపల్లి: ఉత్తమ ఉపాధ్యాయులను విద్యార్థులు ఎప్పుడూ మర్చిపోరని పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం హెచ్ఎం గోవిందరావు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ప్రభావతి, సుభద్ర, బాలన్న, కుమారి, గంగాధరం, రామన్నలను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయులు గోవిందరావు గతంలో పనిచేసిన పాఠశాలల్లో అందించిన సేవలు, అభివృద్ధి చేసిన తీరును విద్యార్థులు అతని చెబుతుంటారన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారన్నారు. ఉపాధ్యాయులకు బదిలీ సాధారణమేనని, ఎక్కడ విధులు నిర్వహించినా అంకితభావం అవసరమని స్పష్టం చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేదుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పద్మకుమారి, పీఆర్‌టీయూ నాయకులు యూవీ గిరి, గెమ్మెలి మోహన్, సీనియర్ ఉపాధ్యాయులు కంకిపాటి వీరన్నపడాల్, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లోచల రామకృష్ణ పాల్గొన్నారు.

చింతలవీధి-పెదబయలు రహదారికి శంకుస్థాపన

పెదబయలు: పాడేరు మండలం చింతలవీధి జంక్షన్ నుంచి పెదబయలు మండల కేంద్రం వరకు రహదారికి అరకులోయ నియోజక వర్గం ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారికి రూ.30కోట్లు వ్యయం అవుతుందన్నారు. గత 70 ఏళ్లలో పాలించిన పాలకులకు దీటుగా అతి తక్కువ కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో గిరిజన ప్రాంతాల్లోనూ రవాణా వ్యవస్థ అవసరమని గుర్తించి, రోడ్లను విస్తరిస్తున్నామన్నారు. అదే విధంగా త్రాగునీరు, విద్యుత్ అందరికి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు

జెడ్పీటీసీ సాగర వసంతకుమారి, ఎంపీపీ ఎస్.ఉమామహేశ్వరరావు, గూడ సర్పంచ్ కంబిడి జ్ఞానప్రకాశ్, మఠం సర్పంచ్ మజ్జి పద్మ, తెలుగుదేశం నాయకులు సన్యాసిదొర, కొండయ్య, రామూర్తి, తిరుపతిరావు, కాసులమ్మ, పాండు, తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ హెచ్‌పీ బంక్‌లో పెట్రోల్ ఖాళీ



ఆయిల్ నిల్వ లేక నిర్మానుష్యంగా ఉన్న బంక్

అరకురూరల్: అరకులోయలో హిందుస్థాన్ పెట్రోల్‌బంక్‌లో ఆయిల్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పెట్రోల్,డీజిల్ అవసరమయ్యేవారంతా ఇండియన్ ఆయిల్ బంక్‌కు చేరుకోవడంతో వాహనాలు బారులు తీరాయి. వినియోగదారులకు తగ్గట్టుగా జీసీసీ నిర్వహించే హెచ్‌పీ బంక్ సేవలు అందించలేకపోతోందని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు బంక్‌లో ఆయిల్ అయిపోవడం, ఒకటి రెండు రోజులు తర్వాత ఆయిల్ రావడంతో వినియోగదారులు జీసీసీ నిర్వహణపై అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లు

39 మంది గిరిజనులకు అందజేత

అనంతగిరిరూరల్, ఆగస్టు 11: మండలంలోని టోకూరు పంచాయతీలో శుక్రవారం ఉచిత గ్యాస్ కనక్షన్లను లబ్దిదారులకు స్థానిక సర్పంచ్ సారాసోము అందజేశారు. జీసీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్ డిపోల వద్ద ఆయా పంచాయతీలలో అందజేస్తున్నారు.

అందులో భాగంగా శుక్రవారం టోకూరు పంచాయతీలోని 39 మంది గిరిజనులకు గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేశారు. ఐదు కిలోల గ్యాస్



గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న సర్పంచ్ సారాసోము

సిలెండర్లతో పాటు స్టవ్, రెగ్యులేటర్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సేల్స్‌మ్యాన్ అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

పాడేరు: ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై 108 వినతులు వచ్చాయి. ఈ విన్నపాలను ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి స్వీకరించారు. ప్రాధాన్యత ప్రకారం ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ప్రజావాణి అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని పీవో ఆదేశించారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వచ్చిన ఈ వినతుల వివరాలిలా ఉన్నాయి.

తమ పిల్లలకు బెస్ట్ అవైలబుల్ సీట్లు కేటాయించాలని కోరుతూ, 3, 5, 8 తరగతులకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో అర్జీలు సమర్పించారు. ట్రైకార్ రుణాలు కావాలని జి.మాడుగుల మండలం కుంబిడిసింగి గ్రామానికి చెందిన తలారి పెద్దబ్బాయి, అదే మండలం కోరాపల్లి గ్రామానికి చెందిన కోరాబు సింహాచలం కోరారు. తనకు సివిల్స్ కోచింగ్ అవకాశం కల్పించాలని హుకుంపేట మండలం సూకూరు గ్రామానికి చెందిన వరదాని మోహన్ కోరగా, పాడేరు మండలంలో పలు పంచాయతీల్లో ఈ-సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు.

రూ.20.64 లక్షల ఉపాధి నిధులు స్వాహా

పెదబయలులో సామాజిక తనిఖీలు ● మృతి చెందిన వారి పేరిట పింఛన్లు దిగమింగిన వీఆర్వోలు, కార్యదర్శులు

● కూలి చెల్లింపుల్లో పోస్టల్ సిబ్బంది చేతివాటం ● పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల తొలగింపు

పెదబయలు: మండలంలోని 23పంచాయతీల్లో ఉపాధి పనులకు సంబంధించి రూ.20.64 లక్షలు స్వాహా అయినట్టు డ్వామా.. అదనపు పథక సంచాలకులు లచ్చన్న తెలిపారు. ఈ మొత్తాన్ని సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేస్తున్నామన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 2016 జనవరి 1 నుంచి 2017 ఏప్రిల్ 30వరకు నిర్వహించిన పనులకు రూ.19 కోట్ల 80 లక్షల 76 వేల 596 నిధులకు సంబంధించి సామాజిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో పలువుకు పంచాయితీ కార్యదర్శులు, వీఆర్వోలు అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించారు. మండంలోని గుల్లేలు ఇతర పంచాయతీల్లో రెండేళ్ల క్రితం మృతి చెందిన వారి పేరిట పింఛన్ల రూపంలో రూ.3.94లక్షలు కాజేసినట్టు పేర్కొన్నారు. దీనికి సంబంధించి వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శుల నుంచి రికవరీ పెట్టగా ఇప్పటకి రూ.49,500 వసూలు చేశామన్నారు. అదే విధంగా పోస్టల్ సిబ్బంది చెల్లింపుల సమయంలో చేతివాటం ప్రదర్శించి కూలీలకు రూ.100నుంచి 150 వరకు కోత విధించారన్నారు. ఈ వ్యవహారంలో రూ.16.70 లక్షలు రికవరీ పెట్టామన్నారు. గోమంగి, గుల్లేలు పంచాయతీలకు పోస్టల్ సిబ్బంది కూడ గున్నిరావుకు పోలీసు కేసు పెట్టామని, మరొకరి ద్వారా పంపిణి చేయాలని ఆదేశించామన్నారు. ఉపాధి కూలీలకు బయోమెట్రిక్ లేక పోస్టల్ ఖాతాల్లో రూ.55 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయనారు.



మాట్లాడుతున్న డ్వామా అదనపు పథక సంచాలకులు లచ్చన్న

కాఫీ రైతులకు రూ.23 లక్షల ప్రోత్సాహకం ఇవ్వాలి

అలాగే 2013-2014 ఆర్థిక సంవత్సరంలో కాఫీతోటలు పెంపకం చేసిన రైతులకు ప్రోత్సహాక నిధులు 23లక్షలు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే సాంకేతిక లోపం వల్ల జాప్యమైందని, ఇకనైనా స్పందించి ఆ మొత్తాన్ని రైతులకు అందేల చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఏపీడీవో ఖాతాల్లో గ్రావెల్ రోడ్లకు సంబంధించి గోమంగి, పెదకోడపల్లి రోడ్లకు రూ.6.21లక్షలు ఉన్నాయన్నారు. ఆ మొత్తంతో నెల రోజుల్లో రోడ్ల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా గుల్లేల ఫీల్డ్ అసిస్టెంట్, గోమంగిలో మేట్లు (సూపర్ వైజర్ స్థాయి) గుల్లేల పంచాయితీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని ఆదేశించారు. అలాగే గోమంగిలో శ్రమశక్తి సంఘాల మేట్లను తొలగించి కొత్త వారిని నియమించాలని ఏపీడీవో ఆనంద్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్టేట్ రీసోర్స్ పర్సన్ రమేష్, ఎస్ఆర్‌పీలు సుర్యానారాయణ, ఎం.గోవింద్, ఎంపీపీ ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ గంగాభవాని, ఎంపీడీవో సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమ తెరలను తప్పక వినియోగించాలి

నిక్కుల గంగాధరం, మలేరియా సూపర్‌వైజర్, పెదబయలు

ఇంటర్వ్యూ



ప్రశ్న: మలేరియా వ్యాధిని ఎలా గుర్తిస్తున్నారు?

జవాబు: ఆడ ఎనాఫిలస్ దోమ కాటు వల్ల మలేరియా సంభవిస్తుంది. దీన్ని ప్రభుత్వ ఆస్పత్రిల్లో స్లైడ్ టెస్టు, ఆర్‌డీటీ ద్వారా గుర్తిస్తారు.

ప్రశ్న: మలేరియా వ్యాధి సోకకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు: ప్రస్తుతం ఏజెన్సీలో అధికంగా ప్లాస్మోడియం ఫాల్సిఫారన్ (పీఎఫ్) అనే పారసైట్ వల్ల ఈ వ్యాధి సంభవిస్తుంది. ఇది అధికంగా మురుగుకాలువలు, నీటి నిల్వలు, ఉన్న ప్రదేశాల్లో గుడ్లు పెడతాయి. ముందు జాగ్రత్తలో భాగంగా వీటిని దోమల మందు స్ప్రేయింగ్ చేస్తే చనిపోయే అవకాశం ఉంది. కావునా ప్రభుత్వం చేపడుతున్న మలేరియా స్ప్రేయింగ్‌ను ప్రజలు సహకరించారు. అలాగే దోమ తెరల వినియోగం చాలా అవసరం.

ప్రశ్న: మలేరియా నిర్ధారణ అయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

జవాబు: మలేరియా వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే మలేరియా బాధితులు తప్పని సరిగా ఏసీటీ మాత్రలు వాడాల్సి ఉంటుంది. కోర్సు మొత్తం పూర్తి చేయాలి. దీంతో మలేరియా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

ప్రశ్న:మలేరియా నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు?

జవాబు: ప్రభుత్వ ఆస్పత్రిల్లో మలేరియా మాత్రలను పుష్కలంగా ఉంచుతున్నారు. గ్రామాల్లో దోమల మందు స్ప్రేయింగ్ పనులు చేపడుతున్నారు. దోమ తెరల పంపిణీ చేడుతోంది. వాటిని గిరిజనులు సద్వినియోగించుకోవాలి.

- పెదబయలు

ట్రైకార్ రుణాలకు 17న ఇంటర్వ్యూలు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం ఎస్‌బీహెచ్ బ్యాంక్ పరిధిలో దరఖాస్తు చేసుకున్న ట్రైకార్.. ఎస్సీ, బీసీ రుణాలకు ఈనెల 17 న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. శుక్రవారం ఈ అంశమై ఎంపీడీఓ రమేష్‌రామన్ ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకులోనే నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. సంబంధిత వ్యక్తులు పూర్తి వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

సీనియారిటీ జాబితా అభ్యంతరాలకు 16 వరకు గడువు

పాడేరు: గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ (గణితం, సామాన్య శాస్త్రం, సోషల్, తెలుగు, ఆంగ్లం, హింధీ) ఉపాధ్యాయుల తుది సీనియారిటీ జాబితాను రూపొందించామని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను తెలిపేందుకు ఈ నెల 16వ తేదీ వరకు గడవు ఉందన్నారు.. ఈలోగా అభ్యంతరాలు తెలిపితే సవరణ చేపట్టి, జాబితాలను ఏజెన్సీలోని ఏటీడబ్ల్యూవోల వద్ద లభ్యమవుతాయన్నారు. జీవో నంబర్-3 ప్రకారం పదోన్నతులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు స్థానిక గిరిజనులై ఉండాలని, అందుకు తమ కుటుంబం 1950 జనవరి 26 నుంచి ఇక్కడే నివసిస్తున్నట్లు తహసీల్దార్ వద్ద ధ్రువీకరణ పొందాలన్నారు.

గిరిజనులు ఏ విధంగా ధనవంతులో చెప్పాలి

● రాష్ట్ర గవర్నర్‌కు వైసీపీ నాయకుల ప్రశ్న

అనంతగిరిరూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సభలో గిరిజనులే ధనవంతులు, మేమే పేదవాళ్లం అని రాష్ట్ర గవర్నర్ అన్న మాటలు సరికాదని అరకులోయ వైసీపీ సమన్వయకర్త శెట్టి అరుణకుమారి అన్నారు. 'అన్న వస్తున్నాడు, నవరత్నాలు తెస్తున్నాడు' కార్యక్రమంలో భాగంగా వైసీపీ నాయకులు టోకూరు, బొర్రా పంచాయతీల్లో పర్యటించారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎన్నో సమస్యలు తాండవిస్తుండగా గిరిజనులు ఎలా ధనవంతులు అయ్యారో అర్థం కాలేదన్నారు. అలాగే బాక్సైట్ తవ్వకాలను రద్దుచేశామని గొప్పగా చెప్పుకునే సీఎం చంద్రబాబునాయుడు జీవో 98 ను ఎందుకు రద్దు చేయడంలేదో చెప్పాలన్నారు. జగన్ ప్రకటించిన నవరత్నాల వివరాలతో కూడిన కరపత్రాలు గిరిజనులకు అందజేశారు. బొర్రాలో మోటారు యూనియన్ ప్రతినిధులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శెట్టి గంగాధరస్వామి, వైసీపీ మండలాధ్యక్షుడు శెట్టి ఆనంద్, శెట్టి అప్పాలు, కోఆప్షన్ సభ్యులు షేక్ రఫీ పాల్గొన్నారు.


గిరిజనులకు నవరత్నాల కరపత్రాన్ని అందిస్తున్న వైసీపీ ప్రతినిధులు

బీజేపీతోనే దేశ సుస్థిరత

అరకు పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ కె.ఉమామహేశ్వరరావు

పాడేరు: భారతీయ జనతా పార్టీతోనే దేశ సుస్థిరత సాధ్యమని బీజేపీ అరకులోయ పార్లమెంట్ కన్వీనర్ కె.ఉమామహేశ్వరరావు అన్నారు. దేశ 13వ ఉప రాష్ట్రపతిగా ఎం.వెంకయ్యనాయుడు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగల సత్తా ఒక్క బీజేపీకి మాత్రమే ఉందన్నారు. అలాగే ఒక తెలుగు వ్యక్తికి ఉప రాష్ట్రపతి పదవిని కట్టబెట్టి, బీజేపీ తెలుగు ప్రజలకు ఇస్తున్న ప్రాధాన్యతను దేశానికి చాటి చెప్పిందన్నారు. వెంకయ్యానాయుడు సైతం ఉప రాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చే నాయకుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అరకు పార్లమెంట్ ప్రచార కార్యదర్శి పి.రవికుమార్, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు సల్లా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కాకర చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు

కించుమండలో స్తంభించిన సెల్ సిగ్నల్స్

డుంబ్రిగుడ: మండంలోని కించుమండలో ఉన్న సెల్ టవర్‌లో గత రెండు రోజులుగా సెల్ సాంకేతాలు మూగబోయాయి. ఫలితగా చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీటీసీ సభ్యురాలు ప్రమీల అన్నారు. సెల్ వినియోగదారులు ఆగచాట్లు పడుతున్నారని ఈ విషయమై బిఎస్ఎన్ఎల్ అధికారులు తక్షణమే స్పందించి సెల్ వినియోగదారులకు సిగ్నల్స్ అందుబాటులో తేవాలని కోరారు. సెల్ సంకేతాలు లేక అనేక మంది రోగులకు 108 అంబులెన్స్ సేవలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

చింతపల్లి డీఎస్పీ అనిల్



చింతపల్లి: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టేనని డీఎస్పీ పి.అనిల్ అన్నారు. చింతపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ సివిల్ సర్జన్ టి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం డీఎస్పీ, సీఐ చంద్రశేఖరరావు, వైద్యాధికారి రఘురామ్‌తో పాటు 20 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. 12 గ్రాముల హిమోగ్లోబిన్ కలిగిన వారు రక్తదానం చేయవచ్చునన్నారు. రోడ్డు ప్రమాదాల్లోనూ, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం జరిగిన వారికి అత్యవసర పరిస్థితిలో రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉందన్నారు. యువకులు, ఉద్యోగులు రక్తదానంపై అందరిలోనూ చైతన్యం తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సువర్ణ, ఎల్టీలు కిశోర్, ప్రకాష్ పాల్గొన్నారు.

తెలుగు కథ విస్తృతం కావాలి

ఇతర భాషల్లోకి అనువాదాలు అవసరం

కేంద్ర సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఆగస్టు 11: తెలుగు కథలు కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితం అవుతున్నాయని, ఆంగ్లం, హిందీతో పాటు దేశంలోని భాషల్లోకి అనువదించాల్సిన అవసరం ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ సమావేశ మందిరంలో భువన్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూరు కథలతో కూడిన కథానందనం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి గుర్తింపు రావాలన్నారు. ఇతర భాషల్లోకి తెలుగుకథలు అనువదించడం ద్వారా జాతీయస్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు.

కథానిక ప్రచారకర్త, రచయిత వేదగిరి రాంబాబు మాట్లాడుతూ రచయిత మానవతావాది కావాలన్నారు. రచయిత ఆలోచనలు, భావాలే కథల్లో దర్శనమిస్తాయన్నారు. ఏయూ వీసీ జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సాహిత్యాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలకు వర్సిటీపరంగా తగిన సహకారం అందిస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఈడీ కేవీ రమణారావు, భువన్ కల్చరల్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ భువనేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

మళ్ల జగన్నాథం సాహిత్య ప్రతిభా పురస్కారాలను కథా సాహిత్యంలో 2015 సంవత్సరానికి మధురాంతకం నరేంద్రకు, 2016 సంవత్సరానికి అట్టాడ అప్పలనాయుడుకు, కవిత్వంలో 2015 సంవత్సరానికి బిక్కి కృష్ణకు, 2016 సంవత్సరానికి జగద్ధాత్రికి, కార్టూనింగ్‌లో 2015 సంవత్సరానికి బీవీఎస్ ప్రసాద్‌కు, 2016 సంవత్సరానికి ఎంఎస్ రామకృష్ణలకు అందజేశారు. పలువురు రచయితలు చదివి వినిపించిన కథలను రికార్డు చేసి సృజన స్వరం పేరిట వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించడం అందరినీ అలరించింది.

దేశాభివృద్ధికి యువతే కీలకం

లక్ష్యంతో ముడిపడి ఉండే వ్యక్తిత్వం

కష్టనష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటేనే విజయాలు సొంతమంటున్న నిపుణులు

నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

ఏయూ గ్రౌండ్స్ నుంచి వుడా చిల్డ్రన్ థియేటర్ వరకు 2కే ర్యాలీ

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ప్రపంచ జనాభాలో యువకుల సంఖ్య భారీగానే ఉంది. ఏ దేశాభివృద్ధికైనా యువత శక్తి సామర్థ్యాలు, పని తీరు చాలా ముఖ్యం. అందుకే దేశానికి యువతే వెన్నుముక అని చాలామంది అభివర్ణిస్తుంటారు. నేటి యువతే రేపటి భవితగా ప్రపంచం మొత్తం గుర్తిస్తోంది. యువతంలో ఉండే శక్తి అంతులేనిది, అపారమైనది. అటువంటి శక్తిని దేశ ఉన్నతికి, అభివృద్ధికి పణంగా పెడితే ఆ దేశానికి తిరుగుండదన్నది జగమెరిగిన సత్యమే. యువత విజయాలు వ్యక్తిగతమైనవి మాత్రమే కాదు.. సామాజికమైనవి.. జాతీయ, అంతర్జాతీయమైనవి. అటువంటి యువత బాధ్యతలను గుర్తు చేసేందుకు, వారిలోని శక్తి, సామర్థ్యాలను చాటిచెప్పేందుకు గత 17ఏళ్లుగా అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ప్రత్యేక థీమ్‌తో..

అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఏటా ప్రత్యేకమైన థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'శాంతి పరిరక్షణలో యువత పాత్ర' అనే నినాదంతో నిర్వహిస్తున్నారు. మొదటిసారిగా యువజన దినోత్సవాన్ని 2000 ఆగస్టు 12న ఐక్యరాజ్యసమితి నిర్వహించింది. ప్రధానంగా యువత సమస్యలను పరిష్కరించడంతోపాటు వారిలోని శక్తి, సామర్థ్యాలను తెలియజేసే ఉద్దేశంతో నిర్వహిస్తున్నారు. యుక్త వయసులో ఉన్నప్పుడు ప్రత్యేక కార్యాచరణతో పనులను చేయడం వల్ల ఉన్నత స్థానానికి చేరుకునే అవకాశముంది.

కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి

యువత ప్రధానంగా కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించినప్పుడే భవిష్యత్ గొప్పగా ఉండేందుకు అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా యుక్త వయసు నుంచే కష్ట పడేతత్వాన్ని అలవర్చుకోవడం వల్ల ఉన్నత స్థానానికి చేరుకునే అవకాశముంది.



ముఖ్యంగా మంచి భవిష్యత్తుకు పునాది వేసుకునేందుకు ఈ వయసు ఎంతగానో దోహదపడుతుందనే విషయాన్ని గుర్తించుకోవాలి. సరికొత్త విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతోపాటు పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన, ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. జీవితంలో డబ్బుతో పాటు బంధాలు, బాంధవ్యాలను కూడా గుర్తించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అదే సమయంలో జీవితాన్ని నాశనం చేసే మద్యం, దూమపానం, ఇతర దురలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా జీవితంలో సగభాగం ఉన్నత స్థాయికి చేరుకున్నట్టేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఉన్నత లక్ష్యాలు..

ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని ఆ దిశగా తమ కృషిని ప్రారంభించాలని నిపుణులు చెబుతున్నారు. లక్ష్యం ఉన్నతంగా ఉన్నప్పుడే వ్యక్తిత్వం కూడా ఆ విధంగా ఉంటుందందటున్నారు. లక్ష్య సాధనలో ఎదురయ్యే ఆటుపోట్లు, కష్ట, నష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే విజయాలను సాధించేందుకు అవకాశముంది. అధిక శాతం మంది తమ ప్రయాణంలో ఎదురయ్యే ఇబ్బందులను తట్టుకోలేక మధ్యలోనే తమ లక్ష్యాలను వదిలేస్తుంటారు.



అటువంటి వారు జీవితంలో సరైన స్థానాలకు చేరుకోలేక ఇబ్బందులపడుతుంటారని, అకుంఠిత దీక్షతో కృషి చేసిన వారు గొప్ప స్థానాలకు చేరి పలువురికి ఆదర్శంగా నిలిచేందుకు అవకాశం ఉంటుంది.

యవ్వనం.. సమయం..డబ్బు..

యవ్వనం, సమయం, డబ్బు.. ఈ మూడు ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో విలువైనవి. యవ్వనంలో సరైన నిర్ణయాలు తీసుకుని, వాటిని సాధనకు కష్టపడే వ్యక్తులు జీవితంలో గొప్పగా ఎదిగేందుకు అవకాశముంది. యవ్వనంలో ఉన్నప్పుడే చాలామంది సమయాన్ని వృథా చేసుకుంటూ తప్పటడుగులు వేసి వ్యసనాలకు బానిసలుతుంటారు...జీవితాలను నాశనం చేసుకుంటారు. డబ్బును కూడా ఈ వయసులోనే అధిక శాతం మంది యువత వృథాగా వెచ్చిస్తుంటారు. ఈ మూడు అంశాల్లో తప్పటడుగులు వేసి జీవితాలను నాశనం చేసుకునేవారు ఎంతో మంది ఉన్నారు. ఈ మూడు అంశాల పట్ల పరిణితితో వ్యవహరించి, పక్కా ప్రణాళికతో ముందుకుసాగితే ఉన్నత స్థానాలను అధిరోహించి పలువురికి ఆదర్శప్రాయులుగా నిలుస్తారని నిపుణులు చెబుతున్నారు.

గుర్తుంచుకునే వయస్సు

యవ్వనంలో చేసే ప్రతి పని ఎక్కువ కాలం గుర్తుంటుంది. అనేక పనులు చేసే వయస్సు, గుర్తుంచుకునే పరిణితి ఈ వయసులో వారికే అధికంగా ఉంటుంది. కాబట్టి, యువత ఈ వయస్సులో గొప్ప గొప్ప విషయాలను తెలుసుకునేందుకు సమయం కేటాయిస్తే అవన్నీ గుర్తుంటాయి. ముఖ్యంగా పుస్తకాలు చదవడం, ఆధ్యాత్మిక భావనతో వ్యవరించడం వీలైనంత వరకు కుటుంబ సభ్యులతో కలిసి ఉండడం వల్ల ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఇవీ కార్యక్రమాలు..

అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం తొమ్మిదిన్నరకు ఏయూ గ్రౌండ్స్ నుంచి వుడా చిల్డ్రన్ థియేటర్ వరకు వందల మంది యువతతో 2కే ర్యాలీని నిర్వహిస్తున్నారు. అనంతరం చిల్డ్రన్ థియేటర్‌లో వ్యాస రచన, వక్తృత్వం పలు అంశాలపై డిబెట్, ప్యానెల్ డిస్కషన్, భావ వ్యక్తీకరణ, పోస్టర్ కాంపిటేషన్స్ ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ పోటీలకు భారీ సంఖ్యలో యువతీ, యువకులు హాజరవుతారని అధికారులు చెబుతున్నారు. ఆయా పోటీల విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లు, బహుమతులను అందించనున్నారు.

శక్తి, సామర్థ్యాలను వెలికితీసేందుకే..



యువతలోని శక్తి, సామర్థ్యాలను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ఎంతోమంది యువతీ, యువకులు తమలో దాగివున్న ప్రతిభను బయటకు తీసేందుకు ఉత్సుకత ప్రదర్శించే అవకాశముంది. ఏటా నిర్వహించే యువజనోత్సవాల్లో వందల మంది యువతీ, యువకులు పలు పోటీల్లో పాల్గొని తమ సామర్థ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు చెప్పే మంచి మాటలు, వారి సూచనలు కూడా యువత అభివృద్ధికి, వారు ఏర్పాటు చేసుకోబోయే గొప్ప లక్ష్యాల సాధనకు ఉపయోగపడే అవకాశముంది.

-డాక్టర్ ఎ.సిరి, జిల్లా యువజన సంక్షేమాధికారి



ముగ్గురు ఆడ శిశువులతో తల్లి రాశ్మ

ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు

పండంటి ఆడ బిడ్డలకు జన్మనిచ్చిన గిరిజన మహిళ

సీలేరు, ఆగస్టు 11: సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఒక గిరిజన మహిళ ముగ్గురు ఆడ శిశువులకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా వున్నారు. జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ బంధవీధి గ్రామానికి చెందిన కిల్లో రాశ్మకు శుక్రవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు సీలేరు పీహెచ్‌సీకి తరలించారు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో ముగ్గురు ఆడపిల్లలను ప్రసవించింది. తన భార్యకు ఇది ఆరో కాన్పుని, అంతకుముందు ఐదుగురు పిల్లలు ఉన్నారని భర్త కిల్లో సత్తిబాబు తెలిపాడు. సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు తల్లి, బిడ్డలను పరీక్షించి ఆరోగ్యకరంగానే ఉన్నారని చెప్పారు.

కలెక్టరేట్‌ను ఆధునీకరిస్తాం: కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం: కలెక్టర్ కార్యాలయాన్ని ఆధునీకరిస్తామని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సనా ట్రస్టు జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో సుమారు 20 బయో టాయ్‌లెట్లు, ఐదు వేల లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లానిటేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక కలెక్టరేట్‌గా రూపొందించేందుకు మరిన్ని మౌలిక వసతులు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, ఖాళీ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీవీఎంసీ సహకారంతో ఏర్పాటు చేసిన పార్కును కూడా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. హుద్‌హుద్ తుఫానులో తీవ్రంగా దెబ్బతిన్న కార్యాలయాన్ని ఇప్పటివరకు కొంతమేరకు మరమ్మతులు చేశామని, త్వరలోనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతామన్నారు. అంతేగాకుండా సోలార్ ప్యానల్ ద్వారా కార్యాలయానికి విద్యుత్తు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వికలాంగులు, వృద్ధులకు సహాయపడే విధంగా త్వరలోనే లిఫ్ట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ సృజన, పలువురు అధికారులు, సనా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ బ్రహ్మానందం

పనితీరులో తేడా వస్తే వేటు

నలుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్ల తొలగింపు: హౌసింగ్ డీఈఈ

దేవరాపల్లి: పనితీరులో తేడా వస్తే వేటు తప్పదని గృహ నిర్మాణ శాఖ డీఈఈ బ్రహ్మానందం హెచ్చరించారు. స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో శుక్రవారం విలేఖరులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎనిమిది మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పని చేస్తున్నారని, వారిలో పనితీరును బాగులేని కారణంగా నలుగుర్ని విధుల నుంచి తొలగించామని చెప్పారు. 2016-17లో 1250 గృహాలు మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటివరకు 232 ఇళ్లు ప్రారంభించలేదని చెప్పారు. త్వరితగతిన ఇళ్ల పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. తాజాగా మరో గృహాలు మంజూరు కాగా, వాటిలో 207 ఇళ్ల పనులు ప్రారంభించలేదన్నారు. పల్స్ సర్వే, సాధికార సర్వేలో నాలుగు మండలాల్లో 13,505 ఇళ్లు అవసరమని తేలిందన్నారు. గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. గృహాలు మంజూరైన వారు సిమెంట్ అవసరమైతే మాడుగుల రావాలన్నారు. దేవరాపల్లిలో కూడా త్వరలో సిమెంట్ గోదాము ఏర్పాటు చేస్తామన్నారు. డీఈఈ వెంట ఏఈ దేముడు ఉన్నారు.

కంప్యూటర్లు వచ్చేశాయోచ్..

ఏఎల్ పురం ఉన్నత పాఠశాలకు కంటైనర్‌తో కంప్యూటర్లు


అన్ని సదుపాయాలతో అందులోనే బోధన..!

కంపెనీదే నిర్వహణ బాధ్యత

మంత్రి అయ్యన్న కృషితో జిల్లాలో ప్రప్రథమం

తల్లిదండ్రులు, విద్యార్థుల హర్షం





ఏఎల్ పురం ఉన్నత పాఠశాలకు వచ్చిన హెచ్‌పీ కంటైనర్ ఇదే.. కంటైనర్ లోపల ఉన్న కంప్యూటర్లు

కృష్ణాదేవిపేట:

ఏఎల్.పురం విద్యార్థులకు అధునాతన కంప్యూటర్ విద్య అందుబాటులోకి వస్తుంది. జిల్లాలోనే ప్రప్రథమంగా అన్ని సదుపాయాలతో కూడిన బోధన ఇక్కడ ఉంటుంది. ఇప్పటికే కంటైనర్‌లో కంప్యూటర్లు ఉన్నత పాఠశాలకు చేరిపోయాయి. ఇక తరగతులను ప్రారంభించడమే తరువాయి!

గొలుగొండ మండలం ఏఎల్.పురం గ్రామాన్ని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. మంత్రి కృషితో ఈ గ్రామంలోని ఉన్నత పాఠశాలకు సాంకేతిక విద్య అందుబాటులోకి వస్తుంది. రాష్ట్రంలోనే మూడు జిల్లాలకు మంజూరు కాగా, అందులో విశాఖపట్నం జిల్లాలోని ఏఎల్.పురం ఉండడం ఇక్కడ విద్యార్థుల అదృష్టంగా చెప్పవచ్చు. ఇందులో భాగంగా ఉన్నత పాఠశాలకు శుక్రవారం కంటైనర్‌తో కూడిన కంప్యూటర్లు వచ్చాయి.

హెచ్‌పీ కంపెనీ ఆర్థిక సాయంతో రాష్ట్రంలోని మూడు చోట్ల కంప్యూటర్ కంటైనర్లు ఇచ్చారు. ఇందులో గుంటూరు జిల్లాలో ఒకటి, రాష్ట్ర రాజధాని అమరావతిలో మరొకటి ఉండగా, విశాఖపట్నం జిల్లా గొలుగొండ మండలం ఏఎల్.పురం మూడోది.

గతంలో 2005-2015 వరకు పదేళ్ల పాటు ఐపీటీ 1300, ఎడ్యుకమ్ నిట్ ప్రాజెక్టులో భాగంగా కంప్యూటర్ విద్యనందించారు. తదనంతరం ప్రభుత్వం పాఠశాలల్లో కంప్యూటర్ విద్యకు విద్యార్థులు నోచుకోలేదు. మంత్రి అయ్యన్నపాత్రుడి కృషితో తాజాగా ఏఎల్.పురం ఉన్నత పాఠశాలకు అధునాతనమైన కంప్యూటర్ బోధన అందుబాటులోకి వస్తుంది. దీంతో ఈ పాఠశాలలో ఉన్న సుమారు 900 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. కాగా, కంటేనర్‌లోనే అన్ని సదుపాయాలతో బోధన సాగనుంది. దీని నిర్వహణ బాధ్యత అంతా హెచ్‌పీ కంపెనీ భరిస్తుంది.

కంప్యూటర్‌లో నైపుణ్య సాధనకు అవకాశం

ఏఎల్.పురం ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు రావడం, అధునాతనంగా బోధన జరగనుండడం ఇక్కడ విద్యార్థుల అదృష్టమని జడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ అన్నారు. ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు కంప్యూటర్ విద్యలో నైపుణ్యతను సాధించేందుకు ఇది మంచి అవకాశంగా ఆయన పేర్కొన్నారు. ఈ కంటైనర్‌లోనే కంప్యూటర్లు, ప్రింటర్లు, ఏసీ, ఇన్వర్టర్లు ఉంటాయని, అందులోనే బోధన సాగుతుందని చెప్పారు. దీని విలువ సుమారు రూ.27 లక్షలు ఉంటుంది, అంతా హెచ్‌పీ కంపెనీ చూసుకుంటుందని, ఇది మంత్రి అయ్యన్న కృషి ఫలితమేనన్నారు. ఆయనకు విద్యార్థులు, తల్లిదండ్రుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కౌలు రైతుకు రిక్తహస్తం!

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకోగా, ఇంతవరకు 842 మందికి మాత్రమే రుణాలు అందాయంటే బ్యాంకర్ల వ్యవహారశైలి ఏ విధంగా వుందో అర్థం చేసుకోవచ్చు. బ్యాంకర్ల తీరుపై కౌలు రౌతులు నిరాశ చెంది, ఎప్పటి మాదిరిగానే ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు.

జిల్లాలో 2017-18 సంవత్సరంలో 15 వేల మంది కౌలు రైతులకు రుణ అర్హత ధ్రువీకరణ (ఎల్‌ఈసీ) పత్రాలు అందజేయాలని అధికారులు భావించారు. ఇప్పటికే ఉన్న 12 వేల కార్డులను మినహాస్తే మరో మూడు వేల మందికి ఈ ఏడాది కొత్తగా ఎల్‌ఈసీలు అందజేయాలని రెవెన్యూ శాఖకు బాధ్యతలు అప్పగించారు. వీరికి జూన్ నెలాఖరునాటికే ఎల్‌ఈసీలు జారీ చేయాల్సివున్నా, తహసీల్దార్ల జాప్యంతో జూలై చివరినాటికి సగం మందికి కూడా ఎల్‌ఈసీలు అందలేదు. ఎట్టకేలకు ఈ నెల మొదటి వారానికి అందరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇంతవరకు బాగానే వున్నప్పటికీ ఎల్‌ఈసీ తీసుకుని బ్యాంకులకు వెళ్లిన కౌలు రౌతులకు రుణాల మంజూరు విషయంలో చుక్కెదురవుతున్నది.

అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో రెండు వందలకుపైగా ప్రభుత్వ రంగసంస్థలకు చెందిన బ్యాంకులు ఉన్నాయి. కౌలు రైతులకు కూడా రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయా బ్యాంకుల ఉన్నతస్థాయి అధికారులు పలు సందర్భాల్లో చెబుతూ వచ్చారు. కానీ వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. జిల్లాలో ఎస్‌బీఐ, డీసీసీబీ, ఏపీజీవీబీ, ఆంధ్రాబ్యాంకులు మాత్రమే కౌలు రుణాలు అందజేస్తున్నాయి. రైతులు రుణాల కోసం రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఎల్‌ఈసీ, వ్యవసాయ శాఖ జారీచేసిన సాగు ధ్రువీకరణ(సీవోసీ) పత్రాలు తీసుకెళ్లితే, బ్యాంకర్లు రకరకాల కారణాలు చూపి రుణాలు ఇవ్వడం లేదని పలువురు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 15 వేల మంది కౌలు రైతులకు ఖరీఫ్ పంట రుణాలు మంజూరు చేయాల్సివుండగా ఆగస్టు మొదటి వారానికి కేవలం 842 మందికి మాత్రమే రుణాలు అందజేశారు.

పత్రాలు అన్నీ ఉన్నా..

కౌలు రైతులకు రెవెన్యూ శాఖ జారీ చేసిన ఎల్‌ఈసీ ధ్రువీకరణ, వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో వాస్తవిక పరిస్థితిని పరిశీలించి అందించిన సాగు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయవచ్చని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఎకరా వరి సాగుకు రూ.26 వేల వరకు, చెరకు పంటకు రూ.49 నుంచి రూ.55 వేలు వరకు రుణాలు అందించే అవకాశం ఉంది. బ్యాంకర్లు మాత్రం కౌలుకు తీసుకున్న భూయజమాని ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన తరువాతే రుణాలు ఇస్తామని మెలిక పెడుతునాన్నరు. భూయజమాని గతంలో రుణం తీసుకునివుండే కొత్తగా రుణం ఇచ్చేది లేదంటూ కౌలు రైతులకు రుణ మంజూరుకు అడ్డు చెబుతున్నారు. తమకు సంబంధించిన అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు అందజేసినా, భూ యజమానికి చెందిన ఆధార్, బ్యాంకు ఖాతాలు ఇతరత్రా వివరాలు అందజేసి పూచీకత్తు ఇవ్వాలంటూ బ్యాంకర్లు మెలికపెడుతున్నారని కౌలు రైతులు చెబుతున్నారు. మరోవైపు భూ యజమానులు తమ భూమిపై కౌలు రైతు రుణం పొంది, భవిష్యత్తులో తిరిగి చెల్లించలేకపోతే తమ నుంచి వసూలు చేస్తారేమోనన్న భయంతో పూచీకత్తు సంతకాలు పెట్టేందుకు వెనకడుగు వేస్తున్నారు.

అన్ని పత్రాలతో వస్తే రుణాలు ఇస్తాం

-శరత్‌బాబు, మేనేజర్, జిల్లా లీడ్ బ్యాంక్

కౌలు రైతులకు కూడా పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నారు. ఎల్‌ఈసీ, సీవోసీలతోపాటు బ్యాంకర్లు అడిగిన పత్రాలు సమర్పిస్తే రుణాల మంజూరుకు ఎటువంటి అభ్యంతరం లేదు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కౌలు రైతులకు రుణాలు మంజూరు వేగవంతం చేయాలని అన్ని బ్రాంచీలకు ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే జిల్లాలో వివిధ బ్యాంకుల ద్వారా కౌలు రైతులకు రూ.4 కోట్ల వరకు రుణాలు అందజేశాం.

గుర్తింపు కార్డులే అందలేదు



నేను ఏడేళ్లుగా ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, చెరకు సాగు చేస్తున్నాను. ఇప్పటి వరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖల నుంచి ఎంటువంటి గుర్తింపు కార్డులు అందలేదు. బ్యాంకు నుంచి రుణం కూడా పొందలేదు.

-ఎస్.చిట్టిబాబు, రైతు, పీఎన్‌ఆర్ పేట, ఎలమంచిలి మండలం

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి



రుణ అర్హత కార్డులు ఉన్నా బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదు. బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలకు పెట్టుబడులు పెడుతున్నాం. ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు రుణాలు అందించేలా చర్యలు చేపట్టాలి.

-ఎస్.కన్నంనాయుడు, రైతు, కె.సంతపాలెం

కల్యాణపులోవ రైతుకు సాగు కష్టాలు

కల్యాణపులోవ జలాశయం



పూడిక, పిచ్చిమొక్కలతో అధ్వానంగా కాలువలు చివరి ఆయకట్టుకు అందని నీరు



చీమలపాడు వద్ద ప్రధాన కాలువ పరిస్థితి



దమ్ములు లేక బీడును తలపిస్తున్న మర్రివలస పంట పొలాలు

రావికమతం:

కల్యాణపులోవ జలాశయం నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేసి పది రోజులు అవుతున్నప్పటికీ కాలువల చివరి భూములకు ఇప్పటికీ నీరు చేరలేదు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, విపరీతంగా పెరిగిపోయిన తుప్పల వల్ల నీటి ప్రవాహం మందకొడిగా వుంది. దీనికితోడు వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో పొలాలను దమ్ము చేయడానికి పూర్తిగా కాలువల నీటిపై ఆధార పడాల్సి వస్తున్నది. ఫలితంగా తమకు నీరు రావడంలేదని ఆయకట్టు శివారు భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఈ సమయానికి దమ్ము పనులు, వరినాట్లు వేసే కూలీలతో పొలాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. కానీ ఈ ఏడాది చాలా గ్రామాల్లో దమ్ము పనులే మొదలు కాలేదు. ప్రస్తుత పరిస్థితులనుబట్టి వరినాట్లు ఆలస్యం అవుతాయని రైతులు అంటున్నారు.

కల్యాణపులోవ జలాశయం కింద తొమ్మిది పంచాయతీల పరిధిలో 4,484 ఎకరాల ఆయకట్టు వుంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులుకాగా, ప్రస్తుతం 451.6 అడుగులు వుంది. ఆయకట్టుకు 13.7 కిలోమీటర్ల ప్రధాన కాలువతోపాటు 17 పిల్ల కాలువల ద్వారా నీరు అందాలి. కానీ కాలువల నిర్వహణ అధ్వానంగా వుంది. కొంతమేర సిమెంట్ లైనింగ్ వున్నప్పటికీ, కాలువల్లో పూడిక, పిచ్చితుప్పలు, ఊదగడ్డి పెరిగిపోయాయి. వీటిని తొలగించకపోవడంతో కాలువల నుంచి నీరు ములకలాపల్లి, జడ్.కొత్తపట్నం, గొంపవానిపాలెం, జడ్.బెన్నవోలు, దొండపూడి, కొత్తకోట, మత్సవానిపాలెం గ్రామాల వరకే పారుతున్నది. దీంతో ఆయా గ్రామాల రైతులు దమ్ములు చేసి నాట్లు వేస్తున్నారు. రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి పది రోజులు అవుతున్నప్పటికీ ఆయకట్టు చివరన వున్న ఆర్.కొత్తూరు, మర్రివలస, వమ్మవరం, కన్నంపేట గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలకు ఇంతవరకు చుక్కనీరు కూడా చేరలేదు. దీంతో ఆయా రైతులు వరి నాట్లు వేయలేకపోతున్నామని, నారు ముదిరిపోయి, నాటడానికి పనికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తునారు.



మర్రివలస ఎలిశెట్టి వారి పొలాల వద్ద పూడిక, కొబ్బరి దుక్కలతో నిండి ఉన్న కాలువ

నిధులున్నా పనులు చేయించలేదు

కల్యాణపులోవ జలాశయం ప్రధాన కాలువలో పూడిక, తుప్పలు తొలగింపునకు, టి.అర్జాపురం మరిశా వారి పొలాల వద్ద ప్రధాన కాలువ గట్టుకు గతంలో పడిన గండిని పూడ్చడానికి, గంపవానిపాలెం సమీపంలో, ఆర్.కొత్తూరు వద్ద కాలువల మరమ్మతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.32 లక్షలు మంజూరు చేసింది. ఆయకట్టు సంఘం ఈ నిధులతో నిర్వహణ, మరమ్మతు పనులు చేయాల్సి వుంది. కానీ కాలువ గట్లకు ఇరువైపులా ఉన్న తుప్పలను తూతూమంత్రంగా తొలగించి, కాలువలో పేరుకుపోయిన పూడిక, తుప్పలను తొలగించలేదు. కాగా వర్షాలు పడక, వరి నారుమళ్లు ఎండిపోతున్నాయని, రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు ఎమ్మెల్యే రాజును కోరడంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. కానీ ఇంతవరకు తమ భూములకు నీరు చేరలేదని చివరి ఆయకట్టు రైతులు వాపోతున్నారు. సాగునీటి కాలువల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు ఇచ్చినప్పటికీ, స్థానిక నీటి సంఘం నేతలు, ఇరిగేషన్ అధికారులు వాటిని సద్వినియోగం చేయడంలేదని వారు ఆరోపిస్తున్నారు.

కాలువలను గాలికొదిలేశారు

బలిరెడ్డి కన్నంనాయుడు, మర్రివలస



కాలువలకు 2004వ సంతవ్సరానికి ముందు సిమెంట్ లైనింగ్ చేయకపోవడంతో తమ భూములకు నీరు సరిగా అందేది కాదు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో కాలువలకు సిమెంట్ లైనింగ్ చేశారు. రెండు మూడేళ్ల వరకు ఆయకట్టు చివరి భూములకు కూడా సమృద్ధిగా నీరు అందింది. తరువాత కాలువల నిర్వహణ పనులను గాలికొదిలేశారు. కాలువల్లో పూడిక, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. సాగునీటి సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

వరి నారు ముదిరిపోతోంది

అమ్మిరెడ్డి రాముడు, మర్రివలస




మాది కల్యాణపులోవ చివర ఆయకట్టు ప్రాంతం. ఏటా వరినాట్లు ఎప్పుడు వేస్తామో తెలియని పరిస్థితి. కాలువలకు నీటి విడుదల చేస్తారు. మా పొలాలకు మాత్రం చాలా ఆలస్యం చేరతాయి. కొన్నిసార్లు వర్షాధారంపైనే పంటలను పండించుకోవాల్సి వస్తున్నది. వరినారు అందివచ్చింది. నాట్లు వేద్దామంటే నీరు లేదు. ఇప్పుడు నాట్లు వేయకపోతే వరినారు పనికిరాకుండా పోతుంది. మా ఊరు రైతులందరిదీ ఇదే పరిస్థితి. పాలకులు, అధికారులు పట్టించుకోరు. మా ఇక్కట్లు తొలగవు.

నీటి విడుదలను పెంచుతున్నాం

సత్యనారాయణ, ఏఈ, కల్యాణపులోవ ప్రాజెక్టు

రిజర్వాయర్ నుంచి కాలువకు తొలుత 25 క్యూసెక్కుల నీటిని విడుదల చేశాం. ప్రస్తుతం 50 కూసెక్కులకు పెంచాం. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడం, వరినాట్లుకు పూర్తిగా కాలువల నీటిపైనే ఆధార పడడంతో చివరి భూములకు నీరు అందడం కొంచెం ఆలస్యమవుతుంది. కాలువల్లో పూడికతీత, తుప్పల తొలగింపునకు రూ.8 లక్షలు మంజూరయ్యాయి. పనులు చేయిస్తున్నాం.



కాలువలో పెరిగిన ఏనుగు జమ్ము

పర్యాటకం పరవళ్లు

వచ్చేనెల నుంచి జనవరి వరకు ఉత్సవాలు

డిసెంబర్‌లో విశాఖ ఉత్సవ్


ఏడు ఈవెంట్లకు రూ.16 కోట్లు విడుదల

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

పర్యాటక ఉత్సవాలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. పర్యాటకులను ఆకర్షించడానికి విశాఖ వేదికగా ఏడు ఉత్సవాలు నిర్వహించనున్నది. వచ్చేనెల చివరి నుంచి జనవరి వరకు దాదాపుగా ప్రతి నెల ఒకటి నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించింది. గతంలో ఎదురైన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ప్రతి ఉత్సవం నిర్వహణ బాధ్యతను ఒక ఏజెన్సీకి అప్పగించింది. ఇప్పటివరకు ఉత్సవాల కోసం స్థానికంగా వున్న పారిశ్రామిక, వాణిజ్య సంస్థల నుంచి వసూలుచేసే విధానానికి తెరదించారు. ప్రతి ఉత్సవానికి నిర్ణీత మొత్తం కేటాయించింది. ఏడు ఉత్సవాలకు రూ.16 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తిరుపతి తరువాత రాష్ట్రంలో పర్యాటక పరంగా ఎక్కువగా వచ్చేది విశాఖపట్నానికే. అంతర్జాతీయంగా విశాఖకు పర్యాటక బ్రాండ్ ఇమేజ్ తీసుకురావడానికి అనేక ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం, ఈవెంట్స్ నిర్వహించాలని నిర్ణయించింది. గతంలో అరకు, విశాఖ ఉత్సవ్ మాత్రమే నిర్వహించిన ప్రభుత్వం ఈ పర్యాయం ఏడు కార్యక్రమాలకు షెడ్యూల్ ఇచ్చింది. రాష్ట్రంలో నాలుగు ప్రధాన కేంద్రాలను ఎంపికచేయగా వాటిలో విశాఖ ఒకటి. విశాఖకు సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే పర్యాటకుల తాకిడి జనవరి వరకు కొనసాగుతుంది. దీనిని పరిగణనలోకి తీసుకుని వచ్చే నెలాఖరు నుంచే ఉత్సవాలు చేపట్టనున్నారు. అయితే విశాఖ, అరకు ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాళ్లు ఏర్పాటుచేసేవారు. విశాఖకు అంతర్జాతీయ బ్రాండ్ తీసుకురావాలంటే ప్రపంచంలో అనేక రకాల ఈవెంట్లు నిర్వహణ, ఆయా రంగాల్లో ప్రముఖులు పాల్గొనేలా ఉత్సవాలు నిర్వహించనున్నారు. విశాఖ ఉత్సవ్‌తోపాటు కబడ్డీ, పడవల పందాలు, బీచ్ మారథాన్, వంటల పోటీలు, ఫ్యాషన్.. ఇలా ప్రతి ఉత్సవ్ పర్యాటకులకు మెప్పించేలా వుంటుందని పర్యాటక అధికారులు అంచనా వేస్తున్నారు. బీచ్‌లో మారథాన్ పోటీలను 64 టీవీలు ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఈ ఉత్సవ్‌ను రూపొందించారు. ఒకసారి ఇటువంటి ఉత్సవాలకు విశాఖ వేదికగా ఖరారుచేసి నిర్వహిస్తే భవిష్యత్‌లో అంతర్జాతీయంగా పేరున్న కళాకారులు, క్రీడాకారులు, ఆయా రంగాల్లో నిపుణులు వస్తారని పర్యాటక శాఖ ఈడీ శ్రీరాములునాయుడు అన్నారు.

ఉత్సవ్ పేరు	రోజులు	తేదీలు
1. బీచ్ మారథాన్	రెండు	నవంబర్ 11, 12
2. విశాఖ ఉత్సవ్	నాలుగు	డిసెంబర్ 22-25
3 .ఫైరింగ్ ఉత్సవ్	రెండు	అక్టోబర్ 7, 8
4. యాచ్ పెంటేంగల్	ఐదు	డిసెంబర్‌లో వారంరోజులు
5. ప్రోకబడ్డీ	తేదీలు ఖరారు కాలేదు	
6. సౌండ్ ఆన్ క్లౌడ్స్ ఆఫ్ వైజాగ్	రెండు	సెప్టెంబర్ చివరివారం
7. కుకింగ్ ఒలంపియాడ్	ఏడు	జనవరి 22 నుంచి 28

హృదయాభిలాషి పుస్తకం



పుస్తకానికి మించిన మంచి స్నేహితుడు లేడు. మంచి పుస్తకం ఒక జీవితాన్నే మార్చివేయొచ్చు. ఒక దారి చూపించొచ్చు. మార్పునకు నాంది కావచ్చు. అందుకే 'చిరిగిన చొక్కా అయినా వేసుకో కానీ మంచి పుస్తకాన్ని కొనుక్కో' అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. పుస్తకాలను ప్రేమించగలగాలి. పఠనా సక్తిని ప్రోదిచేసుకోగలగాలి. అప్పుడే వాటి సారాన్ని అర్థం చేసుకోగలం. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితాన్ని తీర్చిదిద్దుకునేందుకు పుస్తకానికి మించిన మార్గదర్శకుడు ఉండడు. అటువంటి పుస్తకాల నిలయం గ్రంథాలయం. ఆ గ్రంథాలయాలకు ప్రపంచ ఖ్యాతినార్జించిన వ్యక్తి ఎస్.ఆర్.రంగనాథన్.

- మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది
- పుస్తకాన్ని ప్రేమించగలిగిన వాడే నిజమైన పాఠకుడు
- పాఠకుని దేవాలయం గ్రంథాలయం
- జ్ఞానసముపార్జనకు లైబ్రరీ వేదిక
- గ్రంథాలయాలకు దశ, దిశ నిర్దేశించిన వ్యక్తి రంగనాథన్
- గ్రంథాలయ పితామహుడు ఆయన

నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం

ఒక్క అక్షరం వెయ్యి మెదళ్లలో కదలిక తెస్తుంది...అదే ఒక పుస్తకం...సమాజాన్నే చైతన్యపరుస్తుంది. పుస్తక పఠనం అద్భుతమైన హాబీ. పాఠకునిది, పుస్తకానిది అవినాభావ సంబంధం. ప్రతి పుస్తకానికీ పాఠకులు ఉంటారు. ప్రతి పాఠకుని వద్ద పుస్తకాలు ఉంటాయి. అటువంటి పుస్తకాలను దేవతలుగా భావించి వాటికి ఒక ఆలయం ఉండాలని చాటిన మహనీయుడు షియాలీ రామామృత రంగనాథన్ (ఎస్.ఆర్.రంగనాథన్). గణిత శాస్త్రంలో నిష్ణాతుడైన రంగనాథన్ గ్రంథాలయాల్లో పంచసూత్రాలను సిద్ధాంతీకరించి జాతీయ ఖ్యాతి సొంతం చేసుకున్న ఘనుడు. అందుకే ఆయనను గ్రంథాలయ పితామహుడు అంటారు. ఆయన జయంతిని లైబ్రేరియన్స్ డేగా జరుపుకొంటారు. నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

పంచసూత్రాలతో పునాది

లైబ్రేరియన్‌గా రంగనాథన్ అందించిన సాంకేతిక సూత్రాలను ఇండెక్స్ థీరీ అంటారు. గ్రంథాలయాల్లో పుస్తకాలను ఓ పద్ధతిలో అమర్చి పాఠకులకు అందుబాటులో ఉండేలా చూసేందుకు రంగనాథన్ 1933లో ప్రవేశపెట్టిన కొలోన్ క్లాసిఫికేషన్ సూత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధక గ్రంథాలయాల్లో ఇప్పటికీ వినియోగిస్తున్నారు. పుస్తకాల అమరికకు వర్గీకరణ చాలా ముఖ్యమని ఆయన తన 'విశ్లేషణ-సంశ్లేషణ' సిద్ధాంతం ద్వారా తెలియజేశారు. ఆ తర్వాత ఆయన ప్రవేశపెట్టిన 'ఛైన్ ఇండెక్స్' కూడా ఎంతో ప్రాచుర్యాన్ని సాధించింది. కేటలాగ్, క్లాసిఫికేషన్ వంటి ఎన్నో సూత్రాలు ఆచరణలోకి తెచ్చారు. గ్రంథాలయాల నిర్వహణకు రంగనాథన్ ప్రవేశపెట్టిన పంచసూత్రాలకు మాత్రం విశేష ప్రాచుర్యం లభించింది. వీటికి అన్నివర్గాల ఆమోదం లభించడమేకాక గ్రంథాల వ్యవస్థ మరింత పటిష్ఠం అయ్యేందుకు ఎంతో దోహదపడ్డాయి. రంగనాథన్ ప్రవేశపెట్టిన పంచసూత్రాల్లో మొదటిది 'పుస్తకాల ఉపయోగం కోసం' సూత్రం అర్థవంతమైన వివరణ కలిగి ఆచరణ యోగ్యంగా ఉంటుంది. గ్రంథాలయాల్లో మార్పులు చేర్పులు చేసేందుకు ఇది ఎంతో ఉపయుక్తమైంది. రెండో సూత్రం 'పుస్తకాలు అందరి కోసం'. మూడోది 'ప్రతి పుస్తకానికి పాఠకుడు...ప్రతి పాఠకునికీ పుస్తకాలు'. నాలుగోది 'పాఠకుని కాలం సద్వినియోగపర్చడం'. ఐదోది 'గ్రంథాలయం నిరంతరం అభివృద్ధి చెందేది'. రంగనాథన్ సూత్రీకరించిన ఈ 'పంచసూత్రాలను' గ్రంథాలయ పాలకులు పంచ వేదాలుగా భావిస్తుంటారు. అయితే వీటి ఆచరణలో చూపే చిత్తశుద్ధిపైనే గ్రంథాలయాల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

తెలుగు గ్రంథాలయ ఉద్యమ పితామహుడు 'అయ్యంకి'

తెలుగులో గ్రంథాలయ ఉద్యమానికి పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య. తెలుగులో గ్రంథాలయాల కోసం ఊరు వాడా తిరిగి ఉద్యమాన్ని నడిపిన వ్యక్తి ఆయన. ఆయన తదనంతరం తెలుగులో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి వెలగా వెంకటప్పయ్య. ఈయన ఆధునిక పద్ధతిలో తెలుగులో తొలి గ్రంథాలయం విశాఖపట్నంలో ఏర్పాటుచేశారని పరిశోధకులు చెబుతారు. 1886లో మంతిన సూర్యనారాయణమూర్తి విశాఖలో గ్రంథాలయం స్థాపించారు. ఇతర దేశాల్లో గ్రంథాలయాల నిర్వహణపై తెలుగు ప్రజలకు తెలియని రోజుల్లో సొంత ప్రేరణతో ఏర్పాటుచేశారు. అటు తరువాత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అనేక మంది చొరవ చూపడంతో గ్రంథాలయ ఉద్యమం ప్రారంభమైంది. ఈ దశలో అయ్యంకి వెంకటరమణయ్య ముందుకు రావడంతో గ్రంథాలయాల ఏర్పాటు ఉద్యమంలా సాగింది.

పౌరగ్రంథాలయ అభివృద్ధికి జీవం

ఎస్.ఆర్.రంగనాథన్ గ్రంథాలయ శాస్త్రంలో విశదీకరించిన గ్రంథాలయ చట్టం పౌరగ్రంథాలయాల అభివృద్ధికి జీవం పోసింది. ఢిల్లీలోని పౌరగ్రంథాలయం, చెన్నైలోని కన్నెమెర గ్రంథాలయాల అభివృద్ధిలో ఆయన అందించిన సేవలు ఎనలేనివి. శిక్షణ, అధ్యయనం, పరిశోధనలు మనిషిని ఉత్తమ వనరుగా తీర్చిదిద్దుతాయి. ఇందుకు పుస్తకాలే ముఖ్యం. అంతటి ప్రాధాన్యం ఉన్న పుస్తకాలున్న భాండాగారం లైబ్రరీ దేవాలయంతో సమానం. ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థల ఆధ్వర్యంలో గ్రంథాలయాలు నడుస్తుంటాయి. జాతీయ, జిల్లా, మండల, శాఖా గ్రంథాలు ప్రభుత్వానివైతే స్థానికులు, రిజిస్టర్డ్ సంస్థలు, సామాజిక సంస్థలు, క్లబ్బులు, అసోసియేషన్లు, ఫిలాంత్రోఫిస్టులు నిర్వహించేవి ప్రభుత్వేతరమైనవి.



అద్దె భవనంలో నడుస్తున్న కేంద్ర గ్రంథాలయం

జిల్లా గ్రంథాలయ సంస్థకు గూడు కరువు

జిల్లా గ్రంథాలయ సంస్థకు సొంతభవనం లేదు. మహారాణిపేటలో సొంత భవనంలో ఏళ్లపాటు కొనసాగిన గ్రంథాలయం నేడు రెండుచోట్ల అద్దెభవనంలో నడుస్తోంది. పాలనా కార్యాలయం ద్వారకానగర్‌లో, గ్రంథాలయం సూర్యాబాగ్‌లో మెలోడీ థియేటర్ ఎదుట మేడపై ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. దాదాపు ఆరేళ్ల నుంచి పరాయి పంచన గ్రంథాలయ సంస్థ నడుస్తుండడంతో అక్కడకు వచ్చే పాఠకులు సంఖ్య తగ్గింది. సొంత భవనంలో ఉన్నప్పుడు రోజుకు ఆరేడు వందలమంది పాఠకులు వచ్చేవారు. విశాలమైన భవనంతోపాటు ఆరుబయట చెట్ల కింద చదువుకునేవారు. ఇప్పుడు అద్దెకొంప ఇరుకుగా ఉండడంతో 50 మంది కూర్చుంటే మిగిలిన వారు నిలబడాల్సిందే. సదుపాయాల్లేక రోజుకి రెండు మూడువందల మందికి మించి రావడం లేదు. విలువైన పుస్తకాలు పాడవుతున్నాయి. వీటిని భద్రపర్చడం సవాల్‌గా మారింది. ద్వారకానగర్ కార్యాలయానికి బోర్డులేదు. అద్దె విషయంలో ప్రతిష్ఠంభన కారణంగా ఎప్పుడు ఖాళీ చేయాల్సి వస్తుందో తెలియదు. సొంత భవనం ఖాళీ చేసిన నుంచి తిరిగి సొంత భవనంలోకి వెళ్లే వరకు మొత్తం అద్దె చెల్లించే బాధ్యత స్థలాన్ని అభివృద్ధికి తీసుకున్న ప్రత్యూష కంపెనీదే. సొంతభవనం కోసం పలువురు పోరాడు తున్నా ఫలితం శూన్యం చైర్మన్ పోస్టు కూడా మూడేళ్లుగా ఖాళీగా ఉంది.


చారిత్రక ఏయూ గ్రంథాలయం

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వి.ఎస్.కృష్ణ గ్రంథాలయానికి 90 వసంతాల చరిత్ర. 1926లో నాగపూర్‌కు చెందిన విద్యాదాత రావుబహుదూర్ డి.లక్ష్మీనారాయణ ఇచ్చిన 5,400 పుస్తకాలతో 1927లో ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఐదు లక్షలకు పైగా పుస్తకాలు, లక్షలాది ఈ-గ్రంథాలు ఈ లైబ్రరీ సొంతం. ఇందులో వెయ్యికిపైగా సంస్కృత గ్రంథాలుండడం మరో ప్రత్యేకత. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన మేధావులు చేతిరాత గ్రంథాలు 1300 వరకు ఉన్నాయి. గణిత మాంత్రికుడు శ్రీనివాస రామానుజన్ చేతిరాత ప్రతులు ఇక్కడ భద్రపరిచి ఉన్నాయి. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే రామాయణం, మహాభారతం, భాగవంతం తదితర ఇతిహాస గ్రంథాలతో పాటు 1500 తాళపత్ర గ్రంథాలు ఇక్కడ నిక్షిప్తమై ఉన్నాయి. నిత్యం వేలాది మంది పాఠకులు ఏయూ గ్రంథాలయాన్ని వినియోగించుకుంటుంటారు. ముఖ్యంగా సివిల్స్ వంటి ఉన్నతోద్యోగార్థులతోపాటు సాధారణ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేవారు, పరిశోధకులకు ఈ గ్రంథాలయం మంచి వారధిగా నిలుస్తోంది.





చదువరుల కేంద్రం...పౌరగ్రంథాలయం



37 వేలమంది సభ్యులు

సీతంపేట : నగరంలో పాఠకులను విశేషంగా ఆకట్టుకునే గ్రంథాలయం ద్వారకానగర్ పౌరగ్రంథాలయం. దాదాపు 11 విభాగాలుగా ఉన్న గ్రంథాలయంలో వివిధ వర్గాలకు చెందిన 57 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 1999లో శంకుస్థాపన చేసిన గ్రంథాలయాన్ని 2003 డిసెంబర్ 3న ప్రారంభించారు. ప్రస్తుతం గ్రంథాలయంలో 37 వేల మంది సభ్యులున్నారు. పాఠకులకు చదువుకోవడానికి వీలుగా తెలుగు విభాగం, ఇంగ్లీష్ విభాగాలను అందుబాటులో ఉంచారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రెండు విభాగాలను ఏర్పాటు చేశారు. పాఠకులు చదువుకోవడానికి వీలుగా గ్రంథాలయం చుట్టూ మొక్కలువేసి వాటికింద బెంచీలు ఏర్పాటు చేశారు. సెల్లార్‌లోనూ వందమంది వరకు చదువు కునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేశారు. కంప్యూటర్ ఇంటర్నెట్ సౌకర్యంతోపాటు గాంధియన్, చిల్డ్రన్ రీడింగ్‌రూమ్, పేపర్ రీడింగ్ రూమ్, రిఫ్రెష్ రూమ్‌లను అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు అవసరమైన కొత్త పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతున్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలన్నీ ఈఫైల్స్‌గా మార్చుతున్నారు. పోటీపరీక్షార్థులకోసం ఉచిత ఇంటర్‌నెట్ సౌకర్యం, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్లు పౌర గ్రంథాలయం కమిటీ కార్యదర్శి దండు శ్రీనివాసవర్మ తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


చెంచులక్ష్మి(ఫైల్)

రావికమతం: మండల కేంద్రానికి చెందిన యువతి అదృశ్యంపై ఆమె తండ్రి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి రావికమతం ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపిన వివరాలిలావున్నాయి. రావికమతం గ్రామానికి చెందిన యన్నంరెడ్డి త్రిమూర్తులురెడ్డి కుమార్తె చెంచులక్ష్మి(21) ఈనెల 5న అదృశ్యమైందన్నారు. త్రిమూర్తులురెడ్డి తన తండ్రి ఆరోగ్యం బాగోకపోవడంతో ఈనెల 4న విశాఖపట్నం ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారన్నారు. దీంతో ఈనెల5న త్రిమూర్తులురెడ్డి కుమార్తె చెంచులక్ష్మి తన తాతగారిని చూసేందుకు విశాఖపట్నం వెళ్లి సూర్య ఆస్పత్రిలో ఉన్న తాతగారిని చూసి సాయంత్రం ఐదు గంటలకు ఆస్పత్రి నుంచి తిరిగి రావికమతం ఇంటికి వెళుతున్నానని చెప్పి ఇంటికి చేరలేదన్నారు. దీంతో ఆ రోజు నుంచి చెంచులక్ష్మి ఆచూకీ కోసం ఆమె తండ్రి త్రిమూర్తులురెడ్డి, బంధువులు, కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లిందేమోనని తిరుగుతున్నారన్నారు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో త్రిమూర్తులురెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలావుండగా చెంచులక్ష్మి చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదివి మధ్యలో మానేసిందన్నారు. అప్పటికే ఇదే కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వడ్డాదికి చెందిన రసుల్ అనే యువకుడితో పరిచయం ఏర్పడడంతో గతంలో కూడా చెంచులక్ష్మి రెండు, మూడు రోజులు కనిపించకుండా చేశాడన్నారు. అప్పట్లో కె.కోటపాడులో చెంచులక్ష్మి ఉన్నట్టు కనుగొని ఇంటికి తీసుకువచ్చారన్నారు. ఇప్పుడు కూడా రసుల్ చెంచులక్ష్మిని అదృశ్యం చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారన్నారు. ఈ కోణంలో కూడా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఆటో ఢీకొని విశాఖ డెయిరీ ఉద్యోగి మృతి


సత్యనారాయణ(ఫైల్)

చోడవరం: అనకాపల్లి మార్టూరు వద్ద గురువారం ఆటో ఢీకొని విశాఖ డెయిరీ ఉద్యోగి పాచిల సత్యనారాయణ అలియాస్ సతీష్ మృతిచెందాడు. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి. పట్టణ శివారు పిఎస్‌పేట గ్రామానికి చెందిన పాచిల సత్యనారాయణ గురువారం మార్టూరు వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. గురువారం రాత్రివరకూ గుర్తుతెలియని మృతదేహంగా పరిగణించిన పోలీసులు రాత్రి సమయానికి ఆ మృతదేహం పాచిల సత్యనారాయణదిగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. విశాఖ డెయిరీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సత్యనారాయణను స్థానికంగా సతీష్ అని పిలుస్తారు. సతీష్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే సతీష్ మృతిచెందడంపై విశాఖ డెయిరీ డైరెక్టర్ దాడి గంగరాజు, డెయిరీ ఉద్యోగులు తీవ్ర సంతాపం తెలిపారు. సతీష్ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు


గాయాలైన చౌప్పా సత్తిబాబు

ఎస్.రాయవరం(నక్కపల్లి): ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు హైవేపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి ఎస్.రాయవరం పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. శుక్రవారం ఉదయం ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన చౌప్పా సత్తిబాబు తన బైక్‌పై కారే జగ్గ, కారే బాబ్జీ సహా మరో బాలుడు కారే కోదండరావు తీసుకుని అడ్డురోడ్డు బంక్‌లో పెట్రోల్ వేయించేందుకు రోడ్డుదాటుతుండగా విశాఖ నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. దీంతో కారే బాబ్జీ తలకు తీవ్రగాయాలయ్యాయి.మిగిలిన ముగ్గురికి కాళ్లు విరిగిపోయినట్టు పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులను నక్కపల్లి 30 పడకల ఆస్పత్రికి తరలించారు.ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు వారిని తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అరుణ్‌కుమార్ చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమణ, పాల్గొన్న సీఐ, ఎస్ఐలు

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

అనకాపల్లి డీఎస్పీ కేవీ రమణ

అనకాపల్లి టౌన్:వినాయక నవరాత్రుల వేడుకల సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తే అనుమతులు తప్పనిసరిగా తీసుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి డీఎస్పీ కేవీ రమణ కింది స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక పోలీసు అతిథి గృహంలో సబ్‌డివిజన్‌లోని అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేజీ కార్యక్రమాలు గానీ, మైక్‌సెట్‌ల ఏర్పాట్లు గానీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తే అనుమతి తీసుకోవాలని నిర్వాహకులకు ముందుగానే సూచించాలన్నారు. అలాగే ఎక్కడెక్కడ అధికంగా కార్యక్రమాలు నిర్వహిస్తారో వాటిని గుర్తించాలన్నారు. మద్యం బెల్ట్ షాపులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే వాహనాల వేగానికి కళ్లెంవేయడంలో భాగంగా చర్యలు తీసుకున్నప్పటికీ ప్రమాదాలపై ప్రజలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాల నియంత్రణకు గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. గంజాయి రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రధానంగా రద్దీగా ఉండే ప్రదేశాల్లో నిఘాను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఐలు సంపతిరావు విద్యాసాగర్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్: మెకానిక్ మృతి


గిరిబాబు మృతదేహం

కె.కోటపాడు: మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామ శివారులో గురువారం రాత్రి ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనడంతో బైక్ మెకానిక్ మృతి చెందాడు. ఎ.కోడూరు ఎస్ఐ ఎ.సత్యనారాయణ తెలిపిన వివరాలిలావున్నాయి. కె.కోటపాడు గ్రామానికి చెందిన దుంగా గిరిబాబు(45) ఆనందపురం గ్రామంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి పదకొండున్నర గంటల సమయంలో ఆనందపురం నుంచి కోటపాడు బైక్‌పై వెళుతుండగా మార్గ మధ్యలో సూరెడ్డిపాలెం వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ని ఢీకొని ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సత్యనారాయణ పరశీలించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. శుక్రవారం ఉదయం చోడవరం సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాక్టర్ సిగ్నల్ లైట్లు వేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ కె.కార్తీక్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం చోడవరం తరలించారు. మృతుడు భార్య సూర్యకాంతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

ఎలమంచిలి రూరల్: ప్రకాశం జిల్లాలో శుక్రవారం తెల్లవారు జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని పులపర్తి గ్రామానికి చెందిన క్లీనర్ మృతి చెందగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి వివరాలిలావున్నాయి. పొట్టకూటి కోసం ఈగ్రామానికి చెందిన సూరకాసుల లీలాకృష్ణ ఐసర్ వ్యాన్‌లో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి వ్యాన్‌పై ఐరన్ లోడ్ వేసుకొని చెన్నై వెళుతుండగా ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధి సమీపంలో ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ కేబిన్ నుజ్జు నుజ్జు కావడంతో అందులో ఉన్న క్లీనర్ సూరకాసుల లీలాకృష్ణ(22) కేబిన్‌లో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ సూరకాసుల శ్రీనుకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సూరకాసుల బాబూరావు, భవానీలకు లీలాకృష్ణ ఒక్కడే కుమారుడు. మృతుడు అక్కకు పెళ్లి అయినప్పటికి లీలాకృష్ణకు ఇంకా కాలేదు. రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందాడన్న వార్తను విన్న లీలాకృష్ణ తల్లిదండ్రులు తట్టుకోలేకపోయారు. తల్లి భవానీ కన్నీరుమున్నీరైంది.


క్లీనర్ సూరకాసుల లీలాకృష్ణ మృతదేహం

40 కిలోల గంజాయి పట్టివేత

అనంతగిరి: ఆటోలో తరలిస్తున్న 40 కిలోల గంజాయిని అటవీశాఖ అధికారులు శుక్రవారం తెల్లవారు జామున చిలకలగెడ్డ చెక్‌గేటు వద్ద పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలిలావున్నాయి.అరకులోయ మండలం బెసుబెడ గ్రామానికి చెందిన బొరొబొరి సోమరాజు మరో ఇద్దరితో కలిసి ఆటోలో గంజాయిని ఆటోలో తరలిస్తుండగా చిలకలగెడ్డ చెక్‌గేటు వద్ద అటవీ సిబ్బంది వాహనాన్ని ఆపి చూడగా అందులో గంజాయి బస్తాలను గుర్తించారు.ఆటోలో వున్న ముగ్గురు వ్యక్తులు పరారీ అయ్యేందుకు ప్రయత్నించగా ఒకరిని అటవీ అధికారులు పట్టుకున్నారు.మరో ఇద్దరు వ్యక్తులు పరారీ అయ్యారు. పట్టుబడిన సోమరాజుతో పాటు ఆటోలోని గంజాయిని పోలీసులకు అప్పగించారు.


ఆటోలో దొరికిన గంజాయి బస్తాలు, నిందితుడు(ఇన్‌సెట్)

ఇద్దరికి జైలు

అనకాపల్లి టౌన్:మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి శుక్రవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎస్వీ రమణగుప్త జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ట్రాఫిక్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అప్పన్న అనే వ్యక్తికి ఐదు రోజులు, కె.బ్రహ్మాజీకి ఏడు రోజులు జైలు శిక్ష విస్తూ తీర్పు చెప్పారన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం


కల్వర్టులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్: జాతీయ రహదారిలోని జలగలమదుం సమీపంలోని కల్వర్టులో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది వున్న విషయాన్ని పట్టణ పోలీసులు శుక్రవారం గుర్తించారు. సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రెండురోజుల క్రితం మృతిచెంది వుంటాడని ఘటనా స్థలాన్ని పరిశీలించిన పట్టణ సీఐ సంపతిరావు విద్యాసాగర్ తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మార్టూరు వద్ద ఆర్టీఐ తనిఖీలు

తుమ్మపాల: మండలంలోని మార్టూరు జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం ట్రాన్స్‌పోర్టు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వాహన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని వాహనాలు, హెల్మెట్లు లేని వాహన చోదకులను, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపైనా కేసులు నమోదు చేసి అపరాధరుసుం వసూలు చేశారు.

గాయపరచిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్:ఒక వ్యక్తి తలపై ఇనుపరాడ్డుతో కొట్టి గాయపరచిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించి రూరల్ ఏఎస్ఐ తెలిపిన వివరాలిలావున్నాయి. మండలంలోని సిరసపల్లి గ్రామానికి చెందిన ఫిర్యాది కరణం శ్రీనివాసరావుకు మడక సంజీవరావులకు మధ్య కొంతకాలంగా బేధాభిప్రాయాలున్నాయి. సంజీవరావు టెంటు హౌస్ నిర్వహించడంవల్ల ఇబ్బందిగా ఉందంటూ ఇరువురు గొడవలు పడేవారు. శుక్రవారం ఉదయం శ్రీనివాసరావు తన ద్విచక్రవాహనంలో ఎవరో పెట్రోల్ అపహరించడంతో చుట్టుపక్కల వాకబు చేస్తుండగా ఒక మహిళ సంజీవరావు టెంటుహౌస్‌లో కుర్రాడిపేరు చెప్పడంతో శ్రీనివాసరావు ఆకుర్రవాడిని ప్రశ్నిస్తుండగా సంజీవరావు కల్పించుకుని టెంటుహౌస్‌లోని ఇనుపరాడ్డుతో తలపై కొట్టి గాయపరిచాడు. ఈ మేరకు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటోలో ప్రసవించిన గిరిమహిళ

అనంతగిరి ఘాట్ రోడ్డులో ...

సెల్ సిగ్నల్స్ లేక 108 అంబులెన్స్‌ను ఆశ్రయించలేని పరిస్థితి

అనంతగిరిరూరల్: ఆస్పత్రులలో ప్రసవాలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశ పెడుతున్నప్పటికీ.. అవి మన్యం వాసుల చెంతకు చేరడంలేదు. అందుకు నిదర్శనమే శుక్రవారం అనంతగిరి ఘాట్‌రోడ్డులో జరిగిన ఘటన. మండలంలోని వాలాసి పంచాయతీ నిమ్మలపాడు గ్రామానికి చెందిన బి.కొండమ్మకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. అయితే నిమ్మలపాడులో సెల్ సంకేతాలు లేకపోవడంతో ఆటోలో అనంతగిరి ఆసుపత్రికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. కాగా ఘాట్‌రోడ్డులో బోడగుడ సమీపంలోకి వచ్చేసరికి నొప్పులు అధికమై ఆటోలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతం అనంతగిరి ఆస్పత్రికి తల్లీబిడ్డలను తరలించారు. నిమ్మలపాడు నుంచి లుంగపర్తి పీహెచ్‌సీకి తీసుకొని వెల్దామన్నా ఉదయం కావడంతో ఎవరూ ఉండరని బాలింత భర్త వినోద్‌కుమార్ తెలిపారు. తమ ప్రాంతంలో సెల్ సేవలు లేక 108 అంబులెన్స్ ను సంప్రదించలేక పోయామన్నారు.



బిడ్డను ఆటోలో ప్రసవించిన కొండమ్మ

రోజుకు లక్ష..

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

అవినీతికి మరో పేరుగా మారిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి పనికీ రేటు ఫిక్స్ చేసేశారు. సిబ్బంది వసూలు చేసేది వందల్లో వుంటుండగా, సబ్ రిజిస్ట్రార్లు మాత్రం ఒక శాతం పేరుతో రోజుకు లక్ష రూపాయలకు తక్కువ లేకుండా సంపాదిస్తున్నారు. ఒక్కో ఉద్యోగి రోజుకు రూ.మూడు వేలకు తక్కువ లేకుండా ఇంటికి తీసుకెళుతున్నారు. అంటే వారికి కూడా నెలకు లక్ష రూపాయలు అక్రమంగా వస్తోంది. ఇవన్నీ మామూలు వ్యవహారాలు. అలా కాకుండా ప్రత్యేకమైన కేసులు, అడ్డగోలు వ్యవహారాలైతే వాటి రేటు సెపరేటు. నెల రోజుల ఆదాయం ఆ ఒక్క కేసులోనే వచ్చేస్తుంది.

ఇదీ జరిగే తంతు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సబ్ రిజిస్ట్రార్ వుంటారు. ఒక్కొక్కరిది ఒక్కో విధి. వాటికి ఫిక్స్‌డ్ రేట్లు వున్నాయి. ఆస్తిని కొని రిజిష్టర్ చేసుకోవాలంటే.. ముందుగా ఎవరైనా డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదిస్తారు. అక్కడ స్టాంపు పేపరు కొని అగ్రిమెంట్ రాసుకుంటారు. ఆస్తి మార్కెట్ విలువ ప్రకారం చలానా తీసి బ్యాంకులో సొమ్ము చెల్లిస్తారు. ఆ చలానా రశీదు, డాక్యుమెంట్ పేపర్లు తీసుకెళ్లి మొదట సీనియర్ అసిస్టెంట్‌కు సమర్పించాలి. ఆఫీసులో ఈ వ్యక్తే కీలకం. ఇక్కడ అభ్యంతరాలు ఎన్ని వ్యక్తమైతే సబ్ రిజిస్ట్రార్ అంత ఎక్కువ మొత్తం వసూలు చేస్తాడు. అమ్మకం ఒప్పందం, సర్వే నంబరు, ఆస్తి వివరాలు, అన్నీ చూసి సరిగ్గా వున్నాయనుకుంటే సీనియర్ అసిస్టెంట్ ఇనీషియల్ వేసి సబ్ రిజిస్ట్రార్‌కు రిఫర్ చేస్తాడు. ఇందుకోసం రూ.200 తీసుకుంటాడు. ఆ తరువాత ఆ పత్రాలను తీసుకెళ్లి జూనియర్ అసిస్టెంట్ దగ్గరకు వెళ్లాలి. ఆ వ్యక్తి కొంటున్న వారి పేర్లు, అమ్ముతున్న వారి పేర్లు, ఆధార్ నంబర్లు, హద్దులు, విస్తీర్ణం, ఈసీ తదితరాలన్నీ(చెక్ లిస్ట్) పరిశీలించి కంప్యూటర్‌లో ఆ డేటా ఫీడ్ చేస్తాడు. అక్కడ మరో రూ.200 ఇవ్వాలి. ఆ తరువాత ఆ ఫైల్ తీసుకొని సబ్ రిజిస్ట్రార్ దగ్గరకు వెళితే... ఆయన ఆస్తి విలువ, వ్యవహారం బట్టి దాని విలువలో ఒక శాతం, లేదంటే... గుత్తగా ఓ మొత్తం డాక్యుమెంట్ రైటర్‌కు చెబుతారు. అందుకు పార్టీ ఒప్పుకుంటే రిజిస్ట్రేషన్ కోసం పుస్తకంలో నంబరు వేస్తారు. ఇక్కడ రూ.20 వేల నుంచి లక్షల రూపాయల వరకు వుంటుంది. సాయంత్రం డాక్యుమెంట్ రైటర్ ఆ మొత్తం తెచ్చి ఇస్తేనే అది రిజిస్ట్రేషన్‌కు వెళుతుంది. లేదంటే.. కొర్రీలు వేసి పక్కన పెడతారు. అక్కడి నుంచి ఇరు పార్టీల ఫొటోలు తీయించుకోవాలి. ఈ వ్యవహారం అవుట్ సోర్సింగ్ వ్యక్తి చేస్తారు. అతడికి రూ.100 చెల్లించుకోవాలి. అంతా అయిన తరువాత ఇరు పార్టీల వేలిముద్రలను అటెండర్ తీసుకుంటాడు. అక్కడ రూ.200 ఇవ్వాలి. అంటే సబ్ రిజిస్ట్రార్‌కు ఇచ్చే పెద్దమొత్తం కాకుండా రూ.700 అదనంగా ఇవ్వాలి. డాక్యుమెంట్ రైటర్ పార్టీని బట్టి మొత్తం చెబుతాడు. కొత్త పార్టీ అయితే వీలైనంత ఎక్కువ లాగడానికి ప్రయత్నిస్తాడు. అందులో కొంత తను వుంచేసుకొని, మిగిలింది సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తాడు. పార్టీ అంతే ఇచ్చిందని బుకాయిస్తాడు. కొన్ని పార్టీలు ఒక శాతం లంచం ఇచ్చినా 0.5 శాతమే ఇచ్చారని సగం నొక్కేసే డాక్యుమెంట్ రైటర్లే ఎక్కువగా వున్నారు. అందుకే సబ్ రిజిస్ట్రార్లు యాంటీ రూములు ఏర్పాటు చేసుకొని డైరెక్ట్‌గా పార్టీలతోనే డీల్ మాట్లాడుకుంటున్నారు.

నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే పెద్ద సంస్థలు, వ్యాపారులు అంతా ఈ విధంగానే డీల్ మాట్లాడుకుంటారు. డాక్యుమెంట్ రైటర్‌కు పత్రాలు తయారు చేసినందుకు రూ.2వేలు-రూ.3వేలు ఇచ్చేసి సబ్ రిజిస్ట్రార్‌కు నేరుగా ఆ మొత్తం ఇచ్చేస్తారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎక్కువగా ఇలాంటి వ్యవహారాలే నడుస్తున్నాయి. ఈ కార్యాలయంలో సాధారణ రోజుల్లో రోజుకు 30 డాక్యుమెంట్లు రిజిష్టర్ చేస్తారు. అంటే సిబ్బందికి అదనంగా రూ.21 వేలు లంచాలు వస్తాయి. సబ్ రిజిస్ట్రార్‌కు ఒక్కో డాక్యుమెంట్‌కు సగటున రూ.10వేలు వేసుకున్నా... రూ.3 లక్షల వరకు వస్తుంది. ఇందులో ఉన్నతాధికారులకు వాటాలు ఇస్తారు. రకరకాల ఖర్చులు వుంటాయి. నగర పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరువాత మధురవాడ కార్యాలయంలో ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. సిట్ దర్యాప్తులో వెలుగు చూస్తున్న భూ కుంభకోణాల్లో అత్యధికం ఇక్కడ జరిగినవే. ప్రభుత్వ భూముల రికార్డులను ట్యాంపరింగ్ చేసి ప్రైవేటు వ్యక్తుల పేరిట రిజిష్టర్ చేసిన కేసులే ఎక్కువ. ఈ కార్యాలయంలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్లు కూడా ఏసీబీకి చిక్కి జైలు పాలైన ఘటనలు వున్నాయి.

నంబర్ 3 పాత్ర కీలకం

సబ్ రిజిస్ట్రార్లు నమ్మకమైన ప్రైవేటు వ్యక్తులను సహాయకులుగా పెట్టుకుంటారు. వారిని 'నంబర్ 3'గా వ్యవహరిస్తారు. లంచాల రూపంలో వచ్చే సొమ్ము అంతా ఆ వ్యక్తి దగ్గరే వుంటుంది. అలాగే అటెండర్లు కూడా కీలకంగా వుంటారు. వీరు కూడా వసూళ్ల కార్యక్రమంలో పాలుపంచుకుంటారు.

నమ్మకస్తులైతే డాక్యుమెంట్ రైటర్లయినా ఓకే

కొందరు సబ్ రిజిస్ట్రార్లు డాక్యుమెంట్ రైటర్లనే నమ్ముకుంటారు. వారి ద్వారా బాగా డబ్బులు, మంచి పార్టీలు వస్తాయని విశ్వాసం ఏర్పడితే వారు ఏ డాక్యుమెంట్ తీసుకొచ్చినా కొర్రీలు వేయకుండా పని పూర్తిచేసేస్తారు. జాయింట్-1 రత్నకుమార్‌కు అలాంటి వ్యక్తులు ఇద్దరు వున్నారు. వారిలో ఒకరు హనుమంతు. రూ.80వేలు లంచం డిమాండ్ చేసిన పార్టీని తీసుకు వచ్చింది ఈయనే. అలాగే షణ్ముఖరావు అనే మరో డాక్యుమెంట్ రైటర్ వున్నాడు. అతగాడు తెచ్చిన డాక్యుమెంట్లను కూడా కళ్లు మూసుకొని సంతకం చేసేస్తారు. వీరిద్దరితోపాటు స్టాంపు వెండర్ సత్యనారాయణ బినామీగా వ్యవహరిస్తున్నారు.

చెక్ చెప్పగలరా?

పాస్‌పోర్టు కార్యాలయాల్లోను ఇలాగే లంచాల బెడద ఎక్కువగా వుండేది. వాటిని సేవా కేంద్రాలుగా మార్చేయడంతో ఎవరికీ పైసా ఇవ్వాల్సిన అవసరం లేకుండా పనులు జరుగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కూడా అలాగే సేవా కేంద్రాలుగా మార్చేయానే ఆలోచనలో ప్రభుతత్వం వుంది. ఈ లంచాలతో విసిగిపోయిన ప్రజలు ఆ విధానాన్నే ఆహ్వానిస్తున్నారు. ఎవరి ప్రమేయం లేకుండా ఎంచక్కా త్వరగా పని పూర్తయిపోవడమే కావాలని కోరుకుంటున్నారు.

డ్వామా పీడీకి ఉత్తమ ప్రతిభాపురస్కారం

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ ఎ. కళ్యాణ చక్రవర్తి ఉత్తమ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఉపాధిహామీ పనులు చేపట్టడంలో 2016-17లో రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే విశాఖ జిల్లాను అగ్రపథంలో నిలిపి ఉత్తమ ప్రతిభ చూపినందుకు ప్రభుత్వం ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈమేరకు శుక్రవారం ఉత్వర్వులు జారీ అయ్యాయి. పంద్రాగస్టు సందర్భంగా ఈనెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా తిరుపతిలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పీడీ పురస్కారాన్ని అందుకోనున్నారు.



మున్సిపల్ కార్యాలయంలో వివాహ నమోదు

ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రాపర్టీ ట్యాక్స్‌బోర్డు కార్యదర్శి ఆశాజ్యోతి విజ్ఞప్తి

నర్సీపట్నం టౌన్: మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా వివాహ నమోదు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రవేశ పెట్టారు. ఈ విషయమై పట్టణ వాసులందరికీ అవగాహన కల్పించాలని.. రాష్ట్ర ప్రాపర్టీ ట్యాక్స్‌బోర్డు కార్యదర్శి ఆశాజ్యోతి సూచించారు. శుక్రవారం ఆమె నర్సీపట్నం మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఇప్పటివరకు వివాహ నమోదు కోసం ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలో వివాహ నమోదుకు ఏర్పాటు చేయడంతో పాటు ఒక అధికారిని ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందన్నారు.

అదే విధంగా పట్టణంలోని వివిధ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన పురసేవా యాప్ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రజలకు పురసేవా యాప్ కోసం తెలియకపోవడంతో సమస్యలపై కార్యాలయానికి వస్తున్నారన్నారు. సమస్యను గుర్తించి ఆ సమస్య ఏ అధికారి పరిధిలోకి వస్తుందో తెలియజేసేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం ఇటీవల కాలంలో పురసేవా యాప్‌లలో వచ్చిన ఎన్ని సమస్యలు పరిష్కరించారనే విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పాము కాటుతో విద్యార్థి మృతి

అచ్యుతాపురం రూరల్: మండల కేంద్రంలో డ్రీమ్స్ దాబా ఎదురుగా నివసిస్తున్న లాలం మహేంద్రనాయుడు అనే బాలుడు పాము కాటుకు గురై మృతి చెందాడు. వివరాలిలావున్నాయి. మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన లాలం వెంకట సోమునాయుడు తన భార్య కుమార్తె, కుమారుడుల చదువు కోసం అచ్యుతాపురంలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం కుమారుడు మహేంద్రనాయుడు ఇంటి వద్ద ఆడుకుంటుండగా పాముకాటుకు గురయ్యాడు.దీంతో ఈయన్ని మండల కేంద్రంలో గల ఒక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుడు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వేరొక ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పి పంపించి వేశారు. అనకాపల్లి తరలించే క్రమంలో మార్గమధ్యలో మహేంద్ర మృతి చెందాడు. అయితే మహేంద్ర మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువులు ఆందోళనకు దిగారు. సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో రాంబిల్లి ఎస్‌ఐ కుమారస్వామి, ఎస్‌ఐ మల్లేశ్వరరావు ఇరువర్గాలతో మాట్లాడి శాంతింపజేశారు.

లాక్ట్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ వినియోగించాలి

ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

విశాఖపట్నం,(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు లాక్ట్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ మొబైల్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ ఒక ప్రకటలో కోరారు. ఈ విధానంతో దొంగతనాల నివారణ, పట్టణ భద్రత ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ముందుగా అనకాపల్లి, నర్సీపట్నం పోలీసు స్టేషన్లలో దీన్ని ప్రారంభించామని తెలిపారు. పోలీసులు ఉచితంగా అందుబాటులోకి తెచ్చిన ఈ సేవలను త్వరలోనే జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్లకు విస్తరించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ విధానం ఎలా పనిచేస్తుందనేదానిపై ఎస్పీ ప్రకటన ద్వారా వివరించారు.

లాక్డ్ హౌస్ మానిటిరింగ్ సిస్టం ఇలా వినియోగించుకోవాలి

- ఆండ్రాయిడ్ మొబైల్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌కు వెళ్లి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఇంటి చిరునామాతోపాటు సెల్ నెంబరును పొందుపర్చి మీరు వున్న ఇంటినుంచే ఈ యాప్‌ను రిజిస్టర్ చేసుకోవాలి.
- రిజిస్టర్ చేసుకున్న తరువాత ఓటీసీ నెంబర్‌తో యూసర్‌ఐడీ వస్తుంది.
- ఎప్పుడైనా ఊర్లకు, యాత్రకు వెళ్లినప్పుడు ఈ యూసర్ ఐడీతో యాప్‌లోని రిక్వస్ట్ పోలీస్‌వాచ్ ద్వారా సమాచారం ఇవ్వాలి.
- ఫలానారోజు ఇంటిలో ఉండమని స్పష్టమైన సమాచారం ఇవ్వాలి.
- వెంటనే పోలీసువారు మీ ఇంటికి వచ్చి సంబంధిత సంబంధిత పరికరాలు సీసీ కెమెరా, మోడెం వంటివి అమర్చి వెళతారు. అప్పటి నుంచి మీరు తిరిగి వచ్చేవరకు మీ ఇల్లు పోలీసు నిఘాలో ఉంటుంది.
- ఒకవేళ దొంగలుపడితే వెంటనే అలారం మోగుతుంది. ఈ సమాచారం వెంటనే పోలీసులకు చేరుతుంది.
- అనుమానితులు ఇళ్లకు వస్తే ఫొటోలు తీయడంతోపాటు వీడియో రికార్డింగ్ చేసి సీసీ కెమెరాల పోలీసు కంట్రోల్‌రూమ్‌కు అనుసందానం చేయడం ఈ యాప్ ప్రత్యేకత అని ఎస్పీ పేర్కొన్నారు.

శాకాంబరి అలంకరణలో నూకాంబిక ఉత్సవమూర్తి

అనకాపల్లి టౌన్: స్థానిక నూకాంబిక అమ్మవారి ఉత్సవ మూర్తిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనం కల్పించారు. శ్రావణ శుక్రవారంలో భాగంగా ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సుజాత ఆధ్వర్యంలో పురోహితులు వివిధ రకాల కూరగాయలతో ఉత్సవమూర్తికి అలంకరణ చేశారు. ఆలయంలో సాయంత్రం ప్రత్యేక దీపాలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుద్ధ నాగజగదీశ్వరరావు, కొణతాల వెంకటరావు, బీఎస్‌ఎంకే జోగినాయుడు, మళ్ల సురేంద్ర, ఆడారి జగన్నాథరావు పాల్గొన్నారు.



1976 మే 25 ఏ వారం అవుతుంది?

మెంటల్ ఎబిలిటి



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

1. 200 కిమీ పొడవైన రహదారిపై రెండు కార్లు చెరోవైపు నుంచి ప్రయాణిస్తున్నాయి. మొదటి కారు 40 కిమీ ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 20 కిమీ ప్రయాణించింది. మరల ఎడమవైపునకు తిరిగి 35 కిమీ ప్రయాణించింది. తదుపరి ఎడమవైపునకు తిరిగి మెయిన్ రోడ్డుకు చేరుకొంది. రెండో కారు చిన్న లోపంతో కేవలం 55 కిమీ మాత్రమే ప్రయాణించింది. అయితే ప్రస్తుతం ఆ రెండు కార్ల మధ్య దూరం ఎంత?
ఎ) 60 కిమీ బి) 80 కిమీ సి) 75 కిమీ డి) 70 కిమీ

2. 6842109357 సంఖ్యలో మొదటి అంకెను రెండో స్థానంలోకి, రెండో అంకెను మొదటి స్థానంలోకీ, మూడో అంకెను నాలుగో స్థానంలోకి, నాలుగో అంకెను మూడో స్థానంలోకి ఇలా అన్ని అంకెలు మారగా ఏర్పడిన కొత్త సంఖ్యలో ఎడమ నుంచి అయిదో అంకెకు గల మూడో కుడి అంకె?
ఎ) 9 బి) 5 సి) 3 డి) 4

3. కింది సంఖ్యలను ముందుగా వ్యతిరేక దిశలో రాసి తరవాత ఆ సంఖ్యలను అవరోహణ క్రమంలో రాస్తే మధ్య సంఖ్య మధ్య అంకె?
853, 942, 687, 439, 924, 168, 316
ఎ) 8 బి) 2 సి) 1 డి) 4

4. 80 మంది విద్యార్థులు ఉన్న ఒక వరసలో కిరణ్ ఎడమ నుంచి 32వ స్థానంలోను, తరుణ్ కుడి నుంచి 28వ స్థానంలోను ఉన్నారు. అయితే ప్రస్తుతం వారిద్దరి మధ్య గల విద్యార్థుల సంఖ్య?
ఎ) 20 బి) 40 సి) 28 డి) 26

5. ఒక వరసలో అచ్యుత్ ఎడమ నుంచి పదో స్థానంలోను, కుడి నుంచి ఆరోస్థానంలోను ఉన్నాడు. ఆ వరసలో మొత్తం సభ్యుల సంఖ్య 34 ఉండాలంటే ఎంతమంది వ్యక్తులు అవసరం?
ఎ) 12 బి) 19 సి) 21 డి) 18

6. వివేక్‌కు అతని సోదరి పుట్టిన రోజు ఆగస్టు 20, 25 మధ్య అని గుర్తు. అతని తండ్రికి తమ కుమార్తె పుట్టిన రోజు సెప్టెంబరు 23, 28 మధ్య అని గుర్తు అయితే వివేక్ సోదరి పుట్టిన రోజు ఎప్పుడు?
ఎ) ఆగస్టు 24 బి) సెప్టెంబరు 24
సి) చెప్పలేం డి) ఏదీకాదు

7. పాట్నాకు ఒక రైలు ప్రతి 80 నిలకు ఉంది. విచారణాధికారి తనను కలసిన ప్రయాణికుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాతి రైలు గం.10.15నిలకు అని చెప్పాడు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పాడు?
ఎ) గం. 9.10 ని. బి) గం. 10.20 ని.
సి) గం. 9.30 ని. డి) ఏదీకాదు


8. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల సరి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏమీ లేవు

9. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి

8	5	961
7	8	522
9	3	?

ఎ) 843 బి) 441 సి) 924 డి) 462

10. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి



ఎ) 65 బి) 92 సి) 48 డి) 64

11. ఒక అంకె 3 కన్నా పెద్దది 7 కన్నా చిన్నది. అదే అంకె 5 కన్నా పెద్దది, 9 కన్నా చిన్నది. అయితే ఆ అంకె?
ఎ) 8 బి) 4 సి) 6 డి) 9

12. 1976 మే 25 ఏ వారం అవుతుంది?
ఎ) గురువారం బి) మంగళవారం
సి) బుధవారం డి) సోమవారం

13. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల బేసి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 2 5 6 8 5 2 7 3 4 6 8 7 9 2 1 4 8 9 3
ఎ) నాలుగు బి) మూడు సి) రెండు డి) ఏమీలేవు

14. ఇంటర్వ్యూ నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 11.00 కంటే 15 ని.లు ముందుగా వచ్చారు. ఈయన చైర్మన్ కంటే 25ని.లు ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 20 నిలు ముందు వచ్చారు. అయితే ఇంటర్వ్యూని ఎప్పుడు నిర్వహించాలనుకొన్నారు?
ఎ) గం. 11.00 ని. బి) గం. 11.30 ని.
సి) గం. 11.15 ని. డి) ఏదీకాదు

15. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్యలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Mobile 2. Master 3. Manner
4. Market 5. Minister
ఎ) Master బి) Minister
సి) Market డి) Mobile

16. అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం కుడి నుంచి 12 వ అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరం?
ఎ) P బి) R సి) Q డి) J

17. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను సవ్య దిశలో రాసి రెండో సగం అక్షరాలను అపసవ్య దిశలో రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల అయిదో కుడి అక్షరం?
ఎ) Z బి) Y సి) X డి) W

18. సవ్యదిశ వర్ణమాలలో కుడి ఆరో అక్షరం నుంచి పది అక్షరాలను అపసవ్యదిశలో రాసి మిగిలిన అక్షరాలను యథాతథంగా రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల నాలుగో కుడి అక్షరం?
ఎ) U బి) R సి) T డి) S

19. 1956 ఆగస్టు 2న ఏవారమవుతుంది?
ఎ) శుక్రవారం బి) శనివారం
సి) గురువారం డి) బుధవారం

20. ఈ రోజు ఆగస్టు 19 గురువారం. ఇది లీపు సంవత్సరమయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?
ఎ) ఆదివారం బి) శనివారం
సి) సోమవారం డి) బుధవారం

21. 2001 జనవరి 1 శుక్రవారం అయితే తదుపరి వచ్చే ఏ సంవత్సరంలో జనవరి 1 శుక్రవారమవుతుంది?
ఎ) 2001 బి) 2007 సి) 2008 డి) ఏదీకాదు

22. ఈ రోజు నవంబరు 14 గురువారం. ఇది లీపు సంవత్సరం. అయితే అయిదేళ్ల తరవాత ఇదే తేదీకి ఏ వారమొస్తుంది?
ఎ) బుధవారం బి) మంగళవారం
సి) గురువారం డి) ఏదీకాదు

23. గడియారంలో సమయం గం.1.30ని. అయితే నిముషాల ముల్లు, గంటల ముల్లు మధ్య కోణం?
ఎ) 180° బి) 120° సి) 135° డి) 140°

24. విక్రం 50 మీ ఉత్తరానికి నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 40 మీ నడిచాడు. మరల కుడివైపునకు తిరిగి 35 మీ నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 25 మీ నడిచాడు. చివరగా ఎడమవైపునకు తిరిగి 15 మీ నడిచాడు. అయితే ప్రస్తుతం విక్రం బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ తూర్పు బి) 15 మీ పడమర
సి) 15 మీ ఉత్తరం డి) 15మీ దక్షిణం

25. గడియారంలో సమయం గం.12.00 అయింది. గంటల ముల్లు తూర్పును చూపిస్తోందనుకొంటే గం3.30నిల సమయంలో నిముషాల ముల్లు ఏ దిక్కును సూచిస్తోంది?
ఎ) తూర్పు బి) ఉత్తరం సి) దక్షిణం డి) పడమర

26 - 30

A, B లు భార్యాభర్తలు. X, Y లు సోదరులు. A కుమార్తె K. Y తల్లి B. M తండ్రి Y. Z కుమార్తె M. F భార్య K. T కుమారుడు A. K కుమారుడు N. పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి?

26. T కి B ఏమవుతారు?
ఎ) కోడలు బి) అత్తగారు
సి) మామగారు డి) ఏదీకాదు

27. M కి K ఏమవుతారు?
ఎ) మేనల్లుడు బి) మేనత్త
సి) మేనమామ డి) మేనకోడలు

28. Z కి A ఏమవుతారు?
ఎ) అత్తగారు బి) కోడలు
సి) అల్లుడు డి) మామగారు

29. X కి N ఏమవుతారు?
ఎ) మేనకోడలు బి) మేనమామ
సి) మేనల్లుడు డి) మేనత్త

30. B కి F ఏమవుతారు?
ఎ) అల్లుడు బి) కోడలు
సి) మేనల్లుడు డి) మేనకోడలు

31 - 35

1. ఒక కళాశాలలో A, B, C, D, E, F, G, H, I, J అనే పది పరీక్షలను వారం రోజుల్లో నిర్వహించదలిచారు. ఆదివారం సెలవు. ప్రతి రోజు ఒకటి/ రెండు పరీక్షలు జరుగుతాయి.
2. B పరీక్షతోపాటు మరో పరీక్ష ఉంటుంది. కాని గురువారం కాదు.
3. A తో పరీక్షలన్నీ మంగళవారం మొదలౌతాయి
4. చివరి రోజు, శుక్రవారంనాడు ఒక పరీక్ష మాత్రమే ఉంటుంది. శుక్రవారం నాడు J పరీక్ష నిర్వహిస్తారు.
5. H పరీక్ష, D తరవాత ఉంటుంది. D పరీక్ష, F తరవాత ఉంటుంది.
6. చివరి రోజున E పరీక్ష ఉంటుంది. J పరీక్ష తరవాతి రోజు G, సెలవు రోజుకి ముందు రోజు I పరీక్ష ఉంటాయి. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

31. సెలవు రోజుకి ముందు నిర్వహించే పరీక్షలు?
ఎ) D, B బి) G, I సి) H, C డి) ఏదీకాదు

32. H పరీక్ష రోజున ఉన్న మరో పరీక్ష?
ఎ) B బి) F సి) C డి) ఏదీకాదు

33. బుధవారం రోజున ఉన్న పరీక్ష?
ఎ) C, H బి) B, D సి) G, I డి) ఏదీకాదు

34. C పరీక్ష తరవాతి రోజు ఉండే పరీక్ష?
ఎ) E బి) F సి) J డి) ఏదీకాదు

35. మొదటి రోజు జరిగే పరీక్షలు?
ఎ) A, F బి) C, H సి) G, I డి) D, B

36. వినయ్ పడమరకు 80 మీ నడచిన తరవాత ఎడమవైపునకు తిరిగి 30 మీ నడిచాడు. మరల ఎడమకు తిరిగి 20 మీ నడిచాడు. చివరగా ఉత్తరానికి 110 మీ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలు దేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 100 మీ నైరుతి బి) 100 మీ వాయవ్యం
సి) 100 మీ ఈశాన్యం డి) 100 మీ ఆగ్నేయం

37 - 38

కింది పదాలకు అర్థవంతమైన రీతిలో సరైన క్రమాన్ని meaningful sequence of order తెలపండి

37. 1. Walls 2. Windows 3. Foundation
4. Roof 5. Room 6. Floor
ఎ) 3, 2, 5, 4, 1, 6 బి) 3, 1, 2, 4, 6, 5
సి) 3, 1, 2, 6, 4, 5 డి) 3, 1, 2, 4, 5, 6

38. 1. Rain 2. Rainbow 3. Child
4. Sun 5. Happy
ఎ) 1, 4, 2, 3, 5 బి) 1, 2, 3, 4, 5
సి) 1, 2, 4, 5, 3 డి) 1, 3, 4, 2, 3

సమాధానాలు

1) డి	7) ఎ	13) ఎ	19) సి	26) ఎ	33) బి
2) ఎ	8) సి	14) బి	20) ఎ	27) బి	34) సి
3) సి	9) బి	15) ఎ	21) బి	28) డి	35) ఎ
4) ఎ	10) ఎ	16) సి	22) ఎ	29) సి	36) బి
5) బి	11) సి	17) బి	23) సి	30) ఎ	37) బి
6) సి	12) బి	18) డి	24) ఎ	31) బి	38) ఎ
			25) డి	32) సి	

ఉద్యోగాలు

JOBS

టిఎస్‌సిఎబి

తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టిఎస్‌సిఎబి)- ఆర్‌బిఐ/ నాబార్డ్ సహకారంతో కింది అయిదు డిసిసిబి బ్యాంకుల్లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

డిసిసిబి బ్యాంకులు: హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

వయసు: 55 ఏళ్లు మించరాదు

అర్హత: పీజీ/ సీఏ/ డిగ్రీ + సిఏఐఐబి/ డిబిఎఫ్/ డిప్లొమా(కో ఆపరేటివ్ బిజినెస్ మేనేజ్‌మెంట్)/ పీజీడిసిఆర్‌ఎస్ పూర్తిచేసి ఉండాలి. బ్యాంకింగ్ రంగంలో కనీసం ఎనిమిదేళ్లు మిడిల్/ సీనియర్ మేనేజ్‌మెంట్ కేడర్‌లో పనిచేసి ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తుఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తు డౌన్‌లోడింగ్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 31

దరఖాస్తు సబ్మిషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 7

చిరునామా: Managing Director, TSCAB, Head Office, Troop Bazar, Hyderabad- 500001

వెబ్‌సైట్: www.tscab.org

టైమ్-క్యాట్ మాక్ టెస్ట్

స్కాలర్‌షిప్

మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్‌లకు శిక్షణ ఇచ్చే ప్రముఖ సంస్థ 'టైమ్' క్యాట్ ఔత్సాహికుల కోసం దేశ వ్యాప్తంగా ఆగస్టు 13న ఆల్ ఇండియా ఫ్రీ మాక్ టెస్ట్‌ను నిర్వహించనుంది. ఇన్విజిలేట్, నాన్ ఇన్విజిలేట్ పద్ధతుల్లో ఈ మాక్ టెస్ట్ ఉంటుంది. ఈ టెస్ట్‌లో చక్కని ప్రతిభ చూపిన వారికి 2017/18 క్యాట్ క్లాస్ రూమ్ ప్రోగ్రామ్, టెస్ట్ సిరీస్‌లపై ఫీజులో రాయితీ ఇస్తారు. అయితే ఈ అవకాశం ఇన్విజిలేట్ మోడ్‌ను ఎంపిక చేసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుంది. రియల్ టైమ్ ఎగ్జామ్ ఎక్స్‌పిరీయెన్స్ కల్పించేలా ఈ మాక్ టెస్ట్‌ను రూపొందించినట్లు టైమ్ క్యాట్ కోర్స్ డైరెక్టర్ రామనాథ్ కనకదండి తెలిపారు.


రిజిస్ట్రేషన్ లింక్:
http://www.time4education.com/local/articlecms/page.php?id=1030

వెబ్‌సైట్: www.time4education.com

మెదడులోని ఏ భాగాన్ని ఆల్కహాల్ ప్రభావితం చేస్తుంది?

మానవ శరీరం

1. మానవ శరీరంలోని అతిపెద్ద గ్రంథి ఏది?
ఎ) అవటు గ్రంథి బి) క్లోమ గ్రంథి
సి) కాలేయం డి) పీయూష గ్రంథి
2. మానవ దేహంలోని అతి పెద్ద అవయవం ఏది?
ఎ) కాలేయం బి) చర్మం
సి) అవటు గ్రంథి డి) గుండె
3. మానవ శరీరంలోని అంతర్గత అవయవాల్లో పెద్దది?
ఎ) కాలేయం బి) చర్మం
సి) గుండె డి) పీయూష గ్రంథి
4. మానవ దేహంలో యూరియా సంశ్లేషణ జరిగే ప్రదేశం?
ఎ) మూత్రపిండాలు బి) ప్లీహం
సి) క్లోమం డి) కాలేయం
5. మానవ శరీరంలో పొడవైన ఎముక ఏది?
ఎ) స్టెపిస్ బి) ఫిమర్ సి) టిబియ డి) టార్సస్
6. మానవ శరీరంలోని చిన్న ఎముక ఏది?
ఎ) స్టపిస్ బి) ఫిమర్ సి) టిబియ డి) టార్సస్
7. వయోజన మానవునిలో ఉండే మొత్తం ఎముకలెన్ని?
ఎ) 180 బి) 306 సి) 156 డి) 206
8. మానవునిలో ఉండే పక్కటెముకల సంఖ్య?
ఎ) 33 బి) 26 సి) 12 జతలు డి) 14
9. వయోజన మానవుని వెన్నుముకలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 33 బి) 26 సి) 22 డి) 14
10. మానవుని కపాలంలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 22 బి) 14 సి) 8 డి) 18
11. మానవుని పుర్రెలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 14 బి) 8 సి) 22 డి) 26
12. మానవుని ముఖ భాగంలో ఉండే ఎముకలు ఎన్ని?
ఎ) 14 బి) 22 సి) 8 డి) 30
13. మానవ శరీరంలోని థర్మోస్టాట్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైమస్ బి) కాలేయం
సి) హైపోథాలమస్ డి) ప్లీహం
14. మానవ శరీరంలో రక్తనిధి అని దేన్ని పిలుస్తారు?
ఎ) కాలేయం బి) ప్లీహం సి) గుండె డి) ఎముక
15. ఎర్రరక్త కణాల శ్మశానవాటిక అని దేన్ని అంటారు?
ఎ) ఎముక బి) గుండె సి) కాలేయం డి) ప్లీహం
16. మెదడులోని ఏ భాగాన్ని ఆల్కహాల్ ప్రభావితం చేస్తుంది?
ఎ) మస్తిష్కం బి) అనుమస్తిష్కం
సి) ద్వారగోర్థం డి) హైపోథాలమస్
17. జ్ఞాపకశక్తిని నియంత్రించే మెదడులోని భాగం?
ఎ) మస్తిష్కం బి) అనుమస్తిష్కం
సి) ద్వారగోర్థం డి) హైపోథాలమస్
18. కోపాన్ని నియంత్రించే మెదడులోని భాగం?
ఎ) ద్వారగోర్థం బి) హైపోథాలమస్
సి) అనుమస్తిష్కం డి) మస్తిష్కం
19. మెదడులోని ఏ భాగాన్ని అనుమస్తిష్కం అని అంటారు?
ఎ) ముందు భాగం బి) మధ్య భాగం
సి) వెనుక భాగం డి) హైపోథాలమస్


ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ


19. పోరాట, పలాయన హార్మోన్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైరాక్సిన్ బి) ఎపినెఫ్రిన్
సి) పారాథైరాక్సిన్ డి) ఇన్సులిన్
21. మాస్టర్ గ్రంథి అని దేన్ని పిలుస్తారు?
ఎ) పీయూష గ్రంథి బి) అవటు గ్రంథి
సి) క్లోమ గ్రంథి డి) అధివృక్క గ్రంథి

పోటీ పరీక్షల ప్రత్యేకం - బయాలజీ

22. ఆడమ్స్ ఆపిల్ గ్రంథి అని దేన్ని పిలుస్తారు?
ఎ) అవటు గ్రంథి(థైరాయిడ్) బి) పీయూష గ్రంథి
సి) అధివృక్క గ్రంథి డి) క్లోమం
23. కింది వాటిలో మిశ్రమ గ్రంథి ఏది?
ఎ) క్లోమం బి) కాలేయం సి) థైమస్ డి) పైవన్నీ
24. మూత్రపిండాలపై ఉండే గ్రంథి?
ఎ) థైమస్ బి) క్లోమం
సి) అధివృక్క గ్రంథి డి) అవటు గ్రంథి
25. ఇన్సులిన్ హార్మోన్‌ను స్రవించే గ్రంథి?
ఎ) క్లోమం బి) కాలేయం
సి) ప్లీహం డి) పీయూష గ్రంథి
26. మరుగుజ్జుల్లో తక్కువగా ఉండే హార్మోన్ ఏది?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) పెరుగుదల హార్మోన్ డి) పైవన్నీ
27. 'క్రెటినిజం' వ్యాధి ఉన్న పిల్లల్లో ఏ హార్మోన్ తక్కువగా ఉంటుంది?
ఎ) థైరాక్సిన్ బి) ఇన్సులిన్
సి) వాసోప్రెసిన్ డి) ఎపినెఫ్రిన్
28. ప్రసవ సమయంలో ఉత్పత్తి అయ్యే హార్మోన్ ఏది?
ఎ) ఆక్సిటోసిన్ బి) ప్రొజెస్టిరాన్
సి) ప్రోలాక్టిన్ డి) ఈస్ట్రోజన్
29. రక్తంలో ఉండే పాస్ఫేట్ల స్థాయిని నియంత్రించే గ్రంథి?
ఎ) అవటు గ్రంథి బి) పార్శ్వ అవటు గ్రంథి
సి) పీయూష గ్రంథి డి) క్లోమ గ్రంథి
30. ఉరఃకుహరంలో ఉండే గ్రంథి?
ఎ) థైమస్ బి) పీయూష గ్రంథి
సి) అవటు గ్రంథి డి) ఏదీకాదు
31. పేస్ మేకర్ ఏ అవయవానికి సంబంధించింది?
ఎ) గుండె బి) మూత్రపిండం
సి) కాలేయం డి) మెదడు
32. లింఫోసైట్ కణాలను ఉత్పత్తి చేసే గ్రంథి?
ఎ) క్లోమం బి) కాలేయం
సి) థైమస్ డి) జఠర గ్రంథి
33. లాలాజల గ్రంథులు స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) పెప్సిన్ సి) లైపేజ్ డి) టైలిన్
34. జఠర గ్రంథులు స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) పెప్సిన్ సి) లైపేజ్ డి) అమైలేజ్
35. ఎంజైములు, హార్మోన్‌లను ఉత్పత్తి చేసే గ్రంథి?
ఎ) పీయూష గ్రంథి బి) కాలేయం
సి) క్లోమం డి) జఠర గ్రంథి
36. క్లోమ గ్రంథి స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) లైపేజ్ సి) అమైలేజ్ డి) పైవన్నీ
37. డయాబెటిస్ ఇన్ సిపిడస్ వ్యాధి ఉన్నవారిలో ఏ హార్మోన్ తక్కువగా ఉంటుంది?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) వాసోప్రెసిన్ డి) గ్లూకగాన్
38. టిటనీ వ్యాధి ఉన్నవారిలో ఏ హార్మోన్ లోపిస్తుంది?
ఎ) పారాథైరాక్సిన్ బి) థైరాక్సిన్
సి) ప్రోలాక్టిన్ డి) ఇన్సులిన్
39. మెదడులోని ఏ భాగాన్ని చిన్న మెదడు అని అంటారు?
ఎ) మస్తిష్కం
బి) అనుమస్తిష్కం
సి) హైపోథాలమస్
డి) ద్వారగోర్థం



40. వ్యాధికారక బ్యాక్టీరియాను చంపే రక్తకణాలు?
ఎ) రక్త ఫలకికలు బి) ఎర్రరక్త కణాలు
సి) తెల్లరక్త కణాలు డి) పైవన్నీ
41. వయోజన మానవుని శ్వాసక్రియ రేటు?
ఎ) 32 బి) 18 సి) 72 డి) 10
42. మెదడు : మెనింజెస్ :: ఊపిరితిత్తులు : ....
ఎ) వాయుగోణులు బి) క్షయ
సి) ప్లూరా డి) వృక్కాలు
43. హిమోసైటోమీటర్‌ను దేని కోసం ఉపయోగిస్తారు?
ఎ) రక్త పీడనం కొలిచేందుకు
బి) రక్తకణాలను లెక్కించేందుకు
సి) రక్తాన్ని శుద్ధి చేయడం కోసం
డి) గుండె పనితీరు తెలుసుకోవడం కోసం
44. ఎర్రరక్త కణం సగటు జీవితకాలం ఎన్ని రోజులు?
ఎ) 180 బి) 90 సి) 120 డి) 13
45. మానవునిలో ఉండే జ్ఞానదంతాలు ఎన్ని?
ఎ) 4 బి) 2 సి) 8 డి) 6
46. కింది ఏ జంతువులో రధనికలు క్షీణించి ఉంటాయి?
ఎ) పులి బి) గేదె సి) కుక్క డి) ఏదీకాదు
47. మానవ శరీరంలోని అతిచిన్న కణం?
ఎ) అండం బి) నాడీకణం
సి) ఎర్రరక్తకణం డి) శుక్రకణం
48. ఏ అవయవం పనిచేయనప్పుడు డయాలసిస్ చేస్తారు?
ఎ) గుండె బి) ఊపిరితిత్తులు
సి) మూత్రపిండాలు డి) కాలేయం
49. పైత్య రసాన్ని స్రవించే గ్రంథి ఏది?
ఎ) కాలేయం బి) క్లోమం
సి) థైమస్ డి) ప్లీహం



50. కింది వాటిలో జ్ఞానేంద్రియం కానిది?
ఎ) చర్మం బి) కన్ను సి) నాలుక డి) ఉండుకం
51. ఫారన్ హీట్ డిగ్రీల్లో మానవుని సాధారణ ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 37 బి) 72 సి) 98.4 డి) 104
52. ఎలర్జీ ఉన్న వ్యక్తి రక్తంలో ఏ కణాలు పెరుగుతాయి?
ఎ) రక్తఫలకికలు బి) ఎర్రరక్త కణాలు
సి) ఇసినోఫిల్స్ డి) లింఫోసైట్లు
53. ఆరోగ్యవంతుడైన మానవుని నాడీ పీడనం ఎంత?
ఎ) 72 బి) 120 సి) 40 డి) 18
54. బ్లడ్ బ్యాంకుల్లో రక్తాన్ని నిల్వ చేసేందుకు రక్తంలో కలిపే పదార్థం?
ఎ) సోడియం క్లోరైడ్ బి) సోడియం సిట్రేట్
సి) అమ్మోనియం క్లోరైడ్ డి) పైవన్నీ
55. మానవ గర్భావధి కాలం?
ఎ) 360 రోజులు బి) 270 రోజులు
సి) 180 రోజులు డి) 240 రోజులు

సమాధానాలు

1) సి	9) బి	17) ఎ	27) ఎ	37) సి	47) డి
2) బి	10) సి	18) ఎ	28) ఎ	38) ఎ	48) సి
3) ఎ	11) సి	19) సి	29) బి	39) బి	49) ఎ
4) డి	12) ఎ	20) బి	30) ఎ	40) సి	50)డి
5) బి	13) సి	21) ఎ	31) ఎ	41) బి	51) సి
6) ఎ	14) బి	22) ఎ	32) సి	42) సి	52) సి
7) డి	15) డి	23) ఎ	33) డి	43) బి	53) సి
8) సి	16) డి	24) సి	34) బి	44) సి	54) బి
		25) ఎ	35) సి	45) ఎ	55) బి
		26) సి	36) డి	46) బి	

JOBS ఉద్యోగాలు

పిజెటిఎస్ఎయు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్(ఎస్సీ& ఎస్టీ బ్యాక్‌లాగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 18
విభాగాలవారీ ఖాళీలు: అగ్రికల్చర్ 10, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ 5, హోం సైన్స్ 3
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 21
వెబ్‌సైట్: www.pjtsau.ac.in

ఐటిబిపి

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటిబిపి)- **సబ్ ఇన్‌స్పెక్టర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21 (మహిళలకు 3, పురుషులకు 18)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 22
వెబ్‌సైట్: www.recruitment.iitbpolice.nic.in
www.itbpolice.nic.in

వివిఎస్ఎస్‌సి

ఇస్రో ఆధ్వర్యంలోని విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్ (విఎస్ఎస్‌సి)- **టెక్నీషియన్ అప్రెంటిస్**ల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.
మొత్తం ఖాళీలు: 158
విభాగాలవారీ ఖాళీలు: ఆటోమొబైల్ 8, కెమికల్ 25, సివిల్ 8, కంప్యూటర్ సైన్స్ 15, ఎలక్ట్రికల్ 10, ఎలక్ట్రానిక్స్ 40, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ 6, మెకానికల్ 46
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
అర్హత: 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. అయితే 2015 ఏప్రిల్ తరవాత డిప్లొమా పూర్తిచేసినవారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. శాండ్‌విచ్ డిప్లొమాస్/ ప్రైవేట్ డిప్లొమాస్/ షార్ట్ టర్మ్ కోర్సులు/ సర్టిఫికెట్ కోర్సులను పరిగణనలోకి తీసుకోరు.
వయసు: ఇంటర్వ్యూ నాటికి 30 ఏళ్లు మించరాదు
స్టయిపెండ్: నెలకు రూ.3542
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా **ఇంటర్వ్యూ:** ఆగస్టు 19
వేదిక: Govt.polytechnic College, kalamassery, Ernakulam District, Kerala
ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా www.mhrdnats.gov.in/ www.sdcentre.org వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి.
వెబ్‌సైట్: http://www.vssc.gov.in/VSSC V4/images/

కొచ్చిన్ షిప్‌యార్డ్

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్- **గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ **ఖాళీలు:** 72
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 12, మెకానికల్ 27, ఎలక్ట్రానిక్స్ 6, సివిల్ 12, కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి 8, సేఫ్టీ 3, మెరైన్ 2, నేవల్ ఆర్కిటెక్చర్ & షిప్ బిల్డింగ్ 2
అర్హత: సంబంధిత విభాగంలో బిఇ/ బిటెక్ పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
స్టయిపెండ్: నెలకు రూ.8,000
టెక్నీషియన్ అప్రెంటిస్ **ఖాళీలు:** 100
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 22, మెకానికల్ 28, ఎలక్ట్రానిక్స్ 8, ఇన్‌స్ట్రుమెంటేషన్ 7, సివిల్ 9, కంప్యూటర్ 6, కమర్షియల్ ప్రాక్టీస్ 20
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
స్టయిపెండ్: నెలకు రూ.7,000
ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.cochinshipyard.com/ career/ Notification

జగన్ ఉన్మాది.. ప్రతిపక్ష నేతగా పనికిరాడు

రూరల్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు



ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, టీడీపీ శ్రేణులు

రాంబిల్లి: అధికార దాహంతో ఉన్మాదిలా మారిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా పనికిరారని టీడీపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు, ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైఎస్ జగన్ నంద్యాలలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం వెంకటాపురం వద్ద టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. జగన్‌పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

అనంతరం వెంకటాపురం మూడు రోడ్ల కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ జగన్ తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ఎన్నికల కమిషన్ నుంచి ఇప్పటికే ఒకసారి నోటీసులు అందుకున్న జగన్ తీరుమార్పుకోకపోవడం దారుణమన్నారు. చంద్రబాబును ఉరి తీసినా తప్పులేదంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబుకు ప్రజల్లో వస్తున్న ఆదరణ, పేరును చూసి జగన్‌కు పిచ్చిపట్టి తప్పుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు. 11 కేసుల్లో ఏ1 ముద్దాయిగా ఉండడమే కాక, 16 నెలలు జైలు జీవితం అనుభవించిన జగన్‌కు చంద్రబాబును విమర్శించే స్థాయి లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషికి ప్రజలు నీరాజనాలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జగన్ తన కుటిల రాజకీయాలు మార్చుకోవాలని హెచ్చరించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు, ఎలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డి.రంగనాయకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాంబిల్లి, అచ్యుతాపురం ఎంపీపీలు కె.అనిత, చేకూరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వి.దినబాబు, జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ డిఎస్ఎన్‌రాజు, కన్నం తిరుపతిరావు, ఎల్.రమణ, బద్దిరమణ, లాలం తాతబాబు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు కబ్జా

- 25 ఎకరా ప్రస్తుతం మిగిలింది రెండు ఎకరాలే!
- కశింకోట మండలం చింతలపాలెం నడిమి చెరువు దర్జాగా ఆక్రమణ



కబ్జాకు గురైన చెరువు



చెరువు గర్భంలో చెరకు తోట

అనకాపల్లి/కశింకోట రూరల్: జాతీయ రహదారికి కూతవేటు దూరంలో నడిమి చెరువు ఉంది. సర్వే నంబర్ 73/3లో 25 ఎకరాల చెరువు గర్భం ఉంది. కానీ ప్రస్తుతం ఇది రెండు ఎకరాలకు కుచించుకుపోయింది. మిగిలిన 23 ఎకరాలను స్థానిక రైతులు ఆక్రమించేశారు. చెరకు, యూకలిప్టస్, వరి పంట వేస్తున్నారు. మరికొందరు పాకలు నిర్మించుకున్నారు. ఈ చెరువు కింద చింతలపాలెం, జె.తుని, నర్సింగబిల్లి, గొబ్బూరుపాలెం, ఎన్జీ పాలెం గ్రామాలకు చెందిన 500 ఎకరాల ఆయకట్టు వుంది. చెరువు దాదాపు కబ్జా కావడంతో ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకమయింది. ప్రస్తుతం చెరువు చిన్న కుంట మాదిరిగా కనిపిస్తున్నది. కబ్జాదారులకు రాజకీయ నాయకుల అండదండలు వున్నాయని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించకపోతే చెరువు ఆనవాళ్లు వుండదని వారు అంటున్నారు.

అందరితో పాటే నేను ఖాళీ చేస్తా..



మా నాన్నగారు ఉన్నప్పుడే చెరువులో ఎకరం భూమి ఆక్రమించుకున్నారు. ఆ భూమిని నేను సాగు చేసుకుంటున్నాను. అందరితో పాటే నేను కూడా! అందరూ ఖాళీ చేస్తే నేను కూడా నా ఆక్రమణలో ఉన్న ఎకరా భూమిని ఖాళీ చేసేస్తా.

- తెరపల్లి శ్రీను, వీఆర్ఏ

నేను రిటైర్ అయ్యాక.. రాసుకోండి



త్వరలో నేను రిటైర్ అవుతున్నాను. ఈ లోపు ఈ చెరువును ఖాళీ చేయించడం నా వల్ల కాదు. నాకు సహకరించండి ప్లీజ్... నేను రిటైర్ అయిపోయిన తరువాత మీరు పత్రికలో రాసుకొండి. అంతవరకు ఈ విషయం ప్రస్తావించవద్దు ప్లీజ్..!

- వీసం వెంకటరమణ, వీఆర్వో

17న లాకప్‌డెత్‌లపై న్యాయ విచారణ : ఆర్డీవో వెంకటేశ్వర్లు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న తాళ్లపాలెం పంచాయతీ రాయపల్లికి చెందిన మంటా రాపువులు లాకప్‌డెత్ ఆరోపణలపై ఈ నెల 17న విశాఖ ఆర్డీవో కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్టు విశాఖ ఆర్డీవో, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ఎస్. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మే 23న జైలు నుంచి చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా 23న తెల్లవారుజామున ఉదయం 7.30 గంటలకు మరణించినట్టుగా నిర్ధారించామని పేర్కొన్నారు. దీన్ని లాకప్ డెత్‌గా పరిగణించి విచారణ జరుపుతున్నందున ఈ నెల 17న ఉదయం 11 గంటలకు విశాఖ ఆర్డీవో కార్యాలయంలో జరిగే విచారణకు హాజరై సదరు వ్యక్తి మృతిపై తెలిసినవారు సమాధానం లిఖితపూర్వకంగా లేదా మౌఖికంగా తెలియజేయాలని ఆర్డీవో కోరారు.

అరకులోయ మండలం అమలగూడ గ్రామానికి చెందిన స్వాభి నారాయణ లాకప్ డెత్‌పై 17న విచారణ జరుపనున్నట్టు ఆర్డీవో తెలిపారు. జూలై 22న సదరు వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు. ఆయన మృతిపై వివరాలు తెలిసిన వారు ఆర్డీవో కార్యాలయానికి లిఖితపూర్వకంగా వివరాలు తెలియజేయాలని ఆర్డీవో కోరారు.

కొయ్యూరు మండలం కాకరపాడు గ్రామానికి చెందిన రొంపువలస గుడ్డ అప్పారావు జూలై 3న కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతిపై వివరాలు ఉంటే అదేరోజున హాజరై అందజేయాలని ఆర్డీవో కోరారు.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.30
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.40
వంకాయలు(తెల్లవి)	రూ.25
వంకాయలు(నల్లవి)	రూ.30
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.30
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.25
బీన్స్	రూ.60
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.15
బీట్‌రూట్	రూ.40
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.70
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.40
అల్లం	రూ.50
చేమదుంపలు	రూ.30
దోసకాయ	రూ.30
కాకరకాయలు	రూ.30
అనపకాయ(చిన్నది)	రూ.10
అనపకాయ(పెద్దది)	రూ.15
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పుదినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.70
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.28
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనెధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో

విశాఖపట్నం	351
విజయనగరం	355
శ్రీకాకుళం	355

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	91.00	90.00
విత్ స్కిన్	127.00	150.00
స్కిన్ లెస్	150.00	160.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	3805	4210
రెండో రకం	3300	3840
మూడో రకం	2700	3180

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 3, 8



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. చిట్‌ఫండ్‌లు, పొదుపు పథకాలు లాభిస్తాయి. చిన్నారుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. సంకల్పం నెరవేరుతుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): దూరంలో ఉన్న ప్రియతములు ఇల్లు చేరుతారు. వేడుకలు, బృందకార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారు కీలక పదవులు అందుకుంటారు. కీలక పత్రాలు అందుకుంటారు.



మిథునరాశి: (మే21-జూన్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. సమావేశాలు, చర్చలు ఫలిస్తాయి. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రముఖుల్ని కలుసుకుంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. లక్ష్యం నెరవేరుతుంది.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): కొత్త వ్యూహాలు అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రవాణా రంగాల వారికి అనుకూలం. నూతన ప్రాజెక్టులను విజయవంతంగా చేపడతారు. మనసు ఉల్లాసంగా ఉంటుంది.




కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సంస్మరణలు, ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటారు. పూర్వ మిత్రులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. యోగ, ధ్యానాలపై దృష్టి పెడతారు.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ప్రియతములకోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆస్పత్రులు, ఫార్మా, రెస్టారెంట్లు, రిక్రియేషన్ రంగాల వారు పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి ప్రోత్సాహకరం. విందు వినోదాల్లో ఉల్లాసంగా పాల్గొంటారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రియతములకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. బంధుమిత్రులతో సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): గృహవసరాల కోసం అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక విషయాల్లో కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకర సమయం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. జనసంబంధాలు విస్తరిస్తాయి. స్టేషనరీ, ప్రింటింగ్, కమ్యూనికేషన్ల రంగాల వారికి శుభప్రదం. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు.



మీనరాశి:(ఫిబ్రవరి19-మార్చి20): ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అనుకూలం. సహోద్యోగుల ఆర్థిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, చిట్‌ఫండ్‌లలో పనిచేసే వారికి ప్రోత్సాహకరం

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఏనుగులు చాలా తెలివైనవి. వాటికి జ్ఞాపకశక్తి ఎక్కువ. మనుషుల్లానే వాటికీ భావోద్వేగాలుంటాయి. మనుషులతో చాలా స్నేహంగా ఉంటాయి. కానీ రోజు రోజుకూ వాటి సంఖ్య తగ్గిపోతోంది. దంతాల కోసం, శరీర భాగాల కోసం అమానుషంగా వాటిని కొందరు చంపేస్తున్నారు. అయినా ఆ భారీ జంతువులకు మనుషుల మీద కోపం రాలేదు. ఆకారం భారీగా ఉన్నా అందరితో ప్రేమగా మెదిలే ఏనుగులను కాపాడాలనే ఉద్దేశంతో 'ప్రపంచ ఏనుగుల దినోత్సవం' మొదలైంది.



ఏనుగమ్మ.. ఏనుగు

ఏనుగులు మనుషులతో ఇట్టే కలిసిపోతాయి. భారతీయ సంస్కృతిలోనూ ఏనుగులకు విశిష్ట స్థానం ఉంది. నాలుగు వేల సంవత్సరాల నుంచి మానవులతో మైత్రి కొనసాగిస్తున్న గజరాజులకు.. మానవుల వల్లే ప్రమాదం పొంచి ఉంది. గత పది సంవత్సరాల్లో ఏనుగుల సంఖ్య 62 శాతం తగ్గింది. ప్రతిరోజు దాదాపు 100కు పైగా ఏనుగులు చనిపోతున్నాయి. ఏనుగు మాంసం, శరీర భాగాలు, దంతాల కోసం వేటగాళ్లు వాటిని చంపుతున్నారు. ఇది ఇలానే కొనసాగితే మరో పదిహేను, ఇరవై సంవత్సరాల్లో ఏనుగులు అంతరించిపోతాయని అంటున్నారు పర్యావరణవేత్తలు. అరణ్యంలో దొరికిన అనాథ ఏనుగుల్ని 'టూరిజమ్ ఇండస్ట్రీ', 'సర్కస్', 'టూరిస్ట్ పార్కు'లకు విక్రయించడంతో పాటు, అడవుల సంఖ్య తగ్గడం వల్ల కూడా వీటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇది గమనించిన కెనడియన్ ఫిల్మ్‌మేకర్ ప్యాట్రిసియా సిమ్స్, 'థాయ్‌లాండ్ రీ ఇంట్రడక్షన్ ఫౌండేషన్' సాయంతో ఆగస్టు 12న 'ప్రపంచ ఏనుగుల దినోత్సవా'న్ని జరుపుకోవాలని పిలుపునిచ్చాడు. ఏనుగులను కాపాడుకోవటం అందరి బాధ్యతంటూ సిమ్స్ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాడు.



ఎన్నెన్నో ఏనుగులు

ఆసియా ఏనుగులు:

- ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏనుగుల్లో కేవలం పది శాతం మాత్రమే ఆసియా ఏనుగులున్నాయి. జన్యు వ్యత్యాసాల ఆధారంగా ఏనుగులను మూడు ఉప జాతులుగా విభజించారు. ఇవి ఇంచుమించు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు ఉన్నాయి.
- **శ్రీలంక ఏనుగు :** ఆసియా ఏనుగులన్నింటిలోనూ పెద్దది. ఇవి శ్రీలంకలో మాత్రమే ఉన్నాయి.
- **ఇండియన్ ఎలిఫెంట్ :** ఇవి భారత దేశం నుంచి ఇండోనేషియా వరకు విస్తరించి ఉన్నాయి. వీటి సంఖ్య దాదాపు 35 వేల వరకు ఉండొచ్చు.
- **సుమత్రా ఏనుగు :** ఇవి అన్నింటికన్నా చిన్న పరిమాణంలో ఉంటాయి.

ఆఫ్రికా ఏనుగులు :

- ఆఫ్రికా ఖండంలో 37 దేశాల్లో ఇవి విస్తరించి ఉన్నాయి.
- ఇవి ఆసియా ఏనుగులకంటే పెద్దవిగా ఉంటాయి. వీటి చెవులు చాలా విశాలంగా, చెవులు చూడటానికి ఆఫ్రికా ఖండం ఆకారంలో ఉండటం విశేషం.

రక్షించుకుందాం !

WORLD elephant DAY
August 12th

- అరణ్యాల్లో పోలీసుల సంఖ్య పెంచడం వల్ల వేటగాళ్ల నుంచి ఏనుగులను రక్షించుకోవచ్చు.
- గాయపడ్డ ఏనుగులకు ప్రత్యేక చికిత్సలను అందిస్తే, ఎన్నో ఏనుగులను కాపాడుకోవచ్చు.
- అనాథ ఏనుగులను టూరిజం ఇండస్ట్రీకి ఇవ్వకుండా ప్రత్యేక చట్టాలను రూపొందించడం ద్వారా కూడా వీటిని రక్షించుకోవచ్చు.
- ఏనుగుల శరీర భాగాలను స్మగ్లింగ్ చేస్తున్న వారికి కఠిన శిక్షలు విధించడం వల్ల కూడా గజరాజులను కాపాడుకోవచ్చు.

టంగ్ ట్విస్టర్స్

1. I see a sea down by the seashore.But which sea do you see down by the seashore?
2. There those thousand thinkers were thinking where did those other three thieves go through.
3. Five frantic frogs fled from fifty fierce fishes.

నవ్వుల్ నవ్వుల్

తండ్రి : ఏరా! గౌరీ! ఆవుకి ఆ కళ్లద్దాలు ఎందుకు పెట్టావు రా?
గౌరి : ఈ రోజు పచ్చగడ్డి దొరకలేదు. అందుకే ఆవుకు ఎండుగడ్డి వేసి పచ్చ కళ్లద్దాలు పెట్టాను.
తండ్రి : !!!!!!!!!!!!

సుత్తివేలు : అరేయ్! నువ్వు నిద్రపోయి లేచేసరికి నీకో కోటి రూపాయలు వచ్చాయనుకో! ఏం చేస్తావ్?
మిస్టర్ మేధావి : మళ్లీ పడుకుని ఇంకో కోటి రూపాయలు వస్తాయేమో చూస్తా!
సుత్తివేలు : !!!!!!!!!!!!!!

ఆరంగులద్దండి




ఔనా!

- గోల్డెన్ ఈగల్ గంటకు 250 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోగలదు.
- ఇది ఆరు వేల అడుగుల ఎత్తు వరకు ఎగరగలదు.



చుక్కలు కలపండి




సూక్తి

మనిషికి వివేకాన్ని సంపాదించి పెట్టేవి అతనికి తగిలే ఎదురుదెబ్బలే.

చెప్పగలరా?

పదిలో ఉన్నాను కానీ గదిలో లేను
గర్వంలో ఉన్నాను కానీ సర్వంలో లేను
వాలులో ఉన్నాను కానీ వారులో లేను
అయితే నేనెవర్నో చెప్పగలరా?

దారి కనుక్కోండి



పదాలు గుర్తించండి

R	B	Z	B	V	S	W	W	H	K	F	C	T	Q	C
R	S	G	U	O	C	A	W	F	M	O	E	S	F	L
Y	H	M	T	N	K	T	V	X	R	O	B	I	N	K
W	O	Y	T	O	Q	G	R	E	E	N	Y	Q	W	Z
O	W	Z	E	C	T	T	O	X	T	L	A	Z	P	A
T	E	Y	R	L	I	K	R	O	E	V	H	M	W	Y
G	R	Z	F	E	P	D	J	Z	A	T	V	O	Y	K
A	S	D	L	A	Q	A	Y	S	P	P	B	A	G	T
R	I	M	Y	N	G	N	W	E	Y	N	L	J	V	B
D	K	W	K	I	S	D	T	S	I	Q	Y	D	L	L
E	P	A	Z	N	M	E	M	A	Y	F	A	I	W	O
N	G	N	V	G	V	L	R	S	B	I	E	S	H	S
U	L	I	O	Y	K	I	K	J	B	I	Y	T	Y	S
Z	Y	N	R	F	L	O	W	E	R	S	C	K	E	O
Y	Q	K	P	I	C	N	I	C	W	O	B	N	U	M

జంతర్‌మంతర్

1. కచిలు ▶ ....
2. రుపుము ▶ ....
3. పిపులు ▶ ....

జంబ్లింగ్ వర్డ్స్

1. STEA ▶ ....
2. RHUS ▶ ....
3. SLEA ▶ ....

జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1. EAST/SEAT 2. RUSH 3. SALE/ SEAL
చెప్పగలరా? : పగలు జంతర్‌మంతర్ : 1. [illegible] 2. [illegible] 3. [illegible]

ఆంధ్రజ్యోతి




తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్: అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం : ఆగస్టు 28 నుంచి నవంబర్ 30 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబరు 5,19, 23, 27, అక్టోబర్ 7 తప్ప)
రూ.50 దర్శనం : ఖాళీలు లేవు.
ఆర్జిత సేవలు : డిసెంబర్ 11వ తేదీ ఉన్నాయి.

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు, ఇతర సమాచారం కోసం...	139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు	182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్...	08924-226965

ఆర్టీసీ సమాచారం

APSRTC



అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 14859



తురకబడి పాఠశాల ఆవరణలోకి వచ్చిన నీరు



నర్సీపట్నంలో వర్షానికి గొడుగులతో వెళ్తున్న జనం



రావికమతంలో భారీ వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

ఖరీఫ్‌కు ఊపిరి

నర్సీపట్నంలో ఎక్కడ నీరు అక్కడే

నర్సీపట్నం రూరల్: నర్సీపట్నం పరిసర ప్రాంతాలలో శుక్రవారం మధ్యాహ్నాం భారీ వర్షం కురిసింది. నర్సీపట్నం, చెట్టుపల్లి, పెదబొడ్డేపల్లి, గబ్బాడ, ఒ.ఎల్.పురం, బలిఘట్టం తదితర గ్రామాల్లో వర్షం పడింది. ఈ వర్షం వల్ల ఇటీవల నాట్లు పడిన వరి పొలాలకు, నారుమడులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా నర్సీపట్నంలో కురిసిన వర్షానికి మురికి కాలువలలో నీరు రోడ్లపైకి రావడంతో ప్రయాణికులు, పాదచారులు అసౌకర్యానికి గురయ్యారు. వర్షం వెలసిన వెంటనే వాహనదారులు, పాదచారులు ఒకేసారి రోడ్లపైకి రావడంతో శ్రీకన్య జంక్షన్, అబీద్‌సెంటర్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అలాగే పట్టణంలోని తురకబడి ఉన్నత పాఠశాల ఆవరణలోకి వరదనీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాల గదులు కారిపోవడంతో పాటు కూర్చొనేందుకు అవకాశం లేక రెండు గంటలకే విద్యార్థులంతా ఇంటిముఖం పట్టారు.

కొయ్యూరులో నిండిన చెక్‌డ్యామ్‌లు

కొయ్యూరు: వేసవిని తలపించేలా వారం రోజులుగా కాస్తున్న ఎండలకు అల్లాడిపోయిన మండల వాసులు శుక్రవారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. మండల వ్యాప్తంగా సుమారు గంట సమయం మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరి నాట్లు వేసి వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్న రైతులు ఊరట చెందారు. అలాగే తీవ్రమైన ఎండతో పాటు ఉక్కబోతకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. కాగా, జలాశయాలు, చెక్‌డ్యామ్‌లకు కొండ కాలువల ద్వారా నీరు చేరడంతో కొంత మేలు చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. ప్రధాన మెట్ట పంటలకు ఈ వాన ఎంతో దోహదపడిందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



కొయ్యూరు పరిసరాల్లో పడుతున్న వాన

రావికమతంలో ఏరులై పారిన రోడ్లు

రావికమతం: మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఖరీఫ్ వరికి అదును దాటుతుందన్న ఆందోళనతో ఉన్న రైతులకు ఈ వర్షం ఊరట నిచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు వరినారు పోతల సమయంలో తుఫాన్‌ల కారణంగా అధిక వర్షాలు కురిశాయం. అనంతరం ఆ స్థాయి వర్షం లేదు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నారుమడులు ఎదిగొచ్చినప్పటికీ, తగినంత వర్షాలు లేని కారణంగా దమ్ములు జరగక వరినాట్లు పడలేదు. జూలై, ఆగస్టు మొదటి వారంతో పూర్తయ్యే దమ్ములు, ఈ ఏడాది ఇప్పటి వరకూ జరగకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా, భారీ వర్షం కారణంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నీరు ఏరులై పారింది. దీంతో వాహన రాకపోకల సమయంలో ఇబ్బందులు తలెత్తాయి.

ముంచెత్తిన తుమ్మపాల

తుమ్మపాల (అనకాపల్లి): అనకాపల్లి మండలంలోని తుమ్మపాల సమీప గ్రామాలు శుక్రవారం భారీ వర్షం పడింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. తుమ్మపాల ప్రధాన రోడ్డు గ్రామ సమీపంలోని గంగాలమ్మ గుడి వద్ద గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే యూనియన్ బ్యాంకు, ఏలేరు కాలువ సమీపంలోని రోడ్డు పూర్తిగా జలమయమై రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

కృష్ణాదేవి పేట జలమయం

కృష్ణాదేవి పేట: గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట, ఏఎల్.పురం, చోద్యం, విప్పలపాలెం, నాగాపురం తదితర ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం పడింది. దీంతో రైతులు, ప్రజలు ఉపశమనం పొందారు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో ఈ ఏడాది వరి నాట్లు నత్తనడకన జరుగుతున్నాయి. ఈ వర్షం కారణంగా వరినాట్లకు నీరు అందినట్లేనని రైతులు అంటున్నారు. అలాగే విపరీతంగా కాస్తున్న ఎండల నుంచి ప్రజలు ఊరట చెందారు. కాగా, భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



కృష్ణాదేవిపేటలో భారీగా కురుస్తున్న వాన

అరకులో సంతకు అవాంతరం

అరకు రూరల్: అందాల అరకులోయలో శుక్రవారం భారీ వాన పడింది. దీంతో వారపు సంతకు వచ్చిన వ్యాపారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంతలో విక్రయించేందుకు పలు రకాల అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకు వచ్చిన గిరిజనులు ఆందోళన చెందారు. అలాగే వర్షం కురిస్తే వ్యాపారం జరగదని వర్తకులు, అమ్మకానికి తెచ్చిన ఉత్పత్తులకు గిట్టుభాటు ధర రాదోమోనని గిరిజనులు మదన పడ్డారు. అర్ధ గంట తర్వాత వర్షం తెరిపివ్వడంతో వ్యాపారులు, గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, మోస్తరు వర్షం కురవడంతో ఎండిపోతున్న వరి చేలుకు ఊపిరిపోసినట్టయిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



అరకులోయలో హోరున కురుస్తున్న వర్షం

ఉపమాకలో శ్రావణమాసం తిరువీధి సేవలు

మాఢవీధుల్లో ఊరేగిన అమ్మవారు

వెంకన్న భక్తుల్లో ఆనందం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో శ్రావణమాసం తిరువీధి సేవలు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రెండు వారాలుగా శ్రావణమాసంలో సేవలు జరగడం లేదు. దీనిపై 'శ్రావణం సేవలకు టీటీడీ మంగళం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఇటీవల ఓ కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించి ఆలయ, ఆచారాల ప్రకారం యథావిధిగా తిరువీధి సేవలు నిర్వహించాలని టీటీడీ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో శుక్రవారం సాయంత్రం ఉపమాక గ్రామంలోని మాఢ వీధుల్లో ఈ ఏడాది శ్రావణ మాసం తొలి తిరువీధి సేవ జరిగింది. ఇత్తడి సప్పర వాహనంపై అలంకారప్రాయమైన ఆండాళ్లమ్మవారు మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయంలో ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల ప్రసాద్, అర్చకుడు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆండాళ్లమ్మ సన్నిధి వద్ద కుంకుమ పూజలు చేశారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం అమ్మవారి తిరువీధి సేవ జరగడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ విజిలెన్స్ విభాగం అధికారి రాజశేఖర్, శ్రీనివాసా సేవా సమితి సభ్యులు చెరకూరి వెంకటేశ్వరరావు, డీవీ సన్యాసిరావు, యువీఎస్.రావు, రంగబాబు, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.





ఇత్తడి సప్పర వాహనంపై మాఢవీధుల్లో ఊరేగుతున్న ఆండాళ్లమ్మవారు

తలారిసింగిలో వైద్య శిబిరం రేపు

పాడేరు: తలారిసింగి ఆశ్రమ పాఠశాలతో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం జరగనున్నది. పూర్వ విద్యార్థి తన్మయ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ అంబిడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుంది. అన్ని రకాల వ్యాధులకు సంబంధించి వైద్యం అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారులు లేని సమావేశం ఎందుకు?

ప్రజా ప్రతినిధుల ఆగ్రహం

అర్ధంతరంగా నిలిచిన మండల సమావేశం

కొయ్యూరు: సమస్యలు తెలిపి పరిష్కరించాలని వస్తున్నాం.. అధికారులు లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.. అధికారులు రానప్పుడు సమావేశం నిర్వహించడం ఎందుకు? అని ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగా, ఎంపీడీవో ఇమ్మానుయేలు ముందుగా సభను ఉద్దేశించి మాట్లాడారు. వారంలో రెండు రోజులు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వీలుగా సోమవారం నిర్వహించే గ్రీవెన్స్, ప్రతీ గురువారం నిర్వహించే మన ఊరు-మన వివాఖ కార్యక్రమాలకు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కానందున ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సేవా దృక్పథంతో ఉద్యోగులు విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం జడ్పీటీసీ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, ప్రధాన శాఖలైన రెవెన్యూ, గిరిజన సంక్షేమం, వ్యవసాయ, ఇంజనీరింగ్ అధికారులు డుమ్మా కొడితే, ప్రజాప్రతినిదులు అడిగే ప్రశ్నలకు ఎవరు సమాధానాలు చెబుతారని నిలదీశారు. అనంతరం




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ... హాజరైన ప్రజా ప్రతినిధులు

ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ, మండల సర్వసభ్య సమావేశాలకు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడం పరిపాటిగా మారిందని, పద్ధతి మార్చుకోవాలని సూచిస్తున్నా మార్పు రావడం లేదని చెప్పారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి చేపట్టే చర్యలను తహసీల్దార్ వివరించాలని, వ్యవసాయ సీజన్‌లో చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు ఏఈవో వివరించాలని స్పష్టం చేశారు. అధికారులు గైర్హాజరవుతూ వివరాలు తెలియని వారిని సమావేశాలకు పంపడం చూస్తే ప్రజా ప్రతినిధులు చేతకాని వారిలా కనిపిస్తున్నట్టు ఉందని ఎంపీపీ ఆగ్రహించారు. అధికారులు పూర్తి స్థాయిలో ఎప్పుడు హాజరవుతారో అప్పుడే సమావేశం నిర్వహించుకుందామని సభ్యులంతా లేచి వెళ్లిపోయారు. దీంతో చేసేది లేక సమావేశ నిర్వహణపై తదుపరి తేదీ ఖరారు చేసి సమాచారం ఇస్తామని ఎంపీడీవో ప్రకటించారు. దీంతో మండల సర్వసభ్య సమావేశం అర్ధాంతరంగా ముగిసింది.

పర్యాటకం పేరిట గిరిజన సంస్కృతిపై దాడి

పాడేరు: ఏజెన్సీలో పర్యాటకం పేరిట గిరిజన సంస్కృతిపై దాడి జరిగే ప్రమాదం ఉందని శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. గత ఆదివాసీ దినోత్సవంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదన్నారు. గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు, కొండకుమ్మర్లను ఎస్‌టీ జాబితాలో చేర్పించ డం, గిరిజనులకు విద్య, వైద్య సేవలు అందించడంలో విఫలమైన ప్రభుత్వం, టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడతామని ప్రకటించడం అన్యాయమన్నారు. గిరిజన సంస్కృతి, ఆచారాలపై దాడి చేయాలనే లక్ష్యంతోనే కేవలం టూరిజం అభివృద్ధిపై మాత్రమే దృష్టి సారిస్తున్నారన్నారు. ఏజెన్సీలో పరిష్కరించాల్సిన సమస్యలు అనేకం ఉన్నా, పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుడుముల కాంతారావు, వైద్య ఉద్యోగుల సంఘం నేత నాగరాజు, గిరిజన సంఘం నేత ఎం.ఎం.శ్రీను పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

వివిధ సమస్యలపై 108 విన్నపాలు ● ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తాం: పీవో

పాడేరు: ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై 108 వినతిపత్రాలు వచ్చాయి. ఈ విన్నపాలను ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి స్వీకరించారు. ప్రాధాన్యత ప్రకారం ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ప్రజావాణి అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని పీవో ఆదేశించారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వచ్చిన ఈ వినతుల వివరాలిలా ఉన్నాయి.

తమ పిల్లలకు బెస్ట్ అవైలబుల్ సీట్లు కేటాయించాలని కోరుతూ, 3, 5, 8 తరగతులకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో అర్జీలు సమర్పించారు. ట్రైకార్ రుణాలు కావాలని జి.మాడుగుల మండలం కుంబిడిసింగి గ్రామానికి చెందిన తలారి పెద్దబ్బాయి, అదే మండలం కోరాపల్లి గ్రామానికి చెందిన కోరాబు సింహాచలం కోరారు. తనకు సివిల్స్ కోచింగ్ అవకాశం కల్పించాలని హుకుంపేట మండలం సూకూరు గ్రామానికి చెందిన పరదాని మోహన్ కోరగా, పాడేరు మండలంలో పలు పంచాయతీల్లో ఈ-సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. దీర్ఘకాలిక రోగంతో ఇబ్బందులు పడుతున్న తనకు ఆర్థిక సహాయం అందించాలని హుకుంపేట మండలం సంతారి గ్రామానికి చెందిన కార్తీక రాజు విన్నవించాడు. తమకు సిల్వర్‌ఓక్ చెట్ల పెంపకానికి సహాయం అందించాలని అరకులోయ మండలం వర్ర గ్రామానికి చెందిన జన్ని సిద్దు కోరగా, వ్యవసాయ పనిముట్లు సమకూర్చాలని ముంచంగిపుట్టు మండలం



ప్రజావాణిలో గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో

కుంబిరిపడ గ్రామానికి చెందిన సీసా కమల వినతిపత్రం అందజేశారు. గిరిపుత్రిక పథకాన్ని మంజూరు చేయాలని జి.మాడుగుల మండలం అగాపాడు గ్రామానికి చెందిన కొర్రా గౌరి కోరగా, తమ గ్రామానికి సిమెంట్ కాంక్రీట్ రోడ్లు వేయాలని, నీటి పథకాలు నిర్మించాలని అదే మండలానికి చెందిన గెమ్మెలి గ్రామానికి చెందిన గిరిజనులు విన్నవించారు. అలాగే తమకు చెక్‌డ్యామ్‌లు, పాఠశాల, రోడ్లు, తాగునీటి పథకాలు మంజూరు చేయాలని పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ గందలం గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో డి.వేణుగోపాల్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా అభ్యంతరాలకు 16 వరకు గడువు

పాడేరు: గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ (గణితం, సామాన్య శాస్త్రం, సోషల్, తెలుగు, ఆంగ్లం, హింధీ) ఉపాధ్యాయుల తుది సీనియారిటీ జాబితాను రూపొందించామని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను తెలిపేందుకు ఈ నెల 16వ తేదీ వరకు గడవు ఉందని చెప్పారు. ఈలోగా అభ్యంతరాలు తెలిపితే సవరణ చేపట్టి, జాబితాలను ఏజెన్సీలోని ఏటీడబ్ల్యూవోల వద్ద లభ్యమవుతాయన్నారు. అలాగే జీవో నంబర్-3 ప్రకారం పదోన్నతులు పొందేందుకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు స్థానిక గిరిజనులై ఉండాలని, అందుకు తమ కుటుంబం 1950 జనవరి 26 నుంచి ఇక్కడే నివసిస్తున్నట్లు తహసీల్దార్ వద్ద ధ్రువీకరణ పత్రం పొందాలని డీడీ విజయకుమార్ స్పష్టం చేశారు.

నేరోడువలసలో అసంపూర్తిగా నీటి పథకం

పాడేరు: మండలంలో జి.ముంచంగిపుట్టు పంచాయతీ నేరోడువలసలో తాగు నీటి పథకం అంసపూర్తిగా నిలిచిపోయింది. దీంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం పాడేరులో విలేకరులకు కలిసి తమ సమస్యను తెలిపారు. గ్రామంలో తాగునీటి పథకానికి రూ.8 లక్షలు మంజూరైనప్పటికీ, కాంట్రాక్టర్ నిర్మాణ పనులు పూర్తి చేయకుండా వదిశారని తెలిపారు. దీంతో పథకం మంజూరైనప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి పథకం పూర్తికాక యథాయతతంగా కలుషత ఊట గెడ్డలపైనే ఆధారపడుతున్నామని వారు వాపోయారు. ఇప్పటికైనా తమ గ్రామంలో నీటి పథకం పనులు పూర్తి చేసి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని నేరోడివలస వాసులు విజ్ఞప్తి చేశారు.

జీసీసీ బంకులో పెట్రోల్ ఖాళీ

అరకురూరల్: అరకులోయలో హిందుస్థాన్ పెట్రోల్‌బంక్‌లో ఆయిల్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పెట్రోల్,డీజిల్ అవసరమయ్యేవారంతా ఇండియన్ ఆయిల్ బంక్‌కు చేరుకోవడంతో వాహనాలు బారులు తీరాయి. వినియోగదారులకు తగ్గట్టుగా జీసీసీ నిర్వహించే హెచ్‌పి బంక్ సేవలు అందించలేకపోతోందని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు బంక్‌లో ఆయిల్ అయిపోవడం, ఒకటి రెండు రోజులు తర్వాత ఆయిల్ రావడంతో వినియోగదారులు జీసీసీ నిర్వహణపై అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు.

ట్రైకార్ రుణాలకు 17న ఇంటర్వ్యూలు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం ఎస్‌బీహెచ్ బ్యాంక్ పరిధిలో దరఖాస్తు చేసుకున్న ట్రైకార్.. ఎస్సీ, బీసీ రుణాలకు ఈనెల 17న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. శుక్రవారం ఈ అంశమై ఎంపీడీఓ రమేష్‌రామన్ ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకులోనే నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. సంబంధిత వ్యక్తులు పూర్తి వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

టోకూరులో ఉచిత గ్యాస్ కనెక్షన్లు

39 మంది గిరిజనులకు అందజేత

అనంతగిరిరూరల్, ఆగస్టు 11: మండలంలోని టోకూరు పంచాయతీలో శుక్రవారం ఉచిత గ్యాస్ కనక్షన్‌లను లబ్ధిదారులకు స్థానిక సర్పంచ్ సారాసోము అందజేశారు. జీసీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్ డిపోల వద్ద ఆయా పంచాయతీలలో అందజేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం టోకూరు పంచాయతీలోని 39 మంది గిరిజనులకు గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేశారు. ఐదు కిలోల గ్యాస్ సిలెండర్లతో పాటు



గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న సర్పంచ్ సారాసోము

స్టవ్, రెగ్యులేటర్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సేల్స్ మ్యాన్ అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మాడుగుల
4
విశాఖపట్నం। శనివారం 12 ఆగస్టు 2017
మాడుగుల • దేవరాపల్లి • కె.కోటపాడు • చీడికాడ

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	నక్షత్రం

రక్షిత పథకాలకు క్లోరినేషన్ చేయాలి

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పద్మజ

కె.కోటపాడు : రక్షిత మంచి నీటి పథకాలకు పంప్ ఆపరేటర్లు ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.పద్మజ సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పంప్ ఆపరేటర్లకు తాగునీటి సరఫరాపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంప్ ఆపరేటర్లు బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేయడం వలన ప్రజలకు సురక్షితమైన రక్షిత నీరు అందుతుందన్నారు. వారానికోసారి రక్షిత పథకాన్ని పూర్తిగా శుభ్రపరచాలని చెప్పారు. తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహించే పంప్ ఆపరేటర్లును ఉపేక్షిం


క్లోరోస్కోప్ మిషన్ అందజేస్తున్న పద్మజ

చేదిలేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో 90 రక్షిత పథకాల నిర్మాణాల కొరకు రూ.16కోట్లతో ప్రతిపాదనలు చేశామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 38రక్షిత పథకాల నిర్మాణాల కొరకు రూ.5కోట్లతో ప్రతిపాదనలు చేశామని తెలిపారు. మల్టీ విలేజ్ స్కీమ్(ఎంవీఎస్)లో భాగంగా మాడుగుల మండలం సాగరంలో రూ.8.7కోట్లతో, కె.కోటపాడు మండలం చౌడు వాడలో రూ.6కోట్లతో, దేవరాపల్లి మండలం వేచలం గ్రామంలో రూ.8.5 కోట్లతో రక్షిత పథకాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పి.చంద్రకిరణ్, ఎన్.నీలిమ, ఎస్.కనకమ్మ, ఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సబ్సిడీ రుణాలు : ఎంపీపీ

చీడికాడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ సబ్సిడీపై రుణాలు అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీపీ కుచ్చు కళావతి అన్నారు. ఎంపీడీవో సమావేశమందిరంలో కాపు, బీసీ, ఎస్సీ, మైనారిటీ రుణాలకు దరఖాస్తు చేసిన లబ్ధిదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో ఆర్ఎం.గ్లాడ్స్ మాట్లాడుతూ చోడవరం ఆంధ్రాబ్యాంకు పరిధిలో 18 మంది, ఇండియన్ బ్యాంకు వి.మాడుగుల పరిధిలో 54 మంది, ఏపీజీవీబీ కె.జె.పురంలో పరిధిలో 9 మంది, ఏపీజీవీబీ చోడవరం పరిధిలో ఆరుగురు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వ


ఇంటర్వ్యూ జరుపుతున్న అదికారులు

హించామన్నారు. వీరికి త్వరలోనే రుణ మంజూరు విషయమై తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, బ్యాంకు అధికారులు, కార్పొరేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుజల స్రవంతి సాధనకు పోస్ట్‌కార్డు ఉదమం


పోస్ట్‌కార్డులతో సాధన సమితి ప్రతినిధులు

మాడుగుల రూరల్ : ుజల స్రవంతి ప్రాజెక్ట్ సాధనకు ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్ట్‌ల సాధన సమితి ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. సాధన సమితి మాడుగుల నియోజకవర్గ కన్వీనర్ పీవీజీ కుమార్ నేతృత్వంలో శుక్రవారం మండలంలోని ముకుందపురంలో పలువురు పోస్ట్‌కార్డుల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్‌తోపాటు పలు ప్రాజెక్ట్‌లు పూర్తి చేయాలని కోరుతూ ఉత్తరాలు రాసి పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ సుజల స్రవంతి ప్రాజెక్ట్ పూర్తయితే 80వేల ఎకరాల ఆయకట్టుకు, మాడుగుల నియోజకవర్గంలో 150 ఎకరాలకు అదనంగా సాగునీరు సమకూరుతుందన్నారు. ఉత్తరాంధ్రలో పెండింగ్ ఉన్న ప్రాజెక్ట్‌లను త్వరితగతిన పూర్తి చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. దీనిపై మాడుగుల నియోజకవర్గంలో పదివేల ఉత్తరాలను పంపించనున్నామన్నారు. చీడికాడ జడ్పీటీసీ సభ్యురాలు పి. సత్యవతి, కోట్ని శ్రీరామ్మూర్తి, భీమరశెట్టి పైడినాయుడు, అడపా నరసింహామూర్తి పాల్గొన్నారు.

గ్రామసభ ఆమోదించిన వారికి పక్కా గృహాలు

హౌసింగ్ ఏఈ రమణమూర్తి

చీడికాడ: గ్రామసభ ఆమోదించిన వారందరికీ పక్కా గృహాలు మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని గృహనిర్మాణశాఖ ఏఈ ఎస్‌వీ.రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని జి.కొత్తపల్లి, బి.సింగవరం, అప్పలరాజుపురం, చీడికాడ, ఎ.అగ్రహారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రజాసాధికార సర్వేలో ఇప్పటికీ పక్కా గృహాలు నిర్మించుకోలేని వారి పేర్లను గుర్తించామన్నారు. వారిలో ఎంతమంది కట్టుకుంటారో, ఎవరు అర్హులో గ్రామసభలో గుర్తిస్తారన్నారు. వారందరికీ పక్కా గృహాల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. చీడికాడలో 345 మందిని,జి.కొత్తపల్లిలో 144, ఎ.అగ్రహారంలో 73, అప్పలరాజుపురంలో 86, బి.సింగవరంలో 21 మందిని అర్హులుగా గుర్తించారన్నారు. సర్పంచ్‌లు కంటిపాము అచ్చియ్యమ్మ, మైచర్ల నానాజీ, చుక్క అప్పలనాయుడు, ఉప సర్పంచ్‌లు యర్రా అప్పారావు, శరగడం జయరామకృష్ణ, కోనాం జలాశయం చైర్మన్ గండి ముసలినాయుడు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ చిన్నసాహెబ్, మాజీ సర్పంచ్ పోతల చిన్నంనాయుడు, టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి శరగడం శివ పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న రమణమూర్తి

గ్రానైట్ తవ్వకాలకు అనుమతివ్వరాదు : సీపీఎం

చీడికాడ: కొన్నెంపూడి ఏరియాలో గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వరాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు, కేవీపీఎస్ జిల్లా నాయకుడే కె.అప్పారావుతో కలిసి శుక్రవారం వీబీపేట శివారు కొన్నెంపూడి గ్రామాన్ని ఆనుకుని ఉన్న మెట్ట ప్రాంతాలను ఆయన పరిశీలించారు. గ్రామం చుట్టూ ఉన్న కొండల్లో గ్రానైట్ తవ్వకానికి పలువురు దరఖాస్తు చేసుకున్నారని, దీనిపై మైనింగ్, స్థానిక రెవెన్యూ అధికారుల అనుమతులు ఇస్తే కొన్నెంపూడి, గొప్పూరు గ్రామాల్లో 40 కుటుంబాలు నాశనమవడం ఖాయమని అన్నారు. కొండల చుట్టూ ఉన్న భూముల్లో భారీ వాహనాలు తిరగడం వల్ల చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీ ఇవ్వకూడదని, మైనింగ్ అధికారుల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ ప్రాంత రైతులను చైతన్యవంతులను చేసి పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం


చీడికాడ: అంకితభావంతో పని చేసేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఖండివరం గ్రామ సర్పంచ్ సింగంపల్లి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఖండివరం ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు ఎస్.ప్రభాకర్, ఎ.గోవింద్, జి.మారమ్మ, డీఎస్ఎస్.కుమారి, ఎం.మణివర్మ, జి.వరలక్ష్మి, కె.ముత్యాలనాయుడు, ఎంఎస్.గణపతి, ఎం.అనురాధ, వై.పుష్మకుమారిలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ శ్రీరంరెడ్డి సూర్యనారాయణ, హైస్కూల్ కమిటీ చైర్మన్ గెంజి కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు బత్తి వెంకటరమణ, టీడీపీ సీనియర్ నాయకుడు డోకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ కారణంగానే విద్యుత్ సరఫరాలో అంతరాయం

చోడవరం: లైన్ల నిర్వహణ కారణంగా ఎమర్జెన్సీలోడ్ రిలీఫ్ మేరకు గ్రామీణప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని నర్సీపట్నం ఈడీపీసీఎల్ డీఈ వైఎల్ ప్రతాప్‌కుమార్ తెలిపారు. 'పల్లెల్లో అంధకారం' శీర్షికన ప్రచురితమైన వార్తకు శుక్రవారం ఆయన వివరణ ఇచ్చారు. వడ్డాది 33 కేవీ ఫీడరు పరిధిలో 7,8,9 తేదీలలోనూ, చోడవరం 33 కేవీ ఫీడరు పరిధిలో 5,6,7 తేదీలలో లోడ్ రిలీఫ్ ఇచ్చారన్నారు. ఆ సమయంలో ప్రత్నామ్యాయంగా సబ్బవరం 33 కేవీ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా కల్పించామన్నారు. గ్రామీణ మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్టయితే ఆయా మండలాల అధికారులకు ఫోన్ చేయాలనిసూచించారు. దేవరాపల్లి మండలానికి ఏఈ నెంబరు 9440812571కు, మాడుగులకు ఏఈ 9440812572కు, చీడికాడ మండలంలో ఏ ఈ 9440812573కి ఫోన్ చేయాలని కోరారు. రావికమతం మండలంలో ఏఈ 9440812549కి, కె. కోటపాడు మండలం ఏ ఈకి 9440812541కి ఫోన్ చేయాలని సూచించారు. వడ్డాది ఏడీ ఈ 9491049792, నర్సీపట్నం డివిజన్ ఏడి ఈ 9491049790కి ఫోన్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

పంచాయతీ కార్యాలయ భవనం పరిశీలన

దేవరాపల్లి: మండలంలో మంజూరైన అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పీఆర్ డీఈఈ పి.కృష్ణారెడ్డి మండల అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం మరమ్మతుల పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.7 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం 15శాతం మాత్రమే జరిగిందని, మిగిలిన పనులు త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మండలానికి 31 అంగన్‌వాడీ భవనాలు


అధికారులతో మాట్లాడుతున్న డీఈఈ

మంజూరయ్యాయని, అందులో 28 భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, మిగతా మూడు భవనాల పనులు త్వరలో ప్రారంభించనున్నామని అన్నారు. ఆయన వెంట పీఆర్ ఏఈఈ ఎన్.రామలక్ష్మి, మూర్తి తదితరులున్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి గవిరెడ్డి ఆర్థిక సహాయం

చీడికాడ: మండలంలోని దండిసురం గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు శుక్రవారం పరామర్శించారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న రామానాయుడు

గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు కాశిన సత్యారావు పూరిల్లు ఈ నెల 9న దగ్ధమై పాడిగేదెకు గాయాలయ్యాయి. బాధితుడికి రామా నాయుడు రూ.6వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు బొబ్బాది తాతారావు, ఎంపీపీ కుచ్చు కళావతి, కోనాం జలాశయం చైర్మన్ గండి ముసలినాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, పార్టీ మండలఅధ్యక్షుడు పేరపు కొండబాబు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	నక్షత్రం

అన్నవరంలో రూ.20 లక్షలతో కల్యాణ మండపం

సర్పంచ్ దొమ్మేసి అప్పలనర్స

చోడవరం: స్థానిక పంచాయతీ శివారు అన్నవరం గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రూ.20 లక్షలు మంజూరు చేశారని మేజర్ పంచాయతీ సర్పంచ్ దొమ్మేసి అప్పలనర్స తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆమె విలేఖరులతో మాట్లాడుతూ అన్నవరం గ్రామంలో విశాఖ డెయిరీ కేంద్రం సమీపంలో కల్యాణ మండపం నిర్మాణానికి గత ఏడాది ఎమ్మెల్యే రాజు, స్పెషల్ డెవలప్‌మెంట్ పథకం కింద రూ.5లక్షలు మంజూరు చేశారన్నారు. దీని నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గం ఈ ఏడాది జూన్ 27న తీర్మానించిందన్నారు. తాజాగా ఎమ్మెల్యే రాజు మరో రూ.15 లక్షలు మంజూరు చేశారని అన్నారు. అన్నవరం వద్ద పంచాయతీ స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రూ.18 లక్షలు ఇచ్చారని, నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని వైసీపీ నాయకులు పంచాయతీని కోరారని, అయితే ఇప్పటికే పాలసంఘానికి అనుమతి ఇచ్చినందున వైసీపీ నాయకులకు అనుమతి ఇవ్వలేమని ఆమె స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు కల్యాణ మండపం నిర్మాణానికి మంజూరైన నిధులను అదే గ్రామంలో ఇతర అభివృద్ధి పనులకు ఉపయోగిస్తే తాము అనుమతి ఇస్తామని అన్నారు.



మంజూరైన నిధుల ఉత్తర్వులు చూపిస్తున్న సర్పంచ్ అప్పలనర్స

అభివృద్ధి పనుల్లో రాజకీయాలు చొప్పించి గ్రామాల్లో వివాదాలు రేపడం సరికాదని, ప్రభుత్వం చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణ స్థలంలోనే తామూ నిర్మాణానికి వైసీపీ నాయకులు నిధులు తేవడం వివాదాలను లేపడమేనని మాజీ ఎంపీపీ పెదబాబు విమర్శించారు. స్థానిక టీడీపీ నాయకులు దొమ్మేసి గిరి, ఎంపీటీసీ సభ్యురాలు పట్నాల వరలక్ష్మి, వార్డు సభ్యుడు ఎర్రంశెట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

బుచ్చెయ్యపేట : వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి మాడుగుల మండలంలో పూర్తిగాను, బుచ్చెయ్యపేట మండలంలో వడ్డాది, బుచ్చెయ్యపేట, బంగారుమెట్ట ఫీడర్, విజయరామరాజుపేట ఫీడర్, డీఆర్‌డీవో, పారిశ్రామిక ప్రాంతంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ మహేష్ తెలిపారు. రాజాం నుంచి వడ్డాది వచ్చే 33 కెవీ లైన్ మరమ్మల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాలకు కొబ్బరి మొక్కల తరలింపు



కొబ్బరి మొక్కలను తరలిస్తున్న కూలీలు

బుచ్చెయ్యపేట : చెరువు గట్లపై ఉపాధి పథకం కింద నాటేందుకు మండలంలోని 18 గ్రామాలకు 3,500 కొబ్బరిమొక్కలను శుక్రవారం తరలించారు. ఆయా గ్రామా ల్లోని 30 చెరువు గట్లపై వీటిని నాటుతామని, మూడేళ్ల పాటు వీటి పర్యవేక్షణ, సంరక్షణ, చేపడతామని ఉపాధి ఏపీవో అప్పలరాజు తెలిపారు. మూడేళ్ల అనంతరం ఆయా గ్రామ పంచాయతీలకు నిర్వహణ బాధ్యత అప్పగిస్తామని పేర్కొన్నారు.

బయటపడుతున్న అన్యాక్రాంత అసైన్డ్ భూములు

లెక్కలు తేలుస్తున్న రెవెన్యూ అధికారులు

బుచ్చెయ్యపేట : మండలంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు వందల ఎకరాల్లో వెలుగుచూస్తున్నాయి. మండంలో పేదలకు పంపిణీ చేసిన 1480 ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వీటిపై దర్యాప్తు చేపట్టాలని జిల్లా వ్యవసాయ కూలీల సంఘం ప్రధాన కార్యదర్శి నాగులాపల్లి సత్యనారాయణ సిట్ అధికారులకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మల్లాం రెవెన్యూ పరిధిలో 200, తైపురంలో 280, ఆర్.శివరామపురంలో 225, లోపూడిలో 227, ఎం.భూపతిపాలెంలో 227, అప్పంపాలెంలో 64, పెదపూడిలో 254, కేపీ అగ్రహారంలో 11 ఎకరాల అసైన్డ్, ల్యాండ్ సీలింగ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి సిట్‌కు చేసిన ఫిర్యాదులో సత్యనారాయణ సర్వే నంబర్లతో సహా ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు జరిపి నివేదిక అందించాల్సిందిగా సిట్ అధికారులు తహసీల్దార్ కేవీవీ శివను ఆదేశించారు. ఈ మేరకు ఈ ఎనిమిది గ్రామాల్లో అసైన్డ్ భూములపై చేపట్టిన విచారణలో ఆయా భూములు అన్యాక్రాంతమైనట్లు అధికారుల విచారణలో తేలింది. దీంతో మిగతా గ్రామాల్లో డి.ఫారమ్ పట్టాలు మంజూరు చేసిన భూములపై కూడా విచారణ చేపట్టాలని తహసీల్దార్ వీఆర్వోలను ఆదేశించారు. వారి విచారణలో కూడా చాలా వరకూ అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైనట్టు గుర్తించారు. సిట్ అధికారుల ఆదేశాల మేరకు ఎనిమిది గ్రామాలకు సంబధించిన అన్యా క్రాంతమైన భూముల వివరాలను తహసీల్దార్ శివ గ్రామాల వారీగా సిట్ అధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిసింది. మిగిలిన గ్రామాల్లో కూడా అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములపై చర్యలు తీసుకోవడానికి రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా మండలంలో డి.ఫారమ్ పట్టాదారుల జాబితాను సిద్ధం చేస్తున్నారు.

ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ కారణంగానే

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం ఈపీడీసీఎల్ డీఈ ప్రతాప్‌కుమార్

చోడవరం: లైన్ల నిర్వహణ కారణంగా ఎమర్జెన్సీలోడ్ రిలీఫ్ మేరకు గ్రామీణప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని నర్సీపట్నం ఈడీపీసీఎల్ డీఈ వైఎల్ ప్రతాప్‌కుమార్ తెలిపారు. 'పల్లెల్లో అంధకారం' శీర్షికన ప్రచురితమైన వార్తకు శుక్రవారం ఆయన వివరణ ఇచ్చారు. వడ్డాది 33 కేవీ ఫీడరు పరిధిలో 7,8,9 తేదీలలోనూ, చోడవరం 33 కేవీ ఫీడరు పరిధిలో 5,6,7 తేదీలలో లోడ్ రిలీఫ్ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఎమర్జెన్సీలోడ్ రిలీఫ్ సమయంలో ప్రత్నామ్యాయంగా సబ్బవరం 33 కేవీ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా కల్పించామని ఆయన తెలిపారు. కాగా గ్రామీణప్రాంత మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్టయితే ఆయా మండలాల అధికారులకు ఫోన్ చే యాలని ఆయన సూచించారు. దేవరాపల్లి మండలానికి సంబంధించి ఎ ఈ నెంబరు 9440812571కు, చోడవరంటౌన్‌కు సంబంధించి ఏఈ నెంబరు 9440812540కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే చోడవరం రూరల్‌కు సంబంధించి 7382299937కు, చోడవరం సబ్ డివిజన్ పరిధిలో ఏడి ఈ నెంబరు 9440812507కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. బుచ్చెయ్యపేట ఏఈ నెంబరు 9440812542కు, మాడుగులకు ఏఈ 9440812572కు, చీడికాడ మండలంలో ఏ ఈ 9440812573కి ఫోన్ చేయాలని కోరారు. రావికమతం మండలంలో ఏ ఈ 9440812549కి, కె. కోటపాడు మండలం ఏ ఈకి 9440812541కి ఫోన్ చేయాలని సూచించారు. వడ్డాది ఏడి ఈ 9491049792, నర్సీపట్నం డివిజన్ ఏడి ఈ 9491049790కి ఫోన్ చేయాలని నర్సీపట్నం ఈపీడీసీఎల్‌డిఇ ప్రతాప్‌కుమార్ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నేడు ఐదు గ్రామాలకు విద్యుత్ సరఫరా బంద్

చోడవరం మండలంలోని ఐదు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని చోడవరం విద్యుత్‌శాఖ ఏఈ కె.శంకరరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ మండలంలోని జన్నవరం, కన్నంపాలెం, తిమ్మనపాలెం, చాకిపల్లి, రామజోగిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కశింకోట నుంచి వడ్డాది వరకూ గల 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతు పనులతోపాటు చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

మొరాయిస్తున్న పీఓఎస్ మిషన్‌లు

ఎరువుల కోసం రైతుల అగచాట్లు

బుచ్చెయ్యపేట : ఆన్‌లైన్ విధానంపై రసాయనిక ఎరువుల అమ్మకాలు రైతులను అగచాట్లకు గురిచేస్తున్నాయి. రైతులు ఆధార్ కార్డు తీసుకుని ఎరువుల దుకాణాలకు వెళితే యూజర్ ఐడీ, పాస్ వర్డ్ సరిపోకపోవడంతో మండలంలోని మూడు పీఏసీఎస్‌లు, ఒక ఎరువుల షాపులో రసాయనిక ఎరువుల అమ్మకాలు నిలిచిపోయాయి. పీఓఎస్ మిషన్‌పై రైతుల వేలిముద్రలు తీసుకుని కానీ ఎరువుల అ మ్మకాలు చేయకూడదన్న నిబంధన మేరకు వ్యాపారులు పీఓఎస్ మిషన్‌లు మొరాయిస్తున్న సమయంలో ఎరువుల అ మ్మకాలు నిలిపివేస్తున్నారు. చోడవరం డివిజన్ పరిధిలోని ఎరువుల దుకాణాలకు పీఓఎస్ మిషన్‌లు పంపిణీ చేసిన వ్యవసాయాధికారులు నర్సీపట్నం డివిజన్ పరిధిలో పంపిణీ చేయలేదు. దీంతో ఇక్కడి రైతులు మాడుగుల మండలంలోని ఎరువుల దుకాణాలకు వెళుతున్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడితో తెచ్చుకున్న ఎరువులను మిషన్ మొరాయింపులతో అమ్మకాలకు బ్రెక్ పడటంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్క మండలాల్లో పాత పద్ధతిలో ఎరువులు విక్రయిస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో కూడా అదే పద్ధతిలో అమ్మకాలు జరపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఏఓ శైలజను వివరణ కోరగా, కొన్ని పీఏసీఎస్‌లలో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ సౌకర్యం లేకపోవడంతో పీఓఎస్ మిషన్‌లు మొరాయిస్తున్నాయని తెలిపారు. కొన్ని ఎరువుల దకాణాల లైసెన్స్‌డ్ యాజమానులు మారడంతో పాస్‌వర్డ్‌లో తేడా రావడంతో అక్కడ మిషన్‌లు మొరాయిస్తున్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



వడ్డాది పీఓఎస్ మిషన్‌పై వేలిముద్ర వేస్తున్న రైతు

గ్రామైక్య సంఘాలు ముందంజలో ఉండాలి

వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ ధర్మారావు



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

దేవరాపల్లి: మండలంలోని గ్రామైక్య సంఘాలు ఎ గ్రేడ్‌లో ఉండాలని పెందుర్తి వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ వి.ధర్మారావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు గూమ్మాల లావణ్య అధ్యక్షతన మండల మహిళ సమాఖ్యసర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2016-17 వార్షిక ప్రగతి నివేదికను ఏపీఎం బీడీ తిలక్ చదివి వినిపించారు. మండలంలో 1305 సంఘాలు ఉన్నాయని, రెండో విడత పెట్టుబడి నిధి కింద 1210 సంఘాలకు రూ.7.16 కోట్లు ఇచ్చామని అన్నారు. ఈ ఏడాది 47 గ్రామ సంఘాలలో 897 సంఘాలకు రూ.46లక్షలు వడ్డీలేని రుణాలు ఇచ్చామన్నారు. స్త్రీనిధి కింద 88 సంఘాలకు రూ.5.66 కోట్లు డిపాజిట్లు చేశామని, ఇందులో కోటి 33 లక్షలు రుణాలు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా చంద్రన్న బీమా, ఆమ్ ఆద్మీ, విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ తదితర అంశాల గురించి వివరించారు. డీఎంజీలు రాంబాబు, సూర్యనారాయణ, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వరికి పొట్ట, పిలకల దశల్లో నీరందించాలి

కె.కోటపాడు : వరి పంటకు పొట్ట, పిలకల దశల్లో రైతులు నీరందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చోడవరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వరి పంటకు నీరందించడంతో పాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. చెరకు ఉడిచిన నెలరోజుల తర్వాత పూర్తి స్థాయిలో నీరందిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. జలవనరుల శాఖ ఏఈ జి.సత్యంనాయుడు చెరువులు, ప్రాజెక్టుల నీటి సామర్థ్యం పెంపునకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు.

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

సినిమా

శ్రీకన్య - ఫిదా
కన్య - దర్శకుడు
కన్యమినీ - వశం
సాయిశ్రీకన్య - ఇదేమి! దెయ్యం
రాజుమూవీమ్యాక్స్ - నక్షత్రం
బంగార్రాజు - గౌతమ్‌నందా

ఫొటోథెరపీ యూనిట్ల కొరతతో పసి పిల్లలకు శాపం



ప్రతిరోజు పది వరకు ప్రసవాలు.. శిశువులకు సరిపడా లేని ఫొటోథెరపీలు.. ఒకే థెరపీలో ఇద్దరికి చికిత్స.. తల్లడిల్లుతున్న తల్లులు


నర్సీపట్నం టౌన్:
జననాల సంఖ్యకు తగ్గట్టుగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఫొటోథెరపీ యూనిట్‌లు లేకపోవడంతో పురిటి బిడ్డలకు వైద్య సేవలు అందడం లేదు. అప్పుడే పుట్టిన శిశువులకు పచ్చకామెర్లు సోకకుండా ఇచ్చే చికిత్సకు అవసరమైన ఫొటోథెరపీ యూనిట్‌లు ఆస్పత్రిలో రెండు మాత్రమే ఉన్నాయి. దీనివలన పసిపిల్లలకు సకాలంలో వైద్యం అందించలేని పరిస్థితి నెలకొంది. ఉన్న రెండు థెరపీ యూనిట్‌లలో ఇద్దరు నుంచి ముగ్గురు పిల్లలకు ఒకేసారి చికిత్స అందిస్తున్నారు. దీనివలన ఒకరి నుంచి మరొకరికి ఇన్‌ఫెక్షన్‌లు సోకే ప్రమాదం ఉందని శిశువుల తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితులలో ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. కొంతమందికి చికిత్స అందుతున్నప్పటికీ మరికొంతమంది పిల్లల చికిత్స కోసం తల్లులు, బంధువులు గంటల తరబడి శిశువులను ఎత్తుకుని వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

నేలపైనే నిరీక్షణ
చికిత్స కోసం శిశువులకు ప్రత్యేక గదిని కేటాయించాల్సి ఉన్నప్పటికీ అదేమీ లేకుండా ఆస్పత్రి విస్తరణ పనులు జరుగుతున్న ప్రదేశానికి దగ్గర్లోనే చికిత్స అందిస్తున్నారు. ఈ పనులు వలన చిన్నారులకు ఇన్‌ఫెక్షన్‌లు సోకుతాయన్న కనీస జ్ఞానం లేకుండా శిశువులను నేలపై పడుకోబెట్టి తల్లులు నిరీక్షించేలా సిబ్బంది చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే.. ఉంచితే ఉంచండి...లేదా ప్రైవేటు క్లినిక్‌లకు తీసుకెళ్లండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని బాలింతల బంధువులు వాపోతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి భవనం నిర్మించినప్పటికీ చికిత్సకు అవసరమైనటువంటి వైద్యపరికరాలు అందుబాటులో ఉండడం లేదు. ఈ ఆస్పత్రిలో నెలకు 350 నుంచి 400 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. అత్యధిక ప్రసవాలు చేస్తున్న ఆస్పత్రిగా ముఖ్యమంత్రి నుంచి అవార్డు కూడా దక్కింది. ఇక్కడ జన్మించిన శిశువులకు పచ్చకామెర్లు వ్యాధి రాకుండా ఫొటోథెరపీ యూనిట్‌లలో చికిత్స దాదాపు అందరికీ అందించాల్సి ఉంది. కొన్నేళ్లుగా ఫొటోథెరపీ యూనిట్‌ల కోసం ప్రతిపాదనలు పంపించినా మంజూరు కావడం లేదని సిబ్బంది అంటున్నారు. అధికారులు స్పందించి జనాల రేటుకు తగినట్టుగా ఫొటోథెరపీ యూనిట్‌లు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.


ఫొటోథెరపీ కోసం శిశువులను ఎత్తుకుని ఎదురుచూస్తున్న తల్లులు, బంధువులు

విస్తరణ పూర్తికాగానే సమస్య పరిష్కరిస్తాం

ఎన్.వి.సుధాశారద, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్.



ఆస్పత్రి విస్తరణ పనులు జరుగుతున్న దృష్ట్యా కొన్ని వార్డులకు ప్రత్యేక గదులు కేటాయించలేకపోయాం. ఈనెల 17న ఆస్పత్రి ప్రారంభం కాగానే ఏ విభాగానికి అవసరమైన గదులను ఆయా విభాగాలకు కేటాయిస్తాం. ఆస్పత్రిలో ఫొటోథెరపీ యూనిట్‌లు మరిన్ని కావాలని ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపించాం. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.

ఆలయాలు కిటకిట


శ్రీకన్య జంక్షన్‌లోని కనకదుర్గమ్మ ఆలయం ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం టౌన్:
శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు అమ్మవారి ఆలయాలకు మహిళలు పోటెత్తారు. గత వారం వరలక్ష్మి వ్రతం జరుపుకోని భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయానికి కుటుంబ సమేతంగా తరలివచ్చి దర్శించుకున్నారు. పట్టణంలోని శ్రీకన్య జంక్షన్‌లోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, బలిఘట్టం లక్ష్మీదేవి, కనకదుర్గమ్మ ఆలయాలు, పెదబొడ్డేపల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు టెంట్లు, తాగునీరు సౌకర్యం కల్పించారు.

ఐరన్ మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలి

మాకవరపాలెం:
జిల్లాలో ఎంఆర్ వ్యాక్సిన్ 64 శాతం పూర్తయిందని డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలల్లో ప్రతి గురువారం భోజనం అనంతరం ఐరన్ మాత్రలు అందిస్తున్నారా? లేదానే విషయంపై ఆరా తీశారు. మూగ, చెవిటి పిల్లలకు కేజీహెచ్‌లో పిల్లల వార్డుల పక్కనే ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఆస్పత్రిలో బీపీ పరికరాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంహెచ్‌వోలు రామచంద్రరావు, గోవింద్ పాల్గొన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణ స్థలాల పరిశీలన

నర్సీపట్నం రూరల్:
మండలంలోని కేఎల్.పురం, దర్మసాగరం గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ల నిర్మాణాలకు కేటాయించిన స్థలాలను ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈమేరకు ఎంపీపీ సుకల రమణమ్మ, తహసీల్దార్ వీవీరమణ, ఎంపీడీవో రమణబాబు ఆయా గ్రామాలలో నెలకొల్పనున్న ఘనవ్యర్థాల నిర్వహణ పార్కులకు కేటాయించిన స్థలాలను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


బీమా సొమ్మును పంపిణీ చేస్తున్న దృశ్యం

మాకవరపాలెం: ప్రభుత్వం మంజూరుచేసే సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉదయశ్రీ అన్నారు. శుక్రవారం వజ్రగడ గ్రామంలో మన ఊరు-మన విశాఖ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్‌డిపోలను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో డీటీ ప్రసాదరావు, ఏవో హేమ, తదితరులు పాల్గొన్నారు.

అవంతి విద్యార్థుల స్వచ్ఛభారత్



మాకవరపాలెం:
నెలలో పదిరోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోని స్వచ్ఛభాత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అవంతి కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మోహన్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి భవనం చుట్టూ ఉన్న చెత్త కుప్పలను పూర్తిస్థాయిలో తొలగించారు. ఆస్పత్రి గదులను శుభ్రం చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లకు సత్కారం


గబ్బాడ పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

నర్సీపట్నం:
మండలంలోని గబ్బాడ జడ్పీ హైస్కూల్‌లో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు దాసరి నాగేశ్వరరావు, ఎస్.వి.ఆర్.చలపతి, పి.అప్పలరాజు, ఎం.రాఘవకుమారి, ఎల్.శైలజ, టి.రామ్మూర్తిలను హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.ఆనంద్‌రావు శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

నర్సీపట్నం టౌన్: ఈనెల 12న పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఐదురోడ్ల జంక్షన్‌లోని జడ్పీ హైస్కూల్ (మెయిన్)లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డీజీ నాథ్, మండల అధ్యక్షుడు ఎ.వరహాలనాయుడు, కార్యదర్శి జీవీ రమేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా షేక్ గౌష్


షేక్ గౌష్‌కి నియామక పత్రాన్ని అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు గంగబాబు

నర్సీపట్నం టౌన్:
భారతీయజనతా యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా స్థానిక బీసీకాలనీకి చెందిన షేక్‌గౌష్‌ను నియమించామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నగిశెట్టి గంగబాబు తెలిపారు. శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా గౌష్ మాట్లాడుతూ తన సేవలు గుర్తించి ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఎస్.హరికృష్ణ పాల్గొన్నారు.

ధర్మసాగరంలో ఎంఆర్ వ్యాక్సిన్ పంపిణీ

నర్సీపట్నం రూరల్:
మండలంలోని ధర్మసాగరం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఎంఆర్‌వ్యాక్సిన్ టీకాలను ఎంపీపీ సుకల రమణమ్మ సమక్షంలో వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్నారి ఈ టీకా వేసుకోవడం వలన తట్టు, పొంగు వంటి ప్రమాదకర వ్యాదుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు త్రినాథ్, బాలాజీ పాల్గొన్నారు.

పాస్‌పుస్తకాలు వేగవంతం చేయాలి

మాకవరపాలెం:
ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసిన పట్టాదారు పాస్ పుస్తకాలు పెండింగ్ ఉంచరాదని తహసీల్దార్ కె.రమామణి వీఆర్‌వోలను ఆదేశించారు. శుక్రవారం ఆమె వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాస్‌పుస్తకాల కోసం రైతులకు కార్యాలయం చుట్టూ తిప్పరాదన్నారు. అడంగల్, తప్పొప్పులు సరిదిద్దుట, పాస్‌పుస్తకాలలో పేర్పు మార్పిడి వంటి దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు. కార్యక్రమంలో డీటీ ప్రసాదరావు, ఆర్ఐ రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం

నర్సీపట్నం రూరల్:
మండలంలోని వేములపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద వేషధారణతో విద్యార్థి వివేకానందుని సూక్తులు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎ.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
పాయకరావుపేట
4
విశాఖపట్నం । శనివారం, 12 ఆగస్టు 2017
పాయకరావుపేట । నక్కపల్లి । కోటవురట్ల । ఎస్.రాయవరం

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	:	08854 254044
ఎంపీడీవో కార్యాలయం	:	9441953611
తహసీల్దార్ కార్యాలయం	:	9441836336
వెలుగు ఏపీఎం	:	9866074067

సినిమా గైడ్

గౌతమ్ : లై
సూర్యమహల్ : జయ జానకి నాయక
సాయిమహల్ : నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మి (ఏసీ) : ఫిదా

క్షణ క్షణం..భయం భయం

- ఉద్దండపురం ఉన్నత పాఠశాలలో ప్రమాదకర పరిస్థితులు
- ఒకవైపు ట్రాన్స్‌ఫార్మర్, మరోవైపు శిథిలావస్థలో ఉన్న రక్షిత మంచినీటి పథకం
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి
- భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- స్పందించని పాలకులు, అధికారులు


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకు

నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్, మరోవైపు శిథిలావస్థలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకుతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియడం లేదు. వీటికితోడు ఈ పాఠశాల మీదుగా విద్యుత్ తీగలు చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో 150 విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల ప్రహరీ లోపల ఉన్న స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి దానికి సంబంధించిన ఫీజులు, ఇతర పరికరాలను కిందనే ఏర్పాటు చేశారు. ఇవి విద్యార్థులకు చేతికందే ఎత్తులో ఉన్నాయి. హైటెన్షన్ విద్యుత్ తీగలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పిల్లలు ఉండే చోట ఏర్పాటు చేశారు. దీన్ని నుంచి ఒక్కోసారి నిప్పులు పడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని పాఠశాల హెచ్‌ఎం కోడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యుత్ శాఖాధికారులను సంప్రదించగా వాటిని తొలగించి వేరేచోట వేయడానికి రూ.90 వేలు ఖర్చవుతుందని తెలిపారు.ఆ మొత్తాన్ని తమను భరించమని చెప్పారని ఆవేదన వెలిబుచ్చారు. చాలా మంది ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం ఉన్న చోట నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతు న్నారు. దీనికితోడు పాఠశాల ఆవరణలో రక్షిత మంచినీటి ట్యాంకు ఒకటి శిథిలావస్థకు చేరుకుంది. ఇది ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. నిరంతరం ఈ ట్యాంకు నుంచి నీరు లీకవుతోంది. పిల్లలు ఆటలాడుకునే చోట ట్యాంకు శ్లాబ్‌నుంచి అప్పుడప్పుడు పెచ్చులూడిపడుతున్నాయి. గట్టిగా వర్షాలు పడితే ట్యాంకు కూలి పోయే ప్రమాదం కూడా ఉంది. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



పాఠశాలలో అనుక్షణం భయం భయంగా ఉంది. హై టెన్షన్ విద్యుత్ లైన్లు పాఠశాల మీదుగా ఏర్పాటు చేశారు. దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్ కూడా చాలా కిందకు ఉంది. మరోవైపు వాటర్ ట్యాంకు కూలిపోయే స్థితికి చేరింది. ఈ రెండింటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనతో ఉన్నాం. ఏపీఈపీడీసీఎల్ అధికారులు చెప్పిన మాట వాస్తవమే. ఇటీవల ఈ విషయమై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశాం.
కోడి శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం



పాఠశాలకు ఐరన్ బెంచీలు వితరణ

నక్కపల్లి : అమెరికాలోని న్యూజెర్సీలో వుంటున్న అన్నా, చెల్లెళ్ల నోరి మైథిలీ, నోరి జగన్మోహన్‌మూర్తి ఉద్దండపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఫర్నిచర్ కోసం రూ.1.5లక్షలు విరాళం అందజేశారు. ఈ మొత్తంతో హెచ్‌ఎం కోడి శ్రీనివాసరావు పిల్లలకు అవసరమైన ఫర్నిచర్ తయారుచేయించి శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మైథిలీ, ఆమె సోదరుడు జగన్మోహన్‌మూర్తి పాఠశాలకు మైక్‌సెట్, లేజర్ ప్రింట్, ఫర్నిచర్ కోసం రూ.1.5 లక్షలు ఇచ్చారని చెప్పారు. వాటిలో కొంత మొత్తంతో బెంచీలు తయారు చేయించామన్నారు.

పలు వాహనాలు సీజ్

నక్కపల్లి : మండలంలోని జాతీయ రహదారి పరిధిలో ఉన్న పలు జంక్షన్లలో నర్సీపట్నం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ శుక్రవారం పలు వాహనాలను తనిఖీ చేసి, కేసులు నమోదు చేశారు. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న ఐదు బైకులు, ఒక ఆటోను సీజ్ చేశారు. అలాగే స్థానిక సారిపల్లిపాలెం హైవే జంక్షన్ వద్ద అనుమతి లేకుండా తాటి దుంగలు తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైకులు నడిపేవారు మద్యం సేవించినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా, హెల్మెట్లుధరించకపోయినా చర్యలు తప్పవన్నారు.

పేదలకు అండగా చంద్రన్న బీమా


బాధిత కుటుంబాలకు బీమా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిత

నక్కపల్లి : చంద్రన్న బీమా పథకం పేదలకు వరమని, కష్టకాలంలో వున్న బాధిత కుటుంబాలను ఆదుకోవడమే దీని ముఖ్యుద్దేశమని ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో 17మంది బాధిత కుటుంబాలకు చంద్రన్న బీమా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రన్న బీమా కింద ప్రమాదంలో మరణించిన వారికి రూ.5 లక్షలు,సాధారణ మరణానికి రూ.30 వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కుటుంబ పెద్ద మరణిస్తే వారిపై ఆధారపడిన పిల్లలు రోడ్డున పడకుండా చంద్రన్నబీమా అండగా నిలుస్తోందన్నారు. దీని గురించి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై వుందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శివప్రసాద్, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రాగిని వెంకటరమణ, ఎంపీపీ లావణ్య, మండల పరిషత్ చీఫ్ అడ్వయిజర్ కొల్లేపల్లి బాబ్జీరాజు, వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, సర్పంచులు దేవర సత్యనారాయణ, కురందాసు నూకరాజు, వెలగా శ్రీను, టీడీపీ నాయకులు హరిబాబు, దేవవరపు శివ, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దు

- బాధ్యతగా పని చేయండి
- నాలుగు మండలాల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


అధికారులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే అనిత

నక్కపల్లి : నియోజకవర్గంలో వచ్చే రెండేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు జరగనున్నాయని, అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే వంగలపూడి అనిత తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె నాలుగు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా రహదారుల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలు, ఇతర అభివృద్ధి పనుల గురించి మండల ఇంజనీర్ భాస్కర్ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని కోటవురట్ల, నక్కపల్లి, ఎస్. రాయవరం, పాయకరావుపేట మండలాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండల పరిషత్ అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. వచ్చే ఏడాదిలో ఉద్దండపురం వద్ద నిర్మించనున్న మెగా ఫైలట్ ప్రాజెక్ట్ పూర్తయితే మంచినీటి సమస్య వుండదన్నారు. అధికారులు విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నాలుగు మండలాల అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ పూజలు


ఉపమాకలో దుర్గాభవానీని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాలు శుక్రవారం భక్తులతో కళకళలాడాయి. నక్కపల్లి వారపు సంత వద్ద వున్న దుర్గాదేవి ఆలయం, ఉపమాక దుర్గాభవానీ ఆలయాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రద్దీ కనిపించింది. అమ్మవారికి మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఉపమాక ఆలయంలో అర్చకుడు వెలవలపల్లి మహేష్ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టివెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అలాగే కాగిత, న్యాయంపూడి, బంగారమ్మపేట, గొడిచెర్ల, వేంపాడు, చందనాడ, ఎన్.నర్సాపురం,అమాపురం, పాటిమీద, గునిపూడి, నెల్లిపూడి గ్రామాల్లోని ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

అడ్డురోడ్డులో...


అడ్డురోడ్డులోని దుర్గాదేవి ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఎస్.రాయవరం (నక్కపల్లి) : ఎస్. రాయవరంలోని పలు గ్రామాల్లో శ్రావణమాసం మూడో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అడ్డురోడ్డులో ప్రసిద్ధి చెందిన దుర్గాదేవి ఆలయం వద్ద భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈ మండలంలోని లింగరాజుపాలెం, ఎస్.రాయవరం, ధర్మవరం, పెనుగొల్లు,గోకులపాడు, తిమ్మాపురం, కొరుప్రోలు, గుడివాడ, దార్లపూడి , పెదగుమ్ములూరు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు కూడా భక్తులతో కళకళలాడాయి.

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

చోడవరం: అల్పపీడన ప్రభావంతో ఈనెల 13 నుంచి 15 వరకూ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు మండల కేంద్రాల్లోనే ఉండి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
4
ఎలమంచిలి
విశాఖపట్నం। శనివారం, 12 ఆగస్టు 2017
ఎలమంచిలి। అచ్యుతాపురం। మునగపాక। రాంబిల్లి

సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ - దండుపాళ్యం-2
తులసీ చిత్రమందిర్ - నిన్నుకోరి
పరమేశ్వరి - పటేల్...సార్

- కనీస సౌకర్యాలకు నోచుకోని మోసయ్యపేట ప్రాథమిక పాఠశాల
- వసతి లేమితో తీవ్ర ఇబ్బందులు
- ఐదు తరగతులకు రెండే గదులు
- ఒకే గదిలో రెండు క్లాసుల చొప్పున బోధన
- 1,2, తరగతులకు వరండాలో పాఠాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


కూల్చి వేసిన శిథిల భవనం

పేరుకే ఆదర్శం..
అభివృద్ధిలో నిర్లక్ష్యం

ఆదర్శ పాఠశాల చేస్తామన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పడగొట్టారు. అక్కడ నూతన భవనంతో పాటు పిల్లలకు కార్పొరేట్ స్కూళ్ల తరహాలో డిజిటల్ తరగతులు బోధిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికి మూడు నెలలు కావస్తున్నా.. నూతన భవనం మాట అటుంచితే కనీసం పడగొట్టిన భవనం శిథిలాలు కూడా తొలగించలేదు. ఇదీ... మండలంలోని మోసయ్యపేట ప్రాథమిక పాఠశాల దుస్థితి.


వరండాలో 1, 2 తరగతుల బోధన


ఒకే గదిలో 4, 5 తరగతులు

అచ్యుతాపురం రూరల్ : మోసయ్యపేట ప్రాథమిక పాఠశాలను ప్రభుత్వం ఆదర్శ పాఠశాలగా ఎంపిక చేసింది. ఇక్కడ 1 నుంచి 5వ తరగతి వరకు 67 మంది విద్యార్థులు చదువుతున్నారు. పేరుకు ఆదర్శ పాఠశాలే కానీ కనీస సౌకర్యాలు లేవు. ముఖ్యంగా వసతి లేమితో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం రెండు గదుల్లో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. 1, 2 తరగతులు వరండాలోనూ, మిగిలిన వాటిని రెండు గదుల్లోనూ బోధిస్తున్నారు. డిజిటల్ క్లాస్ రూముల నిర్వహించేదుకు కంప్యూటర్లు,ప్రొజెక్టర్లు ఉన్నప్పటికీ సరైన వసతులు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మూడు నెలల క్రితం ఇక్కడ నూతన భవన నిర్మాణా నికి తలపెట్టిన పాఠశాల అభివృద్ధి కమిటీ పాత భవనాన్ని పడగొట్టింది. నూతన భవనం మాట అటుంచితే కనీసం తొలగించిన భవనం శిథిలాలు కూడా తొలగించలేదు. దీంతో శిథిలాల కింద పాములు, విష పురుగులు కనిపిస్తుండడంతో విద్యార్థులు భయాందళనకు గురవుతున్నారు. శిథిల భవనాన్ని పడగొట్టే క్రమంలో పక్క నున్న భవనాలు కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయి. మోటారు కనెక్షన్, పైపులైన్లు ధ్వంసమయ్యాయి. వీటికితోడు పాఠశాలకు కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకోడానికి స్థలం లేకపోవడంతో ఎక్కడ జరపాలో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి శిథిల భవనం డబ్రిస్ తొలగిస్తే జెండా వందనానికి స్థలం ఉంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు. తక్షణమే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎంపీపీకి సమస్య వివరించాం



పాఠశాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో శిథిల భవనాన్ని తొలగించాం. ఆ స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని ఎంపీపీ, అధికారులను కలిసి విన్నవించాం. త్వరలోనే నూతన భవనం నిర్మిస్తాం. ఇప్పటికే ప్రభుత్వం వంట శాల, అదనపు భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పాఠశాల అభివృద్ధి కమిటీ నిధులు లేకపోవడం వల్ల విద్యార్థులకు కనీస అవసరాలు తీరడం లేదు.

ముచ్చు సరోజని, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్

త్వరలోనే పరిష్కారం



పాఠశాలలో పడగొట్టిన భవనం శకలాలను తొలగించాలని ప్రజా ప్రతినిధులకు తెలియజేశాం. వారు సానుకూలంగా స్పందించారు. మోసయ్యపేటతో పాటు పెదపాడు, కొండకర్ల, కడపాలెం, జాలారిపాలెం, కడపాలెంలో కూడా ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు పలు పాఠశాలలకు మరో 20 వరకూ అదనపు భవనాలు అవసరం. ఎమ్మెల్యే రమేష్‌బాబు పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆయనకు నివేదిక ఇచ్చాం.

దేవ రాయల్, ఎంఈఓ

కళావేదిక నిర్మాణానికి స్థల పరిశీలన

అచ్యుతాపురం : మండల కార్యాలయ సముదాయం వద్ద కళావేదిక నిర్మించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు.10 లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించ తలపెట్టిన కళావేదిక భవనాన్ని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించడానికి నిర్ణయించారు. ఈ మేరకు కొలతలు వేసి స్థలాన్ని ఖరారు చేశారు. త్వరలో ఇక్కడ కళావేదిక నిర్మాణం ప్రారంభంకానుంది. కళావేదిక నిర్మాణం జరిగితే మండల పరిధిలో అవసరమైన సభలు, సమావేశాలు చేసుకోడానికి సులువుగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు.స్థలాన్ని పరిశీలించిన వారిలో ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, జెడ్‌పిటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, ఎంపీడీఓ బలరాం, తదితరులు ఉన్నారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం

ఎలమంచిలి రూరల్ : రైతులు సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకరమైన పంటలు పండించవ చ్చునని ఆత్మ చైర్మన్ కొలుకులూరి విజయబాబు అన్నారు. శుక్రవారం ఆయన పోతిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయంలో వాడే వివిధ రకాల కషాయాల విక్రయించేందుకు ఏర్పాటు చేసిన ఎన్‌పీఎం షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో రైతులు వ్యవసాయం చేయడం వల్ల అధిక దిగుబడి రావడమే కాకుండా పంటలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. అనంతరం కొత్తలిలో వ్యవసాయాధికారులు నిర్వహించిన చంద్రన్న రైతు క్షేత్రం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులకు జింక్ సల్ఫేట్ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మాలకొండయ్య, సర్పంచులు విత్తంశెట్టి నాయుడు, రుత్తల శ్రీనివాసరావు, ఏఈఓ దేముడు, తదితరులు పాల్గొన్నారు.


రైతులకు జింక్ బ్యాగులు అందజేస్తున్న విజయబాబు


రైతులకు జింకు సల్ఫేట్ ప్యాకెట్ అందజేస్తున్న ఏడీ

'చంద్రన్న రైతు క్షేత్రం'పై అవగాహన

రాంబిల్లి : పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీ ఆర్.గాయత్రి అన్నారు.శుక్రవారం ఆమె పంచదార్ల, దిమిలి గ్రామాల్లోని రైతులకు చంద్రన్న రైతు క్షేత్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దిమిలి,పంచదార్ల, కృష్ణంపాలెం గ్రామాల్లో చంద్రన్న రైతు క్షేత్రాలు ఏర్పాటు చేశామని, ఈ మేరకు రైతులను ఎంపిక చేసి వారివరి సాగులో పాటించవలసిన యాజమాన్య పద్ధ తుల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. చంద్రన్న రైతు క్షేత్రాలు ఆదర్శవంతంగా ఉండేలా రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ముఖ్యంగా ఉడుపుల సమయంలో ప్రతిరైతు ప్రధాన పొలంలో కాలిబాటలు వేసుకోవాలని సూచించారు. అలాగే అధికారులు సూచనల మేరకు పంటలు సాగు చేయడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. అనంతరం రైతులకు కందులు, జింక్ రాయితీపై అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు వెంకటరమణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

ఎలమంచిలి :ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ఆదుకొనేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని టీడీపీ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కొత్తయర్రవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూలు బ్యాగులు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని, వారిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు బ్యాగులు, బూట్లు వితరణగా అందజేసిన కె. సన్యాసిరావు, వంశీకృష్ణ, ఎన్. సత్యనారాయణ,సునీత దంపతులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి, ఉమా, జాజుల రమణ, ఎస్ఎంసీ చైర్మన్ జె. కళావతి, పిట్టా సురేష్, నడిగట్ల డాన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'శ్రావణ' పూజలు

ఎలమంచిలి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము 5 గంటల నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం వరకు ఆలయాల్లో సందడి తగ్గలేదు. క్రిష్ణాపురంలోని లక్ష్మీదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని పది రూపాయల నోట్లతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొలగాని నాగేశ్వరరావు, కార్యదర్శి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోండి

మునగపాక : సమగ్ర సాగునీటి యాజమాన్యం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీదేవి తెలిపారు. మండలంలోని చూచుకొండలో ప్రధాన మంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై) పథకంపై ఆత్మా సౌజన్యంతో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. బిందు సేద్యం, తుంపర సేద్యం వల్ల ద్వారా మొక్కకు కావాల్సినంత నీటిని అందించడంతో పాటు భూమి ద్వారా సంక్రమించే వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. అనంతరం నారుమడి, పీడపీడలు పంటలకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చిరంజీవి, నీటి పారుదల శాఖ ఎంఐఓ రంజిత, పీఏసీఎస్ అధ్యక్షుడు సూరి అప్పారావు, ఆత్మ ఏపీఎం మణికంఠేశ్వరి, ఏఈవో లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'అంతా భ్రాంతియేనా' రేపు

అనకాపల్లి టౌన్:స్థానిక గవరపాలెం మళ్ల జగన్నాధం హాలులో అంతా భ్రాంతియేనా అనే హాస్య నాటికను నిర్వహిస్తున్నట్టు లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు బుద్ద సత్యనారాయణ తెలిపారు. సాయంత్రం ఆరున్నర గంటలకు పెందుర్తి నటరాజా డ్రమెటిక్ అసోషియేషన్ కళాకారులు ఈనాటికను ప్రదర్శించనున్నారన్నారని ఆయన తెలిపారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- నిన్నుకోరి
శ్రీసత్య - లై
రాజా - జయ జానకి నాయక
షిర్డీసాయి - లై
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : నేనే రాజు నేనే మంత్రి
శ్రీసత్యనారాయణ : జయ జానకి నాయక

కిటకిటలాడిన ఆలయాలు

శ్రావణ శుక్రవారం

సందర్భంగా ప్రత్యేక పూజలు

అన్న సమారాధనలు


ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత


అలంకరణలో కన్యకాపరమేశ్వరి


కోటి కుంకుమార్చన పూజలు చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్:శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. సంతోషిమాత ఆలయం భక్తులతో కళకళలాడింది. కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ భక్తజన సేవా కమిటీ సభ్యుడు దాడి వాసు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్యాణగిరిపై శ్రావణం పూజలు

కొత్తూరు: మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో కల్యాణగిరిపై ఉన్న దుర్గాదేవీ ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం పూజలను ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కోటి కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఆలయ నిర్వహాకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వెంకట సత్యనారాయణ(సత్తిబాబు),దుడ్డు శ్రీనివాసరావు, లక్కరాజు అప్పారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రావణ లక్ష్మికి ప్రత్యేక పూజలు

నెహ్రూచౌక్:స్థానిక విజయరామరాజుపేటలోగల శ్రీకృష్ణ మందిరంలో మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా పసుపు కొమ్ములతో పూజా కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు శేషస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రావణ లక్ష్మిని దర్శించుకున్న మహిళలతో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

చిన్న హైస్కూల్‌లో సిల్వర్ జూబ్లీ వేడుక రేపు

నెహ్రూచౌక్: స్థానిక గవరపాలెంలోగల జీవీఎంసీ హైస్కూల్(చిన్న హైస్కూల్)లో ఈనెల 13న బ్యాచ్ సిల్వర్ జూబ్లీ వేడుకను నిర్వహిస్తున్నట్టు పాఠశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురువులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

కాలుష్య కోరల నుంచి కాపాడాలి

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నియోజకవర్గ ప్రజలను కాలుష్య కోరల నుంచి కాపాడాలని సీపీఎం అనకాపల్లి డివిజన్ కమిటీ కన్వీనర్ ఎ.బాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గ పరిధిలో నల్లరాయి క్వారీలు, క్రషర్లు అక్రమంగా అనుమతులు లేకుండా నడుస్తున్నాయని అన్నారు. వాటి నుంచి వెదజల్లే ధూళి దుమ్ము ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. దీనివల్ల క్వారీల్లో పనిచేసే కార్మికులు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. రెవెన్యూ, గనుల శాఖ అధికారులకు పలు దఫాలు విన్నవించినా స్పందన లేదన్నారు.

దళిత వాడల అభివృద్ధి శూన్యం

కశింకోట రూరల్: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితవాడలు అభివృద్ధి జరగలేదని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బోని గణేష్ అన్నారు. వైసీపీ మండల కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13న 200 మంది దళితులతో వైసీపీలో చేరనున్నామన్నారు. పీటర్ వైజ్‌మెన్, కంటిపల్లి దేముడు,నత్తల ప్రసాద్, మైలపల్లి పోతురాజు, మైలపల్లి అప్పలనర్సయ్య, పండ్రాన శేషుబాబు, కొత్తాడ విశ్వనాధం, బి.నర్సింగరావు పాల్గొన్నారు.

డిఫెన్స్ కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ

జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ సిరి



అనకాపల్లి రూరల్: డిఫెన్స్ కోర్సులైన నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లతో యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.సిరి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన ఆమె విలేకరులతో మాట్లాడారు. డిఫెన్స్‌లో చేరాలనుకునే యువకులకు సెలక్షన్స్ వెళ్లే ముందే శిక్షణ పొందితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని విశాఖపట్నం, అనకాపల్లి, నర్సీపట్నంలలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ పొందగోరువారు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని శనివారం విశాఖపట్నం ఉడా చిల్డ్రన్స్ థియేటర్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల్లో జిల్లాలో యువజన సంఘాలు పాల్గొంటాయన్నారు. ఉత్సవాల్లో పాల్గొన్నవారికి పలు అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈనెల 29వ తేదీన అనకాపల్లిలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

జాతీయ గీతాల బృందగాన పోటీలు

అనకాపల్లి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీస్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు శుక్రవారం జాతీయ గీతాల బృందగాన పోటీలను నిర్వహించారు. వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు హాలులో జరిగిన ఈ పోటీల్లో గురజాడ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. వీరికి ట్రస్ట్ చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి, కార్యదర్శి కేవీ సత్యవతి బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ కె.జనార్ధన్, డైరెక్టర్ ఎం.యశోదకుమారి, పీవీసీ శేఖర్‌రావు పాల్గొన్నారు. .

అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించండి

అనకాపల్లి రూరల్:తమ గ్రామంలో పూర్తిచేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని భట్లపూడి సర్పంచ్ నొట్ల జ్యోతి కోరారు. ఈమేరకు పంచాయతీరాజ్ డీఈ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ నొట్ల శేఖర్, దొడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అయినవిల్లి గణపతి పూజకు టిక్కెట్లు అమ్మకం

అనకాపల్లి టౌన్: వినాయకచవితిని పురస్కరించుకొని తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి పూజా టిక్కెట్లు తపాలాశాఖ కార్యాలయాల్లో పొందవచ్చని అనకాపల్లి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కేఎల్ నాయుడు అన్నారు. టిక్కెట్ ధర 30 రూపాయలు మాత్రమే అన్నారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆర్.గౌరీశంకర్, పోస్టుమాస్టర్ టి.అమ్మిరాజు,వ్యాపార నిర్వాహకులు గట్టి బ్రహ్మాజీ, జి.వెంకటేశ్వరరావు, జె.వేణు, మురళీ పాల్గొన్నారు.

చదరంగం పోటీల విజేత చంద్రిక

అనకాపల్లి టౌన్:విశాఖ రామనగర్‌లో జరిగిన 47వ రాష్ట్ర స్థాయి జూనియర్ ఓపెన్ గర్ల్స్ చెస్ ఛాంపియన్ పోటీల్లో స్థానిక నవోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థిని కొడమంచిలి చంద్రిక విజయం సాధించారని స్కూల్ ప్రిన్సిపల్ కొయిలాడ శివాజీ తెలిపారు. ఐదవ తరగతి చదువుతున్న చంద్రిక ఈ పోటీల్లో పాల్గొని ఏడురౌండ్లలో మూడుపాయింట్లు సాధించి ప్రశంసాపత్రంతోపాటు మెమొంటోను సాధించుకుందన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శరగడం నర్సింగరావు, ఉపాధ్యాయులు చంద్రికను అభినందించారు.

విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

నెహ్రూచౌక్: పాఠశాల స్థాయిలోని 15 ఏళ్లలోపు వయస్సు గల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని యూఎఫ్‌డబ్ల్యూసీ డాక్టర్ ఎంవీ రమణ అన్నారు. స్థానిక ఉడ్‌పేటలోగల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏఎఫ్ పి.లక్ష్మి, కె.జాహ్నవి, ఆశా వర్కర్లు కె.లక్ష్మి, పి.అరుణ, విజయ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కశింకోట గర్ల్స్ హైస్కూల్‌లో...

కశింకోట రూరల్: కశింకోట బాలికల హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ వేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజ్‌శేఖర్ ఆధ్వర్యంలో ఈ టీకాలు వేసే కార్యక్రమం జరిగింది. హెచ్ఎం గంగాధర్, ఉపాధ్యాయులు టీవీ వెంకటలక్ష్మి, శేషుకుమారి, కమల, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్టూరు పాఠశాలలో...

తుమ్మపాల: మండలంలోని మార్టూరు పాఠశాలలో తుమ్మపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేవీఎన్ఎల్ ప్రసాద్, ఏఎన్ఎం బేగం, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వశాంతి పబ్లిక్ స్కూల్‌లో...

అనకాపల్లి టౌన్:స్థానిక విశ్వశాంతి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది స్కూల్‌లోని 600 మంది విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ ఇంజక్షన్ చేశారు.మెడికల్ ఆఫీసర్ ఎం.వెంకటరమణ, పాఠశాల కరస్పాండెంట్ మళ్ల విజయ్‌కుమార్,పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది కేఎస్ రత్నం,ఎన్.అన్నమ్మ, పి.లక్ష్మి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం 850 మంది దరఖాస్తు

అనకాపల్లి రూరల్: సబ్సిడీ రుణాలు పొందేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. 2017-18 సంవత్సరానికిగాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్‌ల నుంచి సబ్సిడీ రుణాలు పొందేందుకు మండలం నుంచి సుమారు 850 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి మండల పరిషత్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు,మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఇంటర్వ్యూలను మండల సమన్వయాధికారిణి ఎ.సిరి, ఎంపీపీ కొణతాల వెంకటసావిత్రిలు పరిశీలించారు.ఎంపీడీవో పీవీ రమణ, వైస్ ఎంపీపీ గొర్లి అప్పలరాజు, ఈవోపీఆర్‌డీ జి.అప్పలరాజు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

14,15 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

అనకాపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈనెల 14,15 తేదీల్లో అనకాపల్లిలో ఘనంగా నిర్వహించనున్నట్టు హరే కృష్ణ సత్సంగ మందిర అధ్యక్షుడు దర్లభ కృష్ణ ప్రేమదాస్, కోఆర్డినేటర్ లావణ్య రంగదేవి దాసి తెలిపారు. 14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఉట్ల సంబరం, పల్లకీ సేవ,శ్రీకృష్ణ ప్రవచనాలు,ఊంజల్ సేవ, 15వ తేదీన ఉదయం ఏడున్నర గంటలకు మహాదర్శన హారతి, ప్రభుదాస్‌చే పూజ,భాగవత ప్రవచనం,పల్లకీ సేవ, హారతి కృష్ణకథ ప్రవచనం, రాధాగాంధారిచే అభిషేకం జరుగుతాయని తెలిపారు.

నేడు డైట్‌లో గ్రాడ్యుయేషన్ డే

అనకాపల్లి టౌన్:స్థానిక డైట్ ఇంజినీరింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే-2017 వేడుకలు జరగనున్నాయి. సెమినార్ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వేణుగోపాలరావు తెలిపారు.

కన్నూరుపాలెంలో వ్యాసరచన పోటీలు

కశింకోట రూరల్: మండలంలోని కన్నూరుపాలెం విజ్ఞాన్‌విహార్‌లో శుక్రవారం గాంధీజీ స్ఫూర్తి అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో ఇన్‌ల్యాండ్ కవర్లపై ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ టి.రవికుమార్ మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించిన పోటీల్లో పాల్గొని రాసిన విద్యార్థుల ఇన్‌ల్యాండ్ కవర్లను హైదరాబాద్ సర్కిల్ ఆఫీస్‌కు పంపుతామన్నారు. అక్కడ రాష్ట్రస్థాయిలో విజేతలను ప్రకటిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి విజేతల వివరాలు ఢిల్లీ పంపుతామన్నారు.

గిరి విద్యార్థులకు కాన్వెంట్ విద్య

- ఇప్పటికే 2,500 మంది అభ్యాసం
- అదనంగా రెండు వేల సీట్ల మంజూరు
- మరింత చేరువ కానున్న కార్పొరేట్ బోధన
- తల్లిదండ్రుల కలలకు సాకారం



కార్పొరేట్ పాఠశాలలో సీట్ల కోసం డీడీ కార్యాలయానికి వచ్చిన తల్లిదండ్రులు

పాడేరు: గిరిజన విద్యార్థులకు కాన్వెంట్ విద్య చేరువవుతోంది. ఆంగ్ల మాధ్యమ తరగతులకు మరింత మందికి అవకాశం లభిస్తుంది. ఇప్పటికే 2,500 మంది గిరి చిన్నారులు కార్పొరేట్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తుండగా, ఈ సంఖ్య రెట్టింపు కానున్నది. తత్ఫలితంగా గిరి విద్యార్థుల కల నెరవేరుతుంది. ప్రభుత్వం ఈ ఏడాది అదనంగా రెండు వేల సీట్లను మంజూరు చేయడమే ఇందుకు కారణం.

మన్యంలో ప్రతి విద్యా సంవత్సరంలో 3, 5, 8 తరగతులకు చెందిన గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ సీట్లను కేటాయించి, ఆయా తరగతుల్లో వారిని ఏజెన్సీలో ఉన్న ప్రైవేటు కాన్వెంట్‌లో చేర్పిస్తారు. ఆయా విద్యార్థులు పదో తరగతి చదివే వరకు అయ్యే ఖర్చును గిరిజన సంక్షేమ శాఖ భరిస్తుంది. ఈ లెక్కన ఈ విద్యా సంవత్సరంలో మూడో తరగతిలో 1380, ఐదో తరగతిలో 1044, ఎనిమిదో తరగతిలో 150 సీట్లు కేటాయించారు. అందుకు సుమారు నాలుగు వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో అందరికీ సీట్లు దక్కని పరిస్థితి ఏర్పడింది.

మరో రెండు వేల సీట్లు మంజూరు

మన్యం గిరిజనుల్లో విద్యపై ఆసక్తి పెరుగుతున్నా, అందుకు తగ్గట్టుగా కాన్వెంట్ సీట్లు దక్కకపోవడంతో అవస్థలు పడుతున్నారు. దీంతో బెస్ట్ అవైలబుల్ సీట్లు పెంచాలని పలువురు ప్రజా ప్రతినిధులు, ఐటీడీఏ అధికారులు సైతం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు విన్నవించారు. వాస్తవ పరిస్థితిని గ్రహించిన ఉన్నతాధికారులు రెండు వేలు బెస్ట్ అవైలబుల్ సీట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మూడో తరగతికి వెయ్యి, 5, 8 తరగతులకు 500 చొప్పున తాజాగా సీట్లు కేటాయించారు. దీంతో గతంలో కాన్వెంట్ సీట్ల కోసం దరఖాస్తులు చేసిన విద్యార్థుల తల్లిదండ్రులకు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుల కార్యాలయం అధికారులు సమాచారం అందించి, వారికి సీట్లను కేటాయిస్తున్నారు. దీంతో ఆదివాసీ విద్యార్థులంతా కాన్వెంట్‌లో చదివించేందుకు అవకాశం లభిస్తుంది. ఫలితంగా కాన్వెంట్‌లలో తమ పిల్లలను చదివించాలన్న గిరిజన చిన్నారుల తల్లిదండ్రుల కల సాకారం కానుంది.

పశువైద్య శిబిరం నిర్వహించాలి

పాడేరు రూరల్: ఇరడాపల్లి పంచాయతీ పరిధిలోని సరియాపల్లి గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వంతాల సింహాచలం, వంతాల నానిబాబులు కోరారు. గ్రామంలో పశువులు పలు వ్యాధులతో బాధ పడుతున్నాయని చెప్పారు. ప్రధానంగా గాలికుంటు, జబ్బవాపు, నోటినుంచి చొంగ కారుస్తూ ఇబ్బందులు పడుతున్నాయన్నారు. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వేడుకున్నారు.

ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించరూ..

వైస్ ఎంపీపీ సన్యాసినాయుడు

జి.మాడుగుల: పాడేరు నుంచి గెమ్మెలి, సంగులోయ, గడుతూరు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని వైస్ ఎంపీపీ అంగనయిని సన్యాసినాయుడు కోరారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మండలంలోని పలు ప్రాంతాలకు నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రస్తుతం నిలుపుదల చేయడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అలాగే ప్రైవేటు వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆయా ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

చింతపల్లి డీఎస్పీ అనిల్



చింతపల్లి: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టేనని డీఎస్పీ పి.అనిల్ అన్నారు. చింతపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ సివిల్ సర్జన్ టి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం డీఎస్పీ, సీఐ చంద్రశేఖరరావు, వైద్యాధికారి రఘురామ్‌తో పాటు 20 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. 12 గ్రాముల హిమోగ్లోబిన్ కలిగిన వారు రక్తదానం చేయవచ్చునన్నారు. రోడ్డు ప్రమాదాల్లోనూ, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం జరిగిన వారికి అత్యవసర పరిస్థితిలో రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉందన్నారు. యువకులు, ఉద్యోగులు రక్తదానంపై అందరిలోనూ చైతన్యం తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సువర్ణ, ఎల్టీలు కిశోర్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సీలేరు: సీలేరు, ధారకొండ ఆలయాలు శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడాయి. సీలేరు మరెమ్మ అమ్మవారు, ధారకొండ ఘాట్ రోడ్డులోని ధారాలమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో రెండు ఆలయాలు కిక్కిరిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


ఉత్తమ ఉపాధ్యాయులను మర్చిపోలేరు: ఎమ్మెల్యే ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరి

చింతపల్లి: ఉత్తమ ఉపాధ్యాయులను విద్యార్థులు ఎప్పుడూ మర్చిపోరని పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం హెచ్‌ఎం గోవిందరావు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ప్రభావతి, సుభద్ర, బాలన్న, కుమారి, గంగాధరం, రామన్నలను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయులు గోవిందరావు గతంలో పనిచేసిన పాఠశాలల్లో అందించిన సేవలు, అభివృద్ధి చేసిన తీరును విద్యార్థులు అతని చెబుతుంటారన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారన్నారు. ఉపాధ్యాయులకు బదిలీ సాధారణమేనని, ఎక్కడ విధులు నిర్వహించినా అంకితభావం అవసరమని స్పష్టం చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పద్మకుమారి, పీఆర్‌టీయూ నాయకులు యూవీ గిరి, గెమ్మెలి మోహన్, సీనియర్ ఉపాధ్యాయులు కంకిపాటి వీరన్నపడాల్, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లోచల రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ సుస్థిరత సాధ్యం



పాడేరు ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు అందిస్తున్న బీజేపీ నేతలు

పాడేరు: భారతీయ జనతా పార్టీతోనే దేశ సుస్థిరత సాధ్యమని బీజేపీ అరకులోయ పార్లమెంట్ కన్వీనర్ కె.ఉమామహేశ్వరరావు అన్నారు. దేశ 13వ ఉప రాష్ట్రపతిగా ఎం.వెంకయ్యనాయుడు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగల సత్తా ఒక్క బీజేపీకి మాత్రమే ఉందన్నారు. అలాగే ఒక తెలుగు వ్యక్తికి ఉప రాష్ట్రపతి పదవిని కట్టబెట్టి, బీజేపీ తెలుగు ప్రజలకు ఇస్తున్న ప్రాధాన్యతను దేశానికి చాటి చెప్పిందన్నారు. వెంకయ్యనాయుడు సైతం ఉప రాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చే నాయకుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అరకు పార్లమెంట్ ప్రచార కార్యదర్శి పి.రవికుమార్, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు సల్లా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కాకర చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

సీఐ వెంకట విజయ్‌కుమార్



మొక్కలు నాటుతున్న సీఐ వెంకటవిజయ్‌కుమార్, తదితరులు

జి.మాడుగుల: పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యతను అందరూ తీసుకోవాలని సీఐ వెంకట విజయ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో సుమారు 70 మొక్కలను నాటారు. జామ, నేరెడు, బాదం, మామిడి, ఉసిరి, తదితర మొక్కలను కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు నాటారు. అనంతరం సీఐ మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే మొక్కలు నాటాల్సిందేనని, ఇందుకోసం యువత ముందుకు రావాలని సూచించారు. విద్యార్థులు మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో తల్లిదండ్రులను కూడా చైతన్యపరిచి మొక్కలు నాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు

సీలేరు: ధారకొండ 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు సరఫరా విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా పరిణమించాయి. పలు చోట్ల చెట్ల పొదులు అల్లుకున్నాయి. అయినప్పటికీ సంబంధిత సిబ్బంది పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ లైన్ అంతా అటవీ ప్రాంతంలోనే ఉండడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణ కష్టమవుతోంది. దీంతో ఏడాదిలో రెండు నెలలకొకసారైనా జంగిల్ క్లియరెన్సు చేయించాల్సి ఉంటుంది. ఏపీ ఈపీడీఎల్ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో సిబ్బంది నామమాత్రంగా జంగిల్ క్లియరెన్సు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో చింతపల్లి నుంచి ధారకొండ వరకూ విద్యుత్ సరఫరా అయ్యే లైన్‌లో ఎక్కడికక్కడ చెట్లు పొదులు విద్యుత్ స్తంభాలపై నుంచి పాకి వైర్లకు తగులుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధారకొండకు విద్యుత్ సరఫరా అయ్యే లైన్‌లో తక్షణమే జంగిల్ క్లియరెన్స్ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ
- ఎక్కడికక్కడ చెత్త.. మురుగునీరు
- మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ కరువు
- నేలపైనే చదువులు
- మూలకు చేరిన జనరేటర్
- కరెంట్ లేకుంటే గ్యాస్‌లైట్లే గతి
- ఇదీ కోనాం గురుకుల బాలికల కళాశాల దుస్థితి

గురుకులం చెంత సమస్యల చింత



మూలకు చేరిన జనరేటర్

కళాశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త

హాస్టల్‌లో గ్యాస్‌లైట్లు



చీడికాడ: మండలంలోని కోనాం సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల విద్యార్థినులు సమస్యలతో సతమతమవుతున్నారు. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కడికక్కడ చెత్త, మురుగునీరు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. ఈగలు, దోమలు విజృంభిస్తూ విద్యార్థినులకు రోగాలను పంచి పెడుతు న్నాయి. కళాశాల ఆవరణ తుప్పలతో నిండిపోయింది. జనరేటర్ రెండేళ్లుగా మూలకు చేరి తుప్పు పట్టిపోయింది. తరగతి గదుల్లో ఫర్నిచర్ లేకపోవడంతో విద్యార్థినులు నేలపైనే కూర్చుని చదువుకోవాల్సి వస్తోంది. మరుగు దొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక బాలికలు ఇబ్బంది పడుతున్నారు. కోనాం గురుకుల కళాశాల, హాస్టల్ వెనుక భాగం, మరుగుదొడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. చుట్టూ తుప్పలు బలిసిపోయాయి. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు తెలిపారు. పాఠశాలకు జనరేటర్ ఉన్నప్పటికీ రెండేళ్లుగా మరమ్మతుకు గురై పని చేయడం లేదు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతే తాగునీటికి, ఇతరత్రా అవసరాలకు నీరు లేక అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. వర్షాలు ఎక్కువైనా, గాలులు వీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని, దీంతో రాత్రివేళ గ్యాస్‌లైట్ సాయంతో వంటలు చేస్తున్నామని, భోజన గదిలో మరో ఐదు గ్యాస్‌లైట్లు ఉన్నాయని వంట పనివారు తెలిపారు. అవే లైట్లను విద్యార్థినులు నిద్రపోయే గదుల్లో ఉంచుతున్నారు. ఒక్కోసారి రాత్రంతా విద్యుత్ సరఫరా లేకపోతే బాలికలు దోమలతో సహవాసం చేయాల్సిందే. ఇక తరగతి గదుల్లో ఫర్నిచర్ లేకపోవడంతో నేలపైనే కూర్చుని చదువుకోవాల్సి వస్తోందని విద్యార్థినులంటున్నారు. ఇప్పటికైనా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలపై అధికారులకు నివేదిక



కళాశాలలో సమస్యలపై జిల్లా అధికారులకు నివేదిక పంపించాం. మూలకు చేరిన జనరేటర్, తరగతి గదుల్లో ఫర్నిచర్ తదితర సమస్యల గురించి విన్నవించాం. కళాశాల ఆవరణను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూనే ఉన్నాం. వంటకు, మంచినీటికి, స్నానాలకు అవసరమైన నీటిని ట్యాంకుల్లో ముందే నింపుతున్నాం. విద్యుత్ పోయినపుడు వాటిని వాడుతున్నాం.

ఎం.లక్ష్మీదేవి, ప్రిన్సిపాల్



రన్నింగ్ వాటర్ రాని మరుగుదొడ్లు



నిలిచిపోయిన వాడుక నీరు

గ్రామైక్య సంఘాలు ముందంజలో ఉండాలి

వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ ధర్మారావు



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

దేవరాపల్లి: మండలంలోని గ్రామైక్య సంఘాలు ఎ గ్రేడ్‌లో ఉండాలని పెందుర్తి వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ వి.ధర్మారావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు గూమ్మాల లావణ్య అధ్యక్షతన మండల మహిళ సమాఖ్యసర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2016-17 వార్షిక ప్రగతి నివేదికను ఏపీఎం బీడీ తిలక్ చదివి వినిపించారు. మండలంలో 1305 సంఘాలు ఉన్నాయని, రెండో విడత పెట్టుబడి నిధి కింద 1210 సంఘాలకు రూ.7.16 కోట్లు ఇచ్చామని అన్నారు. ఈ ఏడాది 47 గ్రామ సంఘాలలో 897 సంఘాలకు రూ.46లక్షలు వడ్డీలేని రుణాలు ఇచ్చామన్నారు. స్త్రీనిధి కింద 88 సంఘాలకు రూ.5.66 కోట్లు డిపాజిట్లు చేశామని, ఇందులో కోటి 33 లక్షలు రుణాలు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా చంద్రన్న బీమా, ఆమ్ ఆద్మీ, విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ తదితర అంశాల గురించి వివరించారు. డీఎంజీలు రాంబాబు, సూర్యనారాయణ, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాడుగుల రూరల్ : మండల కేంద్రం మాడుగులతోపాటు అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వడ్డాది ట్రాన్స్‌కో ఏడీఈ పి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చయ్యపేట మండలం రాజాం-వడ్డాది విద్యుత్ సరపరా లైన్‌లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదలకు న్యాయం చేయాలి : ఎంపీపీ

దేవరాపల్లి: రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతకు రుణాల మంజూరులో పేదవారికి న్యాయం చేయాలని స్కానింగ్, సెలక్షన్ కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జడ్పీటీసీ సభ్యురాలు గాలి వరలక్ష్మి అధ్యక్షతన రుణాల మంజూరు ఎంపిక కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ఈ ఎంపిక ప్రక్రియ మెరిట్ ఆధారంగా జరుగుతుందని అన్నారు. ప్రత్యేక అధికారి మహలక్ష్మి మాట్లాడుతూ, 2016, 2017, 2018 సంవతరాల్లో బీసీ కార్పొరేషన్‌కు 885, ఎస్సీ కార్పొరేషన్ 58, కాపు కార్పొరేషన్‌కు 85, మైనార్టీల నుంచి రెండు దరఖాస్తులు వచ్చాయన్నారు. పాత దరఖాస్తుదారులు ఆగస్టు నెలాఖరులోగా ఆన్‌లైన్ చేసుకోవాలని అన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ఎంపిక చేసి



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కరరావు

పేదవారిని గుర్తించి రుణ మంజూరుకు కమిటీ కృషి చేయాలని కోరారు. చిటిమిరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ, బ్యాంకు యాజమాన్యం తమకు అనుకూలంగా ఉన్నవారికి, ధనవంతులకే రుణాలు ఇస్తున్నాయని, నిజమైన లబ్ధిదారులకు అందవలసిన రాయితీని డబ్బున్న వారు పొందుతున్నారని అన్నారు. అర్హులైన పేదవారికి ఇవ్వడం లేదని అన్నారు. అర్హులైన పేదలను గుర్తించి వారికి రుణ సదుపాయం కల్పించడం ద్వారా ఆదుకోవాలని కోరారు. ఎంపీడీవో డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

550 మందికి వ్యాక్సినేషన్

మాడుగుల రూరల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కేజే పురం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం కేజే పురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. 550 మంది విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ వేశామని ఎంపీహెచ్‌వో రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జగన్నాథరావు, కోటేశ్వరరావు, ఏఎన్ఎం విమల పాల్గొన్నారు.

మాడుగులలో ఓ మోస్తరు వర్షం

మాడుగుల రూరల్ : మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల సమయానికి వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. నారుమడులకు, వ్యవసాయ పనులకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడతుందని రైతులు పేర్కొన్నారు. ఇదే విధంగా వర్షాలు పడితే మిగిలిన వరి, చెరకు నాట్లు పూర్తి చేసుకోవచ్చునని చెప్పారు.

నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ

కె.కోటపాడు : వరి పంటకు పొట్ట, పిలకల దశల్లో రైతులు నీరందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చోడవరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వరి పంటకు నీరందించడంతో పాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. చెరకు ఉడిచిన నెలరోజుల తర్వాత పూర్తి స్థాయిలో నీరందిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. జలవనరుల శాఖ ఏఈ జి.సత్యంనాయుడు మాట్లాడుతూ చెరువులు, ప్రాజెక్టుల నీటి సామర్థ్యం పెంపునకు చేపట్టాల్సిన చర్యలు, నీరు-చెట్టు పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సత్తిబాబు, ఏవో కేవీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
5
చోడవరం
విశాఖపట్నం। శుక్రవారం 11 ఆగస్టు 2017
చోడవరం । బుచ్చెయ్యపేట । రావికమతం । రోలుగుంట

రక్షిత పథకాలున్నా అరకొర సరఫరా

- దిష్టిబొమ్మల్లా వీధి కుళాయిలు
- అర్ధంతరంగా నిలిచిపోయిన కొత్త రక్షిత నీటి పథకం
- వెంకన్నపాలెంలో తాగునీటి సమస్య



నిరుపయోగంగా కుళాయి



మధ్యలో నిలిచిపోయిన రక్షిత నీటి పథకం

చోడవరం: మండలంలోని ప్రధాన మైన వెంకన్నపాలెం పంచాయతీలో ప్రజ లను తాగునీటి సమస్య పట్టి పీడిస్తోంది. 3వేల మంది జనాభా కలిగిన వెంకన్న పాలెంలో పేరుకు రెండు రక్షిత మంచి నీటి పథకాలు ఉన్నప్పటికీ అవి స్థానికుల తాగునీటి అవసరాలను ఏమాత్రమూ తీర్చలేకపోతున్నాయి. గ్రామంలో ఉన్న ఒక రక్షిత మంచినీటి పథకం సామర్థ్యం తక్కువకావడంతో తద్వారా ఒకటి రెండు వీధులకు మించి నీటిని సరఫరా చేసే అవకాశం లేకుండాపోయింది. మరో రక్షిత పథకం అంబేరుపురం, వెంకన్నపాలెం పంచాయతీలకు కలిపి ఉండడంతో అందులో సగం నీరుమాత్రమే వెంకన్న పాలెం వాసులకు అందుతోంది. ఇక రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన రక్షిత నీటి పథకం అర్ధంతరంగా నిలిచి పోయింది. పరిమితంగా బోర్లు ఉండడంతో నీటి సమస్య తీరడం లేదు. రక్షిత పథకాల నుంచి అరకొరగా నీరు వస్తుండడంతో చాలా వీధుల్లో కుళాయిలు దిష్టిబొమ్మలా మిగిలాయి.

అసంపూర్తిగా రక్షిత పథకం

వెంకన్నపాలెంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.15లక్షల వ్యయ ంతో షిరిడీసాయిబాబా ఆలయం వద్ద కొత్తగా రక్షిత మంచినీటి పథక నిర్మాణం చేపట్టారు. దీనికి అనుబంధంగా పైప్ లైన్లు వేశారు. అయితే పంచాయతీ పరిధిలో పూర్తిస్థాయిలో పైపులైన్లకు, పథకం నిర్వహణకు అవసర మైన విద్యుత్ కనెక్షన్లకు నిధులు చాలకపో వడంతో పథకం అర్ధంతరంగా నిలిచి పోయింది. పథ కం పూర్తికి నిధుల మంజూరుకు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు హామీ ఇచ్చినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ పథకం పూర్తయితే తమ తాగునీటి కష్టాలు తీరుతాయని స్థాని కులు ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ, పథకం పూర్తయ్యే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రక్షిత మంచినీటి పథకం పూర్తి చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

రుణాల కోసం ఇంటర్వ్యూలు

చోడవరం: మండలంలో ఎస్సీ, కాపు కులాల అభ్యర్థులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా కార్పొరేషన్ల అధికారులు, ఎంపీపీ గూనూరు కొండతల్లి, ఎండీవో చిట్టిరాజు, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. లబ్ధిదారుల ఎంపిక వివరాలను త్వరలో తెలియజేస్తామన్నారు.

1451 మందికి ఎంఆర్ వ్యాక్సినేషన్

రోలుగుంట : మండలంలోని బుచ్చెంపేట, రోలుగుంట ఆరోగ్యకేంద్రాల పరిధిలో 1451 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారులు గంజారి బాపిరాజు, పి.వి జయకుమారి తెలిపారు. బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రం పరిధి శరభవరం పాఠశాల, బుచ్చెంపేట, గంగవరం గ్రామాల్లో 429 మందికి, రోలుగుంట ఆరోగ్య కేంద్రం పరిధిలో పెదబొడ్డేపల్లి సెయింట్ మేరీ స్కూల్లో 1022 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం



చోడవరం: పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరాల యంలో శుక్రవారం లక్ష్మీగణపతి హోమం ఘనంగా నిర్వహించారు. బహుళ చవితిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ హోమం ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో సాగింది. తనంతరం స్వామివారిని పంచామృతాలతో అభిషేకించారు. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి గణేష్, గూనూరు నారాయణమూర్తి, సకల సూరిబాబు, జ్యోతుల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగ విద్యార్థుల ఆటల పోటీలు

రావికమతం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భవిత కేంద్రం వద్ద దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను పైలా ఫౌండేషన్ సమన్వయకర్త బాదిరెడ్డి అశోక్ ప్రారంభించారు. భవితకేంద్రం ఐఈఆర్టీ మహాలక్ష్మీనాయుడు, జగన్నాథనాయుడు, సీఆర్పీలు రామారావు, శ్రీను పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో మండలం నలుమూలల నుంచి సుమారు 60మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. రన్నింగ్, ఖోఖో, మ్యూజికల్ చైర్, బాల్‌గేమ్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పైలా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఏపీ జన్మభూమి కమిటీ సమన్వయకర్త పైలా ప్రసాదరావు మాట్లాడుతూ దివ్యాంగుల్లో మనోస్థైర్యం నింపేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విజేతలకు ఈ నెల 15 బహుమతులందజేస్తామని, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులుంటాయని అన్నారు.



మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న దివ్యాంగ విద్యార్థులు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గంగవరంలో వైద్య శిబిరం

రోలుగుంట : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కుసుమ కుమారి సూచించారు. మండలంలోని గంగవరంలో శుక్రవారం బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏర్పాటు చేశారు. 35 మందికి వైద్యపరీక్షలు జరిపారు. వీరిలో ఇద్దరికి సాధారణ జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. వైద్యాధికారి బాపిరాజు, ఎంపీహెచ్ఈవో అప్పలనాయుడు, సూపర్‌వైజర్ రమణ పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

రావికమతం: మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని నర్సీపట్నం డివిజన్ ఏపీఈపీడీసీఎల్ డీఈ వైఎల్ ప్రతాప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ విద్యుత్‌లైన్‌లో మరమ్మ తులతోపాటు చెట్టు తొలగింపును శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ చేపట్టనున్నామని, ఈ దృష్ట్యా రావికమతం మండలం కొత్తకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

మండల స్థాయి అధికారులకు కలెక్టర్ ఆదేశం

చోడవరం: అల్పపీడన ప్రభావంతో ఈ నెల 13 నుంచి 15 వరకూ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, మండలాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ జిల్లా కలెక్టర్ మండల స్థాయి అధికారులకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా మండలాల్లో తహసీల్దారులు, ఇతర అధికారులు మండల కేంద్రాల్లోనే ఉండి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమాచారం పంపించాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

రావికమతం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, బీసీ కార్పొరేషన్ల ద్వారా రాయితీపై ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాల కోసం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా కార్పొరేషన్లు, బ్యాంకుల అధికారులు ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. రావికమతం ఆంధ్రాబ్యాంకు, డీసీసీబీ కొత్తకోట ఎస్‌బీఐ మేనేజర్లు కిరణ్‌కుమార్, కిశోర్, యు.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ రుణాల కోసం మండలంలోని 380మంది లబ్ధిదారులు కిరాణా, డెయిరీ, వస్త్ర దుకాణాలు, పాన్‌షాపు, జిరాక్స్/డీటీపీ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకున్నారు. యూనిట్ల స్థాపన, వాటి నిర్వహణ, బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను తిరిగి ఏ విధంగా చెల్లించాల్సి ఉంటుంది, ఎంత ఖర్చు అవుతుంది, ఎంత మిగులుతుంది తదితర అంశాలపై దరఖాస్తుదారులను బ్యాంకు అధికారులు అడిగి తెలుసుకున్నారు.



లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

రూ.1.75 కోట్లతో అడ్డసరం రోడ్డు పనులు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు

రోలుగుంట : మండలంలోని దిబ్బలపాలెం-అడ్డసరం తారురోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1.75 కోట్లు మంజూరయ్యాయి. మొత్తం 4.1 కిలోమీటర్ల పరిధి గల రోడ్డును ఇప్పటికే మెటల్ వేసి చదును చేశారు. రానున్న నాలుగైదు రోజుల్లో తారువేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం ఆర్ అండ్ బి అధికారులు శ్రీనివాసరావు, హరిణి రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పరిశీలించారు. తమ సిబ్బందితో వచ్చి అక్కడ నమూనాలు తీసి నాణ్యత పరిశీలించారు.

అన్నదాతల ఆనందం

గుమ్మిడిగొండ, వెదురుపల్లిల్లో ఆయకట్టుకు అందనున్న సాగునీరు

రూ.62 లక్షలతో పంట కాలువలు

రైతులకు బాసటగా నిలిచిన నీరు-చెట్టు

నాతవరం:
మండలంలో నీరు-చెట్టు నిధులతో సాగునీటి కాలువల పనులు చేపట్టడంతో రైతులు సంబరపడుతున్నారు. గుమ్మిడిగొండ, వెదురుపల్లి గ్రామాల్లో రూ.62లక్షలతో పంట కాలువల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గుమ్మిడిగొండలో చాలాకాలంగా పూసపాటి కాలువలు తుప్పలతో అధ్వానంగా ఉండేవి. దీంతో ఆయకట్టు చివరి భూములకు సాగునీరు సకాలంలో అందేది కాదు. దీంతో ఈప్రాంత ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల అధ్యక్షుల కోరిక మేరకు నీరు-చెట్టు నిధుల నుంచి రూ.22 లక్షలను మంంత్రి అయ్యన్నపాత్రుడు మంజూరు చేయించారు. దీంతో పంట కాలువల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు చివరి దశకు చేరుకుంటున్నాయి. ఇక్కడ పంట కాలువల నిర్మాణం పూర్తయితే 30 ఎకరాలకు సాగునీరు అందనుందని రైతులు అంటున్నారు. అలాగే ఈ పంట కాలువల ద్వారా గుమ్మిడిగొండ, ఊరచెరువుకు కూడా నేరుగా తాండవ నీరు, కొండగెడ్డల నీరు చేరుతుందని రైతులు అంటున్నారు. మరొక రూ.4 లక్షల వ్యయంతో గుమ్మిడిగొండలో కొండగెడ్డపై 'దోనె' ఏర్పాటు చేయనున్నామన్నారు. గతంలో తాటిచెట్టు దోనె ద్వారా తాండవ నీరు కొండగెడ్డ భూములకు వచ్చేదని రైతులు అంటున్నారు. అలాగే వెదురుపల్లిలో రూ.36 లక్షల నీరు-చెట్టు నిధులతో పంట కాలువల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోనున్నాయి. వెదురుపల్లిలో పంట కాలువల నిర్మాణ పనులు పూర్తయితే 500 ఎకరాలకు సాగునీరు అందనుందని దిగువ ఆయకట్టు రైతులు ఆనంద పడుతున్నారు. ఇరవై ఏళ్లుగా పంట కాలువలు సరిగ్గా లేకపోవడంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను మంత్రి అయ్యన్న దృష్టికి తీసుకెళ్లడంతో రూ.36 లక్షలు మంజూరు చేయించారని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది రూ.62లక్షలతో పంట కాలువల నిర్మాణం పూర్తయితే గుమ్మిడిగొండ, వెదురుపల్లిలలో 800 ఎకరాలకు సాగునీరు అందనుందని దిగువ ఆయకట్టు రైతులు ఆనంద పడుతున్నారు.


గుమ్మిడిగొండలో పూసపాటి పంట కాలువల నిర్మాణం పూర్తవుతున్న దృశ్యం

తుది దశకు పంట కాలువల నిర్మాణం

చింతకాయల ప్రసాద్, గుమ్మిడిగొండ


గుమ్మిడిగొండలో పూసపాటి పంట కాలువల నిర్మాణానికి నీరు-చెట్టు నిధుల నుంచి రూ.22 లక్షల మంజూరు కావడంతో ప్రస్తుతం పంట కాలువల పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇది దిగువ ఆయకట్టు రైతులకు ఎంతో ప్రయోజనం.

రూ.4లక్షలతో దోనె నిర్మాణం

అడిగర్ల శ్రీను, రైతు, గుమ్మిడిగొండ


గుమ్మిడిగొండలో కొండగెడ్డపై రూ.4లక్షల దోనె నిర్మాణం చేపట్టడం దిగువ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం. ఇక్కడ దోనె లేకపోవడంతో గతంలో ఎన్నో కష్టాలు పడేవారం.

రుణాల ఇంటర్వ్యూలకు విశేష స్పందన


లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకర్లు

గొలుగొండ:
మండలపరిషత్‌లో శుక్రవారం వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 501 మంది హాజరయ్యారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు కార్పొరేషన్ల రుణాలకు గత నెల 31తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండలానికి బీసీలకు 170, ఎస్సీలకు 94, ఓసీలకు 130 , ఎస్టీలకు 17 సబ్సిడీ యూనిట్లు మంజూరయ్యాయని ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలానికి వివిధ కార్పొరేషన్ల ద్వారా అధిక సబ్సిడీ యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అందరు లబ్ధిదారులకు రుణాలు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చిటికెల తారక వేణుగోపాల్, గొలుగొండ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శరత్‌చంద్ర, ఐదు బ్యాంకుల మేనేజరు, ఈవోపీఆర్‌డీ త్రిమూర్తులు పాల్గొన్నారు.

సోలార్లు వచ్చేశాయి..



గొలుగొండ:
ఎన్‌టీఆర్ జలసిరికి సోలార్లు వచ్చేశాయి. మండలంలో 250 మంది రైతులు జలసిరి బోరులకు ఆన్‌లైన్ దరఖాస్తు చేశారు. ఆ జాబితా ఆధారంగా జియాలజిస్టు లబ్ధిదార్ల పొలాల్లో నీటిసామర్థ్యం పరీక్షలను నిర్వహించారు. ఈసర్వే ఆధారంగా ప్రభుత్వం నియమించిన కమిటీ లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసింది. మండలంలో 84 మందికి జలసిరి బోర్లు మంజూరు చేశారు.

476 మందికి ఇళ్ల మంజూరు పత్రాలు

మాకవరపాలెం:
మండలంలో ఈనెల 18న 476 మందికి ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షులు రుత్తల శేషుకుమార్ తెలిపారు. శుక్రవారం హౌసింగ్ అధికారులు, నాయకులతో ఈవిషయంపై చర్చించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో 476 మందికి ఎన్టీఆర్ గృహ పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వారికి ఈనెల 18న మంజూరు పత్రాలను మంత్రి అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే 17న నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం రహదారి నిర్మాణానికి తామరం హైస్కూల్ వద్ద శంకుస్థాపన చేస్తారన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో ప్రాణాన్ని నిలబెట్టండి

మున్సిపల్ వైస్‌చైర్మన్ సన్యాసిపాత్రుడు... నర్సీపట్నంలో ర్యాలీ

నర్సీపట్నం టౌన్:
అన్ని దానాల కంటే అవయవ దానం ఎంతో గొప్పదని మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు అన్నారు. శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 13న ప్రపంచ అవయవదానం దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో విద్యార్థులతో కలసి ఐదురోడ్ల జంక్షన్ నుంచి అబీద్‌సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ మృతిచెందిన వ్యక్తుల అవయవాలను వారి కుటుంబసభ్యుల అనుమతితో వేరొకరికి అమర్చడం వలన ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు బి.వి జయ్‌కుమార్ మాట్లాడుతూ రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ జేవీ. రామారావు ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించామన్నారు. 13వ తేదీ ఉదయం 8గంటల నుంచి అబీద్‌జంక్షన్‌లో ఒక ప్రత్యేక కౌంటర్ పెట్టి అవయవదానం చేసే వారి పేర్లు నమోదు చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు, జేవీ.రాజ్‌కుమార్, శ్రావణ్, కన్నయ్యశెట్టి, నారాయణరావు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ వైస్‌చైర్మన్ సీహెచ్ సన్యాసిపాత్రుడు

వేములపూడిలో గర్భిణులకు సీమంతాలు


సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నర్సీపట్నం టౌన్: మండలంలోని వేములపూడి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు శుక్రవారం నిర్వహించారు. అనంతరం ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌సీ ఏఎన్‌ఎం వజ్రం వివరించారు. ఈసందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జి.ఆషా జ్యోతి, దేవుడమ్మలతోపాటు లింకువర్కర్‌లు, హెల్పర్‌లు పాల్గొన్నారు.

దశలవారీగా రుణాలు మంజూరు


దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

నాతవరం:
టీడీపీ ప్రభుత్వం అర్హులైన వారందరికీ దశల వారీగా రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కృషి చేస్తుందని ఎంపీపీ ఎస్. సన్యాసిదేముడు అన్నారు. శుక్రవారం నాతవరంలో బీసీ, ఎస్సీ, కాపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓసీ 160, ఎస్సీ 224, బీసీ 190, ఎస్టీ10 మందికి రుణాలు మంజూరయ్యాయన్నారు. వీరందరికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి

నాతవరం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహనతో ఉండాలని వ్యవసాయశాఖ ఏడీ వసంతకుమారి కోరారు. శుక్రవారం ఎస్‌బీ పట్నంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు స్వయంగా విత్తనాలు ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. గోమాత విశిష్టత, బీజామృతం, కషాయంల తయారీ గురించి తెలియజేశారు. నీటిపారుదల శాఖ జేఈ శ్యామ్ మాట్లాడుతూ నీటి యాజమాన్యం, చెరువుల సంరక్షణ గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు నూకాంబిక ట్రస్ట్ పాలకవర్గ ప్రమాణస్వీకారం

నాతవరం: మండలంలోని జిల్లేడుపూడి నూకాంబిక ఆలయ ట్రస్ట్‌బోర్డు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం శనివారం జరగనుందని ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌చౌదరి తెలిపారు. 18 మంది సభ్యులతో ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.కొత్తఅమావాస్య ఉత్సవాలు, ఆలయ అభివృద్ధి, తదితర కార్యక్రమాలన్నింటిని కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

- కనీస సౌకర్యాలు లేని రాజుగారిబీడు కాలనీ
- ఇళ్లను ఆనుకుని మురుకు గుంతలు
- ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు
- దోమల వ్యాప్తితో రోగాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు





రాజుగారిబీడు కాలనీలో ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు నీరు

'రాజు గారి' కోటలో... సమస్యలు బందీ

పాయకరావుపేట: పట్టణంలోని రాజుగారిబీడు కాలనీలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ముఖ్యంగా డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు మురికికూపాలుగా దర్శనమిస్తున్నాయి. నివాసాల ముందు నెలలు తరబడి మురుగు నిలిచిపోతుండడంతో ప్రజలు దుర్వాసనకు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. పాయకరావుపేట మేజరు పంచాయతీలో ఉద్యోగ, ఉన్నత వర్గాలు నివాసం ఉండే ప్రాంతాల్లో రాజుగారిబీడు ప్రధానమైనది. గౌతమ్ పబ్లిక్ స్కూల్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు ఈకాలనీ విస్తరించి ఉంది. అయితే మెయిన్ రోడ్డును ఆనుకుని సుమారు 200 ఎకరాల్లో ఉన్న ప్రాంతాన్ని కొంతమంది వుడా నిబంధనలు పాటించకుండా పొట్లుగా విభజించి విక్రయాలు జరిపారు. కాలనీలో కనీసం రోడ్లు, డ్రెయిన్లు కూడా ఏర్పాటు చేయకపో వడంతో ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల ఎదుట ఏర్పాటు చేసుకున్న మురికి గుంతలను నెలలు తరబడి శుభ్రం చేయకపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. దీనికి తోడు కొంతమంది తమ నివా సాల్లోని మురికినీటిని పక్కనున్న ఖాళీ స్థలాల్లోకి మళ్లిస్తుండడంతో ఆ ప్రాంతమంతా మురికి కూపాలుగా మారుతున్నాయి. దోమలు, పందులకు ఆవాసంగా మారి సమీప నివాసితులకు నరకాన్ని చూపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు కాలనీలో పలుచోట్ల సీసీ రోడ్లు, అక్కడక్కడ కాలువలు ఏర్పాటు చేసినా అవుట్ లెట్లు లేక శివారు ప్రాంతాల్లో మురికినీరు



కాలువలు లేని ఓ వీధి



నివాసం చెంత మురుగు

నిలిచిపోతోంది.ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలనీలో రోడ్లు, కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఖాళీ స్థలాల్లో మురికినీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నారు. కాగా ఈ విషయమై పంచాయతీ ఈఓ లవరాజు వద్ద వివరణ కోరగా రాజుగారి బీడులో పలు వీధుల్లో సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణానికి ఎస్టిమే షన్లు తయారు చేస్తున్నామన్నారు. ఖాళీ స్థలాల్లో మురికినీరు వెంటనే తొలగించి తాత్కాలిక చర్యలు తీసుకుంటామని, నీరు నిల్వ లేకుండా స్థల యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. స్పందించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రూ. 25 లక్షలతో రోడ్లు, కాలువలు

నారపురెడ్డి పద్మావతి, వార్డు సభ్యురాలు



రాజుగారిబీడులో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభ మవుతాయి. అయితే మురుగునీరు పోయేందుకు అవుట్‌లెట్లు లేనందున డ్రెయిన్లను నేరుళ్ల కాలువకు అనుసంధానం చేయాల్సి ఉంది.

నరకం చూస్తున్నాం

బాలేపల్లి గంగరాజు, రాజుగారిబీడు,



ఇంటి పక్క ఖాళీ స్థలంలో మురికినీరు నిలిచి పోవడంతో దోమలు, పందులు పెరిగి పోయి రోజూ నరకాన్ని చూస్తున్నాం. దోమలతో ఇంట్లో అందరికీ ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇప్ప టికైనా అధికారులు స్పందించి రాజుగారిబీడులో మురికి సమస్య పరిష్కరించాలి.



మత్స్యకార కుటుంబానికి రూ.2లక్షలు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిత

మత్స్యకార కుటుంబానికి చెక్కు అందజేత

ఎస్.రాయవరం(నక్కపల్లి) : ఎస్.రాయవరం మండలం బంగారమ్మపేట గ్రామానికి చెందిన మత్స్యకార కుటుంబానికి మంజూరైన పరిహారం చెక్కును ఎమ్మెల్యే అనిత శుక్రవారం అందజేశారు. ఆ గ్రామానికి చెందిన ఎరుపిల్లి శ్రీను సముద్రంలో చేపల వేట సాగిస్తూ మరణించాడు. ఈ మేరకు ఆయన భార్య అన్నవరానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల పరిహారానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మత్స్యకారుల జీవన స్థితిగతులు, ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలు పడుతున్న ఇబ్బందులను జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు మాతా గుర్నాధరావు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి ఎఫ్‌డీవో సీతారామరాజు, బంగారమ్మపేట సొసైటీ అధ్యక్షుడు కొవిరి రమణ, స్థానిక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్



వ్యాక్సిన్ వేసే విధానాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయకుమారి

కోటవురట్ల : మండల కేంద్రంలోని శ్రీవిధాన్ పాఠశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది శుక్రవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు.ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నెలలు నుంచి 15 ఏళ్ల పిల్లలకు మీజిల్స్, రూబెల్లా వ్యాధులు రాకుండా ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్నామని చెప్పారు. మీజిల్స్, రూబెల్లా ప్రాణాంతకమైన వ్యాధులు అని, దగ్గడం, తుమ్మడం ద్వారా వచ్చే మరొకరికి వ్యాపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కె. వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యుడు ప్రశాంత్‌కుమార్, బీజేవీ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

కోటవురట్ల : వరహా నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కోటవురట్ల పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు.. పోలీసులు దాడి చేసి, వరహా నది ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఈ మేరకు సీజ్ చేసిన ట్రాక్టర్‌ను నర్సీపట్నం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తరలించినట్టు ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సర్పా, వరహానదుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

నక్కపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకుల నియామకం నక్కపల్లి సీడీపీవోకార్యాలయం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుందని సీపీఎం డివిజన్ కన్వీనర్ అప్పలరాజు ఆరోపించారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కాంట్రాక్ట్ పద్ధతిపై సూపర్‌వైజర్లను నియమించాల్సి వుందన్నారు.దీనికి డిగ్రీ అర్హత, పదేళ్ల అనుభవం వుండాలన్నారు.కానీ ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుందని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

పింఛను ఇప్పించరూ..!

పాయకరావుపేట : పుట్టినప్పటి నుంచి కళ్లు కనిపించని తన కుమార్తెకు పింఛను మంజూరు చేయాలని పట్టణానికి చెందిన దుర్గాడ నాగలక్ష్మి అధికారులను కోరారు. శుక్రవారం ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. నాగలక్ష్మి కుమార్తె ఆశ (10) తొమ్మిది నెలల ప్రాయంలోనే కంటిచూపు పోగొట్టుకోవడంతో అప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామన్నారు. తనకు ఆశతో పాటు ఒక బాబు ఉండగా, తన భర్త లక్ష్మణ్ ప్రైవేటు సంస్థలో డ్రైవరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారన్నారు. చాలీచాలని జీతంతో కుటుంబపోషణ భారంగా ఉందన్నారు. తమ కుమార్తెకు



కుమార్తె ఆశతో తల్లి నాగలక్ష్మి

పింఛను కోసం దరఖాస్తు చేసుకుని ఆరేళ్లు కావస్తున్నా మంజూరు కాలేదన్నారు. సదరన్ సర్టిఫికెట్‌లో వంద శాతం అంధకారమని పేర్కొన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

వీఆర్‌ఓలతో తహసీల్దార్ సమావేశం

కోటవురట్ల : రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటిక్ వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, వాటిని సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే రికార్డులు అప్‌డేట్‌గా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఈ సమావేశంలో డీటీ రమేష్, ఆర్‌ఐ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా నీలవేణిదేవి



కోటవురట్ల: మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా చిన్న పిల్లల వైద్యురాలు మద్ది నీలవేణిదేవి నియామితులయ్యారు. ఈ మేరకు జిల్లా వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ నాయక్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిన్నటివరకు ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసిన రాజేష్‌కుమార్‌నుంచి శుక్రవారం ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఈమె నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



హాజరైన గృహ నిర్మాణ లబ్ధిదారులు

అర్హులందరికీ ఇళ్లు

పార్టీలతో సంబంధం లేదు
మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
లబ్ధిదారులకు అవగాహన

ఎలమంచిలి : మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పట్టణ పేదలకు సొంతింటి కల నెరవేర్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలా కాకుండా పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులు పైసా లంచం ఇవ్వకుండా నేరుగా బ్యాంకు నుంచి తీసిన డీడీలను అధికారులకు అందజేయాలన్నారు. నిజమైన అర్హులను ఎంపిక చేస్తున్న పాలకవర్గ సభ్యులను అభినందించారు. మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేసిన గృహ నిర్మాణ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ గౌరు, టీడీపీ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్, బీసీ సంఘం జిల్లా నేత మళ్ల కొండబాబు, కౌన్సిలర్లు, నేతలు దొడ్డి వెంకటేష్, వనుం గీతా గ్రేస్, దత్తాత్రేయ, సుందరపు బాబ్జీ, మళ్ల జగన్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూనగర్‌లో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

సమస్యలు పరిష్కరిస్తాం : కమిషనర్

ఎలమంచిలి : వార్డుల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి నెహ్రూనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వనుం గీతాగ్రేస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి: పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ డీఈ మహేంద్రనాథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా పట్టణంలో మాత్రమే సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

కొనసాగిన కుమార్ దీక్ష

మునగపాక : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రతిపక్షనేత జగన్ క్షమాపణ చెప్పి తీరాలని డిమాండ్ చేస్తూ జిల్లా తెలుగు యువత నాయకుడు ఆడారి కుమార్ చేస్తున్న దీక్ష శుక్రవారం నాటికి రెండవరోజుకు చేరుకుంది. కుమార్‌కి స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కాగా జెడ్పీటీసీ దాడి లక్ష్మీ సత్యనారాయణ, ఎంపీపీ ఆడారి మంజు, తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి జానకి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు మద్దాల వీరునాయుడు, దొడ్డి రమేష్, జేకేబ్రదర్స్,రాపేటి పరమేష్ తదితరులు దీక్ష శిబిరంలో కుమార్‌కి మద్దతు తెలిపారు.

మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా విజయ

అచ్యుతాపురం : మండల మహిళా సమాఖ్య నూతన అధ్యక్షులుగా రాయి విజయలక్ష్మి ఎన్నికయ్యారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో మహిళా సమాఖ్య మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్థిక లావాదేవీలు, మహిళా సమాఖ్య ముందస్తు ప్రణాళికలపై నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాయి విజయలక్ష్మి, కార్యదర్శిగా నాగమల్లి మణి, కోశాధికారిగా ఈరిగల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు దాసరి పద్మ అధక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు,ఎంపీడీఓ బలరాం, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ పి. అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా యోచనలో జెడ్పీటీసీ దాడి?

మునగపాక :జెడ్పీటీసీగా ఎన్నికైనప్పటి నుంచి తనకు సరైన సమాచారం ఇవ్వకపోవడం, ఫ్లెక్సీల్లో తన ఫొటో పెట్టకపోవడంతో జెడ్పీటీసీ దాడి లక్ష్మీ సత్యనారాయణ ఆవేదనకు గురైనట్లు తెలిసింది. తన అనుచరులు కొంతమంది వద్ద పార్టీ నాయకులు తనను అవమానపరుస్తున్నారని, ఈ అవమానాలు భరించే కంటే పార్టీకి రాజీనామా చేయడమే మంచిదని భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఆయన పార్టీకి రాజీనామా చేయాలని యోచిస్తున్నట్టు తెలిసింది.

బీజేపీ నేత అప్పారావు మృతి

మునగపాక : స్థానిక ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న బీజేపీ సీనియర్ నాయకుడు కారు అప్పారావు(54) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల బీజేపీ రాష్ట్ర నాయకుడు బద్దెం సూర్యానారాయణ, మండల శాఖ అధ్యక్షుడు దొడ్డి వెంకట సత్యనారాయణ, సంతాపం తెలిపారు.

ఇమాం చెక్కులు అందజేత

అచ్యుతాపురం : ముస్లింలు ఐకమత్యంతో మెలగాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. అచ్యుతాపురంలోని మసీద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎం.జగన్నాథపురం, అచ్యుతాపురం మసీద్‌లకు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన ఇమాం చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, ఎంపీడీఓ బలరాం, టీడీపీ నాయకులు కె.సూర్యనారాయణ, బలిరెడ్డి శ్రీను, రామునాయుడు, కూండ్రపు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం పెద్దలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

డిఫెన్స్ కోర్సుల్లో యువతకు శిక్షణ

జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ సిరి

అనకాపల్లి రూరల్: డిఫెన్స్ కోర్సులైన నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లతో యువతకు ఉచిత శిక్షణఇవ్వనున్నట్టు జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.సిరి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన ఆమె విలేకరులతో మాట్లాడారు. డిఫెన్స్‌లో చేరాలనుకునేయువకులకు సెలక్షన్స్ వెళ్లేముందే శిక్షణ పొందితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. శిక్షణ పొందగోరువారు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని శనివారం విశాఖపట్నం ఉడా చిల్డ్రన్స్ థియేటర్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఉత్సవాల్లో పాల్గొన్నవారికి పలు అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈనెల 29వ తేదీన అనకాపల్లిలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

ఆస్తి పన్ను పేరు మార్పిడిపై ఫిర్యాదు

ఎలమంచిలి : మున్సిపాలిటీలో కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులకు కోర్టు పరిశీలనలో ఉన్నప్పటికీ ఆస్తిపన్ను పేర్లు టాంపరింగ్ చేశారంటూ ఎలమంచిలి మస్‌జిద్ ఈథ్‌గా కబర్‌స్థాన్ మేనేజింగ్ కమిటీ జనరల్ సెక్రటరీ షేక్ ఖన్నాసాహెబ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిపై మున్సిపల్ ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న సర్వే నెంబరు 388-1లో సుమారు 2.36 ఎకరాలు ఏపీ వక్ఫ్ నోటిఫైడ్ ఆస్తిగా 30-11-1961న ఏపి గజిట్‌లో నమోదైంది. ఈ ఆస్తి ఆక్రమణదారులపై వక్ఫ్‌బోర్డు గతంలో ఎలమంచిలి కోర్టులో కేసు వేసింది. ఈ మేరకు ఆక్రమణదారులు హైకోర్టులో అప్పీలు చేశారు. ఈ స్థల వివాదం కోర్టు పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. కోర్టు పరిశీలనలో ఉన్న ఈ స్థలానికి 2016 సంవత్సరానికి వచ్చేసరికి అంతకుముందు ఉన్న పేరు కాకుండా ఆస్తిపన్నులో పేర్లు మార్చి ఉన్నట్టు తమ దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు కోసం సమాచార హక్కు చట్టం ద్వారా 10-7-2017న మున్సిపల్ అధికారులకు దరఖాస్తు చేసినప్పటికీ ఇంటి పన్నులు అసెస్మెంటు వేసిన వాటికి పన్నులు చెల్లింపు జరుగుతున్నదని, సదరు పత్రాలు కార్యాలయంలో అందుబాటులో లేవని వివరణ ఇచ్చారని తెలిపారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ఆస్తులు కోర్టు పరిశీలనలో ఉన్నప్పటికీ ఆస్తిపన్ను పేర్లు మార్పు చేసి టాంపరింగ్ చేశారని ఆరోపించారు. దీనిపై ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినట్లు ఖన్నాసాహెబ్ తెలిపారు.

కొక్కిరాపల్లిలో 'బడి రుణం తీర్చుకుందాం'



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, తదితరులు

ఎలమంచిలి : అక్షరాలు నేర్చుకున్న పాఠశాల రుణం తీర్చుకోవడం గొప్ప విషయమని చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. శుక్రవారం కొక్కిరాపల్లి వార్డులోని స్కూలులో బడి రుణం తీర్చుకుందాం అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బొడ్డేడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ కన్నతల్లిని, పుట్టిన గ్రామాన్ని, చదువు చెప్పిన బడి రుణం తీర్చుకోవాలన్నారు.అనంతరం దాతలు అందించిన ప్రాజెక్టు పుస్తకాలు, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ అందించిన బూట్లును చైర్‌పర్సన్ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ప్రోగ్రామ్ అధికారి జగన్నాథం, మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ, గ్రామ పెద్ద మజ్జి రాంబాబు, నేతలు పెయ్యల రామకృష్ణ, మజ్జి వీరబాబు, ఉపాధ్యాయులు ఆర్‌కేవీ రమణ, సారధి, భారతి, కిరణ్మయి, బాగ్యలక్ష్మి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలి'

మునగపాక : స్వయం సహాయక బృందాల ద్వారా మహిళలకు నాయకత్వ లక్షణాలు, ఆర్థిక పరిపాలనపై అవగాహన పెరిగిందని జెడ్పీటీసీ సభ్యుడు దాడి లక్ష్మీసత్యానారాయణ అన్నారు. మునగపాక మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం, ప్రగతి నివేదిక శుక్రవారం వెలుగు కార్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అవసరాలు తీరడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. ఏరియా కో-అర్డినేటర్ అరుణకుమారి మాట్లాడుతూ గతఏడాదిమండలంలో బ్యాంకుల ద్వారా 57 కోట్ల 48 లక్షలు, స్త్రీనిధి ద్వారా 2 కోట్ల 52 లక్షలు రుణాలు అందజేశామని చెప్పారు. ఈ సమావేశంలో ఐబీడీ బీఎం రమణ, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో
పెదరెల్లి వీధి

- వర్షం కురిస్తే రహదారులపైనే మురుగునీరు
- విజృంభిస్తున్న దోమలు
- కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- ఇరుకుమయంగా రహదారులు
- కల్యాణ మండపం నిర్మాణం కోసం వినతి
- పట్టించుకోని అధికారులు


ప్రధాన రహదారిపైనే ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం


పూడికలతో నిండిన మురుగునీటి కాలువ

నెహ్రూచౌక్: పారిశుధ్య కార్మికులు అధిక శాతం మంది నివసిస్తున్న పెదరెల్లివీధి వాసులు సమస్యల వలయంలో వున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పెదరెల్లి వీధి ప్రాంతంలో జీవీఎంసీ కార్మికులు అత్యధి కంగా నివసిస్తున్నారు. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కనే ఉన్న పెద రెల్లి వీధి ఏర్పడి చాలా ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి మాత్రం చెందలేదు. ఇక్కడ సుమారు 350 కుటుంబాలు వుండగా వెయ్యి మందికి పైగా ప్రజలు జీవిస్తున్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే జీవీఎంసీ కార్మికుల ఇళ్ల వద్ద మాత్రం పరిశుభ్ర వాతావరణం కనిపించడంలేదు. పేరుకు పెదరెల్లివీధి అయినా వీధి మొత్తం లోతట్టు ప్రాంతం కావడంతో చిరుజల్లులకు కూడా రహదారులన్నీ మురుగునీటి ప్రవాహాలుగా మారుతున్నాయి. ఇళ్ల మధ్యలో ఇరుకుగా రహదారులు, కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు, మురికి కూపంలా చెత్త కుప్పలు, అధ్వానంగా డ్రైనేజీ కాలువలతో పెదరెల్లి వీధి సమస్యల వలయంలో వుంది. ఫలితంగా దోమలు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతం ఇరుకు కావడం వల్ల సీసీ రోడ్లు ఇరుకుగా ఉండడంతో స్థానికులు ద్విచక్ర వాహనాలు సైతం ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ కల్యాణ మండపం నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో ఇప్పటివరకు మండపం మంజూరు కాకపోవడంతో అదే ప్రాంతంలో శుభకార్యాలను చేసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా పెద రెల్లి వీధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


పెద రెల్లి వీధిలో ఇరుకుగా ఉన్న వీధి


ఇళ్ల పైనుంచి వెళుతున్న విద్యుత్ వైర్లు


వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

విజృంభిస్తున్న దోమలు



పెద రెల్లి వీధిని ఆనుకుని పంట కాలువ ఉండడం వల్ల కాలువలో మురుగు ప్రవహించడంతో వీధిలో దోమల సంచారం అధికంగా ఉంది. ఉదయం, సాయంత్ర తేడా లేకుండా దోమలు కుట్టడం వల్ల అధిక మంది రోగాలబారిన పడుతున్నారు. వీధిలో మురుగునీటి కాలువలను ఏర్పాటు చేసి మురుగు తిష్ఠ వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

జలగడుగుల హరి, స్థానికుడు

సమస్యలు పరిష్కరించాలి



పట్టణంలోని అన్ని వీధులు శుభ్రపరిచే మాకు ఇంత దయనీయ పరిస్థితి ఉందని ఎన్నిమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. మా ప్రాంతం లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం కురిస్తే వీధి మొత్తం మురికి కూపంలా దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి పెద రెల్లి వీధిలో సమస్యలను పరిష్కరించాలి.

ఎస్.రాజేష్, స్థానికుడు

పెదరెల్లి వీధిలో కల్యాణ మండపానికి కేటాయించిన స్థలం



నాణేల ఎగ్జిబిషన్‌తో
సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన


స్టాంపులను, నాణేలను సందర్శిస్తున్న విద్యార్థులు

నెహ్రూచౌక్:పురాతన నాణేలు, స్టాంపుల ఎగ్జిబిషన్‌తో విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందని భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు అన్నారు. స్థానిక గూడ్స్‌రోడ్‌లో గల భాష్యం పాఠశాలలో పురాతన నాణేలు, నోట్లు, స్టాంపుల ఎగ్జిబిషన్ కార్యక్రమం ఎం.రాజాజీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 150 దేశాలకు సంబంధించిన నాలు, నోట్లు, స్టాంపులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో న్యుమిస్ మ్యాటిక్ సొసైటీ ఆఫ్ విశాఖ అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారి బ్రాహ్మజీ, డాక్టర్ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

మొండిపాలెం కాలనీ లేఅవుట్ నిర్మాణానికి చర్యలు


భూమిని చదును చేస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని సుందరయ్యపేట గ్రామ పంచాయతీ శివారు అచ్చియ్యపేట వద్ద మొండిపాలెం కాలనీ ఏర్పాటుకు సంబంధించి లేఅవుట్ నిర్మాణానికి శుక్రవారం చర్యలు చేపట్టారు. సర్వే నంబర్ 511లో కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో భూమి ఎత్తుపల్లాలు ఉన్నాయని మండల సర్వేయర్ లీల చెప్పడంతో ప్రొక్లయిన్‌తో యంత్రంతో భూమిని చదును చేస్తున్నారు. లేఅవుట్ నిర్మాణానికి అనుగుణంగా భూమిని చదును చేయడానికి రెండు రోజుల సమయం పడుతుందని గ్రామ టీడీపీ నాయకుడు రేఖా రమణమూర్తి తెలిపారు.

గోవర్ధనగిరిపై 14 నుంచి కృష్ణాష్టమి వేడుకలు

కొత్తూరు: మండలంలోగల సత్యనారాయణపురం గ్రామంలోని గోవర్ధనగిరి శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని అనకాపల్లి కన్యకాపరమేశ్వరీ అయ్యప్ప దేవాలయం ప్రధాన అర్చకుడు గోపినంబాళ మాధవాచార్యులు తెలిపారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గోవర్ధనగిరి కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. గోవర్ధనగిరిపై 27అడుగుల శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈనెల15న కృష్ణాష్టమి సందర్భంగా 14 నుంచి 16వ తేదీ వరకు గోవర్ధనగిరిపై కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నామన్నారు.పీవీ నాగబాబు, కటకం లక్ష్మణరావు, ఉప్పల శ్రీనివాసరావు, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రేలారే రేలా


రేలారే రేలా కార్యక్రమం దృశ్యం

అనకాపల్లి టౌన్: స్థానిక కోట్నివీధిలో మరిడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా గురువారం రాత్రి ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. రేలారే రేలా కార్యక్రమం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. భీమునిగుమ్మం జంక్షన్, రింగురోడ్డు, కోట్నివీధుల్లో ఏర్పాటుచేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్‌లు యువతలో ఉత్సాహాన్ని నింపాయి. బుల్లితెర నటుడు రమేష్, డ్యాన్స్‌మాస్టర్ ఫరీద్‌లు చేసిన నృత్యాలతో యువతలో ఉత్సాహం వెల్లివిరిసింది. బాణసంచా వెలిగించారు.